ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం 08.08.2026 | సంపుటి :13 సంచిక : 19 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV



# రాష్ట్ర ఆర్థిక పరిపుష్టికి కసరత్తు

## జీఎస్టీ లోపాలను అరికట్టేందుకు ఏఐతో అనుసంధానం

### ప్రముఖ ఆర్థికవేత్త అరవింద్ సుబ్రహ్మణియన్‌తో రేవంత్ రెడ్డి భేటీ

- పన్నుల ఎగవేతకు అడ్డుకట్ట వేసేందుకు కృత్రిమ మేధస్సు
- వ్యాపారులను ఇబ్బంది పెట్టకుండానే ఇది తోడ్పడుతుంది : అరవింద్ సుబ్రమణియన్

**తెలంగాణ ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తున్న తరుణంలో రాష్ట్రాన్ని ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్లేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. రాబడి పెంపు, ప్రభుత్వ శాఖల్లో సంస్కరణలపై హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో ప్రముఖ భారత ఆర్థికవేత్త అరవింద్ సుబ్రమణియన్‌తో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీలో ప్రధానంగా వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ శాఖల్లో తేవాల్సిన మార్పులపై సుదీర్ఘంగా చర్చించారు.**



**హైదరాబాద్, ఆగస్టు 7 (జనంసాక్షి) :**
రాష్ట్ర ఖజానాకు ప్రధాన ఆధారమైన జీఎస్టీ రాబడులను పెంచుకోవడంతో పాటు పన్నుల ఎగవేతకు అడ్డుకట్ట వేసేందుకు కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషి యల్ ఇంటెలిజెన్స్ – ఏఐ) సాంకేతికతను రంగంలోకి దించాలని నిర్ణయించారు. వ్యాపారాలు చేసుకునే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సులభ తర వాణిజ్యానికి ప్రాధాన్యం ఇస్తూనే ఈ నూతన సాంకేతికతను వినియోగిస్తామని సీఎం స్పష్టం చేశారు. పన్నుల విధానాన్ని మరింత సులభతరం చేసేలా ఏఐ ఆధారిత సమాచార వ్యవస్థను వాణిజ్య పన్నుల అధికారులకు అందుబాటులోకి తేనున్నారు. ముఖ్యంగా భవన నిర్మాణ రంగంలో జరిగే పన్నుల లీకేజీలను అరికట్టేందుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశారు. అందుకోసం మున్సిపల్, రేరా, పంచాయతీ రాజ్, విద్యుత్, వాణిజ్య పన్నుల శాఖలను ఏఐ సాంకేతికత తో అనుసంధానం చేయాలని భావిస్తున్నారు. భారీ భవనాలు, కాంట్రాక్టు పనులకు అనుమ తులు ఇచ్చే ప్రాథమిక దశలోనే నిర్మాణ సామాగ్రి అవసరాలను, దానికి అయ్యే పన్నుల అంచనాలను నమోదు చేసేలా చర్యలు తీసుకోనున్నారు. ఈ పన్నుల సమాచారంతో పాటు మీసేవా, ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం ఆర్ఎఫ్) వంటి కీలక పథకాల వివరా లను కూడా ఒకే చోటకు చేరిస్తే పరిపాలన మరింత పారదర్శకంగా, సులభంగా మారుతుందని రేవంత్ రెడ్డి తెలిపారు.

వ్యాపారులను ఇబ్బంది పెట్టకుండానే పన్నుల వసూళ్లను పెంచడానికి సాంకేతికత ఎంతగానో తోడ్పడుతుందని అరవింద్ సుబ్రమణియన్ వివరించారు. ఈ కీలక సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం సలహాదారు కె. రామకృష్ణారావు, ఎక్సైజ్ కార్యదర్శి రఘునం దన్ రావు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# డోంట్ వర్రీ..!

## పార్టీ మారిన ఎంపీలకు మోదీ భరోసా

### పార్లమెంటరీ చర్చలలో చురుకుగా పాల్గొనాలని సూచన

### దేశాభివృద్ధి అనేది రాష్ట్రాల ప్రగతిపైనే ఆధారపడి ఉంటుంది : ప్రధాని

**న్యూఢిల్లీ ఆగస్టు 7 (జనంసాక్షి) :** ప్రజాస్వామ్యానికి పార్లమెంట్ అత్యున్నత దేవాలయమని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. పార్లమెంట్ సమావేశా ల్లో ఇటీవల జరుగుతున్న ఆందోళనలు, అంతరాయాలతో కొత్తగా ఎన్నికైన ఎం పీలకు మాట్లాడే అవకాశం దక్కడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సభ సజావుగా సాగాలని, ప్రతి సభ్యు డూ తన అభిప్రాయాలను వెల్లడించే ందుకు అవకాశమివ్వాలన్నారు.
పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా కొత్తగా ఎన్నికైన ఎన్‌డీఏ ఎంపీలతో శుక్రవారం నిర్వహించిన అల్పాహారం కార్యక్రమంలో మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ చరిత్రను అధ్యయనం చేయాలని సూచించారు. అందు లోని చర్చలు, సమాచారాన్ని తెలుసుకుని తమ ప్రసంగాలను ప్రభా వవంతంగా కొనసాగించాలని కోరారు. దేశాభివృద్ధి అనేది రాష్ట్రాల ప్రగతిపైనే ఆధారపడి ఉంటుందన్న ప్రధాని.. ప్రతీ ఎంపీ తన నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఆయా పురోగతి పనులకు సంబంధించి అవసరమైతే నేరుగా తన కార్యాలయా న్ని(పీఎంఓ) సంప్రదించవచ్చని ఆయన చెప్పారు. పేదలు, కార్మికులు, రైతులు సహా అన్ని వర్గాల ప్రజలతో ఎంపీలు కలుసుకుని వారి సమస్యలను తెలుసు కోవాలన్నారు.
ఈ సమావేశానికి శివసేన నుంచి ఏడుగురు, ఎన్‌సీపీఐ తరఫున 20 మంది, ఎన్‌సీపీ(అజిత్ పవార్ వర్గం) నుంచి ఇద్దరు సహా మొత్తం సుమారు 45 మంది ఎంపీలు హాజరయ్యారు. ఇటీవల టీఎంసీని వీడి ఎన్‌డీఏలో చేరిన ఎంపీలు, అలాగే ఉద్ధవ్ ఠాక్రే వర్గం నుంచి బయటకు వచ్చి ఏక్‌నాథ్ షిండే శివసేనలో చేరిన మాజీ శివసేన ఎంపీలకు ప్రధాని ప్రత్యేక భరోసాని చ్చారు. 'ఎన్‌డీఏ అనేది ఓ కుటుంబం. ఈ కూటమిలోని ప్రతి మిగతా 2లో..

## పాలమూరును

# ఎండబెడతారా?

### ఈ నెల 11లోపు కృష్ణా నీటిని విడుదల చేయకపోతే నార్లాపూర్‌ను ముట్టడిస్తాం

- మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఫైర్
- పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులను పక్కన పెట్టేశారని మండిపాటు



**హైదరాబాద్, ఆగస్టు 7 (జనంసాక్షి) :**
జూరాల ప్రాజెక్టు పరిధిలోని భీమా ఫేజ్–1, 2, నెట్టెంపాడు, కోయిల్ సాగర్ లిఫ్టులతో పాటు కేఎల్ఐ కింద ఉన్న పంపులను తక్షణమే ప్రారంభించి పాలమూరు రైతాంగాన్ని ఆదుకోవాలని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ నెల 11వ తేదీలోపు పంపులను ఆన్ చేయకపోతే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలిసి భారీ సంఖ్యలో రైతులతో నార్లాపూర్ ప్రాజెక్టును ముట్టడిస్తామని హెచ్చరించారు.
కృష్ణా నదికి ఎగువ నుంచి భారీగా వరద నీరు వస్తున్న ప్పటికీ, నీళ్లు లేవంటూ ముఖ్యమంత్రి మిగతా 2లో..

## మీకు మాట్లాడే

# హక్కు ఎక్కడిది?

### పాలమూరు జిల్లా ప్రాజెక్టులను పదేళ్ల పాలనలో తీవ్ర నిర్లక్ష్యం చేశారు

### రాష్ట్రవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం వల్ల నీటి కటకట : మంత్రి జూపల్లి కృష్ణారావు



**హైదరాబాద్, ఆగస్టు 7 (జనంసాక్షి) :**
ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రాజెక్టులను పదేళ్ల పాలనలో తీవ్రంగా నిర్లక్ష్యం చేసిన బీఆర్ఎస్ నాయకులకు, నీటి పంపిణీపై మాట్లాడే ఏ నైతిక హక్కు లేదని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం వల్ల నీటి కటకట ఉన్నప్పటికీ.. ప్రభుత్వం బాధ్యతా యుతంగా వ్యవహరిస్తూ ఆల్మట్టి, జూరాల ప్రాజెక్టుల నుంచి నెట్టెంపాడు, భీమా, కోయిల్ సాగర్ ఆయకట్టుకు తాగు, సాగు నీటిని నిరంతరం పంపిణీ చేస్తోందని స్పష్టం చేశారు. పరిస్థితులు ఇలా ఉంటే.. కేవలం రాజకీయ పబ్బం గడుపుకోవడానికి, ప్రచారం కోసమే ముఖ్యమంత్రి సొంత జిల్లాలో మిగతా 2లో..

## వర్షాల కోసం

# వరుణ యాగం

### ఆగస్టు 10వ తేదీన ఈ యాగం

- పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొననున్న సీఎం
- యాదగిరిగుట్ట దేవస్థానం పాలక మండలి ప్రకటన



ఫైల్ ఫోటో

**హైదరాబాద్, ఆగస్టు 7 (జనంసాక్షి) :**
కృష్ణా, గోదావరి నదులు జలకళను సంతరించు కోవడంతోపాటు రైతాంగ శ్రేయస్సు, రాష్ట్ర సుభిక్షం కోసం వరుణ యాగం నిర్వహించా లని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు ఆగస్టు 10వ తేదీ ముహూర్తం ఖరారు చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు యాదగిరిగుట్టలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానానికి చెందిన వేద పండితులు, అర్చకులు ఆగస్టు 10వ తేదీన ఈ యాగం నిర్వహించను న్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో నాగార్జున సాగర్‌లోని విజయ విహార్ ప్రాంగణంలో ఈ యాగం వైభవంగా నిర్వహించేందుకు అధికారు లు చర్యలు చేపట్టారు. 108 మంది ఋత్వికులు, 11 హోమకుండాలు, వేదపండితులు, అర్చకులు ఈ యాగ క్రతువును నిర్వహిస్తారు. ఎల్ నినో ప్రభావం లేకుండా ఉండాలనే మిగతా 2లో..

## ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల వివరాలు తప్పనిసరి ప్రదర్శన

# ఏ పాఠశాలలో ఎంత ఫీజు?

### ఉల్లంఘిస్తే కఠిన చర్యలు.. విద్యాశాఖ డైరెక్టర్ ఈ. నవీన్ నికోలస్ కీలక ఆదేశాలు జారీ

**హైదరాబాద్, ఆగస్టు 7 (జనంసాక్షి) :**
రాష్ట్రంలోని ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులకు సంబంధించి విద్యాశాఖ డైరెక్టర్ ఈ. నవీన్ నికోలస్ కీలక ఆదేశాలు జారీ చేశారు. 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధి ంచిన ఫీజు వివరాలను అన్ని ప్రైవేట్ పాఠశాలలు తప్పనిసరిగా బహిరంగంగా ప్రదర్శించాలని స్పష్టం చేశారు. నోటీస్ బోర్డుపై తరగతి వారీగా ఫీజు వివరాలను ప్రదర్శించాల్సి ఉంటుందని, అలాగే పాఠ శాల అధికారిక వెబ్‌సైట్‌లో కూడా పూర్తి ఫీ జు వివరాలను అప్‌లోడ్ చేయాలని సూచించారు. schooledu. telangana. gov.in పోర్టల్‌లో ఫీజు వివరాలను నమోదు చేయడం తప్పని సరి అని స్పష్టం చేశారు. ఫీజుల నిర్ణయానికి సంబంధించిన అన్ని పత్రాలను కూడా పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశించారు. గవర్నింగ్ బాడీ సభ్యుల సంతకాలతో ఫీజు నిర్ణయ పత్రాలను సమర్పించడం తప్పనిసరి



అని తెలి పారు. G.O.Ms.No.1 రూల్ 16, 18 ప్రకారం ఫీజు నిర్ణయ పత్రాలు సమర్పించాలని వెల్లడించారు. ఫీజు వివరా లను నోటీస్ బోర్డు, వెబ్‌సైట్, పోర్టల్‌లో ప్రదర్శించని పాఠశాలలకు షోకాజ్ నోటీసు లు జారీ చేయనున్నట్లు హెచ్చరించారు. G.O.Ms. No.1లోని రూల్ 11 ప్రకారం నిబంధనలు ఉల్లంఘించిన పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ ఆదేశాల అమలును జిల్లా విద్యాశాఖ అధికారు లు(డీఈవోలు), ప్రాంతీ య సంయుక్త విద్యాశాఖ అధికారులు (ఆర్జేడీలు) పర్యవేక్షిం చాలని విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ ఆదేశించారు.

## చిన్నారుల లైంగిక వేధింపుల కంటెంట్‌పై

# ఎన్‌హెచ్ఆర్‌సీ ఆగ్రహం

- రాష్ట్రాల డీజీపీలకు, మెటాకు నోటీసులు
- పోక్సో ఉల్లంఘనల కిందకు వచ్చే అంశాలు కూడా ఉన్నాయి!
- ఐటీ శాఖ మంత్రితో మెటా ప్రతినిధుల భేటీ



**న్యూఢిల్లీ ఆగస్టు 7 (జనంసాక్షి) :**
మెటాకు జాతీయ మానవ హక్కుల కమిషన్ నోటీసులు జారీ చేసింది. ఇన్స్టా ప్రకటనల్లో చిన్నారులపై లైంగిక వేధింపులకు సంబంధిం చిన కంటెంట్ వ్యాప్తి చేస్తుండడంపై ఆందోళన వ్యక్తం చేసింది. మెటా సహా దేశంలోని 8 రాష్ట్రాల పోలీస్ డైరెక్టర్ జనరల్ (డీజీపీ)లకు నోటీసులు జారీ చేసింది. ఈ కంటెంట్లో పోక్సో ఉల్లంఘనల కిందకు వచ్చే అంశాలు కూడా ఉన్నాయని పేర్కొంది. అటువంటి ప్రకటనలను గుర్తించి, తొలగించడానికి తీసుకుంటున్న చర్యలపై వివరణ ఇవ్వాలని ఆదేశించింది.
కంటెంట్లో బాలలపై లైంగిక వేధింపుల మెటీరియల్ ఉన్నట్లు తేలితే మెటాపై కేసు నమోదు చేస్తామని ఎన్హెచ్ఆర్సీ సభ్యుడు ప్రియాంక్ కనూంగో పేర్కొన్నారు. ఈ విషయంపై దర్యాప్తు చేపట్టకపోతే నోటీసులు అందుకున్న పోలీసు ఉన్నతాధికారులపై కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే ఫేస్బుక్లో ప్రధాని మోదీ వీడియో తొలగింపు, డీప్ ఫేక్ లు, బాలలపై లైంగిక వేధింపుల కంటెంట్పై కేంద్ర ప్రభుత్వం మెటాకు నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో చోటుచేసుకున్న ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది.
ఐటీ శాఖ మంత్రితో మెటా ప్రతినిధుల భేటీ
మెటా ప్రపంచ వ్యవహారాల హెడ్ జోయెల్ కప్లన్ నేతృత్వంలోని బృందం.. మిగతా 2లో..

# ఈ20 అమ్మకాలపై ట్రంప్ ఒత్తిడి

### కేజ్రీవాల్ ఆరోపణ

- పెట్రోల్ కన్నా ఇథనాల్ ఖరీదైనదని వ్యాఖ్య



**న్యూఢిల్లీ ఆగస్టు 7 (జనంసాక్షి) :** అమెరికా నుంచి ఇథనాల్ దిగుమతులను సులభతరం చేసేందుకే ఈ20 పాలసీని కేంద్రం అమలు చేస్తోందని ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజీవాల్ ఆరోపించారు. మౌలిక సదుపాయాలను మెరుగుపరచకుండా, ఇప్పటికే ఉన్న మిగతా 2లో..

## మా ముగ్గురిలో ఎవరిపై దాడి జరిగినా

# ముగ్గురిపైనా జరిగినట్టే..!

### పాక్-సౌదీ-తుర్కియే త్రైపాక్షిక కీలక రక్షణ ఒప్పందం

- సౌదీలోని మక్కాలో జరిగిన సమావేశం
- రక్షణ ఒప్పందంపై స్పందించిన ఇరాన్



**రియాద్, ఆగస్టు 7 (జనంసాక్షి) :**
పశ్చిమాసియాలో యుద్ధ మేఘాల వేళ అంతర్జాతీయ రాజకీయాల్లో సంచలనాత్మక పరిణామం చోటు చేసుకుంది. పాకిస్థాన్, సౌదీ అరేబియా, టర్కీ దేశాలు 'మక్కా జాయింట్ డిఫెన్స్ అగ్రిమెంట్' పేరుతో ఒక కీలక రక్షణ ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఈ ఒప్పందం ప్రకారం మూడు దేశాల్లో ఏ ఒక్క దేశంపై దాడులు జరిగినా, అది మిగిలిన రెండింటిపై జరిగిన దాడిగానే పరిగణిస్తారు.
సౌదీ అరేబియాలో జరిగిన సమావేశంలో క్రౌన్ ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్, టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్, పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌లు ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ భేటీలో పాక్ ఆర్మీ చీఫ్ కూడా పాల్గొన్నారు. ఏదేని విదేశీ సైనిక దాడిని సమర్థవంతంగా తిప్పికొట్టేందుకు, పరస్పరం రక్షణ కల్పించుకునేందుకు ఈ ఒప్పందం దోహదపడుతుందని పాకిస్థాన్ విదేశాంగ శాఖ తెలిపింది. మూడు దేశాల వ్యూహాత్మక మిగతా 2లో..



# జీవితకాలం జైలులోనే ఉంటావు.. జాగ్రత్త!

- సందీప్ సుల్తానియాను హెచ్చరించిన హైకోర్టు
- రైతుబంధుతో రాష్ట్ర ఖజానాకు భారమని వ్యాఖ్య
- కోర్టు ధిక్కరణ కేసులో విచారించిన ధర్మాసనం

2 లో..

# వాళ్లిద్దరూ ఒక్కటయ్యారు

- విడాకుల కేసులను వెనక్కి తీసుకున్న విజయ్ భార్య
- కేసును అధికారికంగా ముగించిన చెంగల్పట్టు కుటుంబ న్యాయస్థానం
- హర్షం వ్యక్తం చేస్తున్న అభిమానులు, పార్టీ కార్యకర్తలు



# జన్మహక్కు పౌరసత్వానికి ట్రంప్ కళ్లెం!

- పౌరసత్వ నిబంధనల కఠినతరానికి రెండు ఆదేశాలు
- 'బర్త్ టూరిజం'పై ఉక్కుపాదం.. వీసాల నిరాకరణకు ఆదేశం
- కొన్ని ప్రత్యేక వర్గాల పిల్లలకు పౌరసత్వం నిరాకరణ
- కొత్త ఉత్తర్వులపైనా న్యాయపోరాటం తప్పదా?



న్యూఢిల్లీ, ఆగస్టు 7: అమెరికాలో జన్మహక్కు పౌరసత్వం నిబంధనలను కఠినతరం చేసే దిశగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో కీలక ముందడుగు వేశారు. ఈ అంశంపై సుప్రీంకోర్టు నుంచి ఎదురుదెబ్బ తగిలిన కొన్ని వారాలకే, ఆ నిబంధనలను పరిమితం చేసేలా రెండు కొత్త ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై గురువారం ఆయన సంతకం చేశారు. గతంలో జారీ చేసిన విస్తృత ఆదేశాలతో పోలిస్తే ఇవి పరిమిత స్థాయిలో ఉన్నప్పటికీ, వీటిపై కూడా న్యాయపరమైన సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. మొదటి ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ప్రకారం, కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో అమెరికాలో జన్మించిన పిల్లలకు పౌరసత్వం దక్కకుండా నిబంధనలు విధించారు. ఇద్దరు తల్లిదండ్రులు అమెరికా పౌరులు కానప్పుడు, వారిలో ఒకరిని 'శత్రు దేశస్థుడు'గా, అంటే విదేశీ ఉగ్రవాద సంస్థల్లో సభ్యుడిగా గుర్తిస్తే, వారి పిల్లలకు పౌరసత్వం వర్తించదు. దీంతోపాటు దౌత్యపరమైన మినహాయింపులు ఉన్న విదేశీ ప్రభుత్వ ఉద్యోగులు, కేవలం పౌరసత్వం కోసమే చేసుకున్న వాణిజ్య ఒప్పందాలు (కొన్ని సరోగసీ కేసులు), ఫెడరల్ చట్టం ద్వారా పౌరసత్వం కల్పించని యూఎస్ టెరిటరీలలో జన్మించిన వారికి కూడా ఈ నిబంధన వర్తిస్తుంది.

రెండో ఆదేశం పూర్తిగా 'బర్త్ టూరిజం'ను లక్ష్యంగా చేసుకుంది. కేవలం బిడ్డకు అమెరికా పౌరసత్వం ఇప్పించడం కోసమే దేశానికి వచ్చేవారిని అడ్డుకోవాలని ఈ ఉత్తర్వులో స్పష్టం చేశారు. ఇలాంటి వారికి వీసాలు నిరాకరించడం, అధికారిక అనుమతులు రద్దు చేయడం, దేశంలోకి ప్రవేశాన్ని నిరోధించడం వంటి కఠిన చర్యలు తీసుకోవాలని హోంల్యాండ్ సెక్యూరిటీ, విదేశాంగ శాఖలను ఆదేశించారు.

14వ రాజ్యాంగ సవరణ కింద అమెరికాలో పుట్టిన దాదాపు ప్రతి ఒక్కరికీ పౌరసత్వం లభిస్తుందని జూన్ 30న 'ట్రంప్ వర్సెస్ బార్బరా' కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు జన్మహక్కు పౌరసత్వాన్ని ఒక 'జోక'గా మార్చిందని ట్రంప్ విమర్శించారు. అందుకే తమ ప్రభుత్వం 'కొన్ని సర్దుబాట్లు' చేస్తోందని వ్యాఖ్యానించారు. చారిత్రకంగా దౌత్యవేత్తలు, ఆక్రమణ దళాలకు చెందిన వారికి మాత్రమే ఈ నిబంధన నుంచి మినహాయింపులు ఉండేవి. ఇప్పుడు ట్రంప్ జారీ చేసిన ఈ కొత్త ఆదేశాలు సుప్రీంకోర్టు తీర్పులో పేర్కొన్న మినహాయింపుల పరిధిలోనే ఉన్నప్పటికీ, వాటి సరిహద్దులను పరీక్షించేలా ఉన్నాయని, ఇవి కూడా న్యాయస్థానంలో సవాలుకు గురయ్యే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు.

## 15 రాష్ట్రాల్లో సైబర్ ముఠాల గుట్టురట్టు

### మొత్తం 49 మంది నిందితుల అరెస్టు

హైదరాబాద్ : సైబర్ నేరగాళ్లపై హైదరాబాద్ పోలీసులు ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించారు. తెలంగాణ సహా 15 రాష్ట్రాల్లో విస్తరించిన సైబర్ ముఠాల గుట్టురట్టు చేశారు. మొత్తం 49 మంది నిందితులను అరెస్టు చేసి, రికవరీ చేసిన రూ.98.89లక్షల డబ్బును బాధితులకు రిఫండ్ చేశారు. జులైలో 70 సైబర్ క్రైమ్ సంబంధిత ఎఫఐఆర్‌లు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ట్రేడింగ్ మోసాలే అత్యధికంగా జరిగాయని.. ఆ కేసుల్లో 29 మందిని అరెస్టు చేశామని వివరించారు. మొత్తంగా 25 డెబిట్ కార్డులు, 23 మొబైల్ ఫోన్లు, 3 ల్యాప్‌టాప్‌లు సహా కీలక వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. జోనల్ సైబర్ సెల్స్ ద్వారా 298 కేసులు నమోదు కాగా.. ఆరుగురిని అరెస్టు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. 128 నకిలీ సోషల్‌విడియా ప్రొఫైళ్లు, 36 నకిలీ యాడ్స్‌ను బ్లాక్ చేసినట్లు పేర్కొన్నారు. డిజిటల్ అరెస్టు పేరుతో వచ్చే కాల్స్ పూర్తిగా నకిలీవేనని పోలీసులు స్పష్టం చేశారు.

## టీపీసీసీ సోషల్ మీడియా ఛైర్మన్‌గా నవీన్ పెట్టెం

- కిరణ్ కుమార్ రెడ్డికి మీడియా విభాగం బాధ్యతలు
- ఏఐసీసీ నియామకాలకు ఖర్గే ఆమోదం
- గీత అయినాల కోఆర్డినేటర్ పదవి నిరాకరణ

హైదరాబాద్, ఆగస్టు 7 (జనంసాక్షి) : తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ)లో పలు కీలక నియామకాలు జరిగాయి. టీపీసీసీ సోషల్ మీడియా విభాగానికి నూతన ఛైర్మన్‌గా నవీన్ పెత్తెంను అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) నియమించింది. అలాగే మీడియా, పబ్లిసిటీ విభాగం ఛైర్మన్‌గా భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డికి బాధ్యతలు అప్పగించారు. ఈ నియామకాలకు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదం తెలిపారని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో సోషల్ మీడియా విభాగం కోఆర్డినేటర్‌గా పనిచేసిన నవీన్ పెట్టెం, ప్రస్తుతం రాష్ట్ర రవాణా అథారిటీలో సభ్యుడిగా కూడా ఉన్నారు. ఆయనతో పాటు సోషల్ మీడియా విభాగానికి కన్వీనర్లుగా కె.ఉజ్వల్ రెడ్డి, పి.వంశీకృష్ణలను నియమించారు. అంబాల శివకుమార్, విష్ణు వర్ధన్ రెడ్డి, వీరాపురం రామ్ లక్ష్మణ్, గీత అయినాల, ఎండీ అబిద్ అలీ, సుశీల్ కుమార్‌లను కోఆర్డినేటర్లుగా ఎంపిక చేశారు. అయితే, సోషల్ మీడియా విభాగం కోఆర్డినేటర్ పదవిని స్వీకరించేందుకు గీత అయినాల నిరాకరించారు. ప్రస్తుతం టీపీసీసీ మీడియా, కమ్యూనికేషన్స్ కన్వీనర్ గా ఉన్న ఆమె, ఈ నియామకం పట్ల ధన్యవాదాలు తెలుపుతూనే, ఈ పదవిని తాను స్వీకరించడం లేదని 'ఎక్స్' ద్వారా ప్రకటించారు. తన పేరును జాబితా నుంచి తొలగించాలని నవీన్ పెత్తెంను కోరారు. ఆమె నిరాకరణకు గల కారణాలు వెంటనే తెలియరాలేదు. మరోవైపు, నవీన్ పెట్టెం నియామకంపై భారత్ రాష్ట్ర సమితి మద్దతుదారులు విమర్శలు గుప్పించారు. కొత్త బాధ్యతలపై ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి స్పందిస్తూ.. తనకు ఈ అవకాశం కల్పించిన ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ వాణిని తెలంగాణ అంతటా బలంగా వినిపిస్తానని ఆయన పేర్కొన్నారు.

## పాలమూరును ఎండబెడతారా?

రేవంత్ రెడ్డి రైతులను మోసం చేస్తున్నారని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పాలమూరు బిడ్డనని చెప్పుకుంటూనే ఏపీకి నీళ్లు తరలించేందుకు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు రేవంత్ సహకరిస్తున్నారని ఆరోపించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులను పూర్తిగా పక్కన పెట్టేశారని విమర్శించిన ఆయన... కర్ణాటక నుంచి వచ్చే వృథా నీటితోనే డిసెంబర్ వరకు జూరాలకు పుష్కలంగా నీరు అందుతుందని, వెంటనే ఎత్తిపోతల పంపులు ప్రారంభించి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.

## ఈ20 అమ్మకాలపై ట్రంప్ ఒత్తిడి

వాహనాలు ఈ20కి అనుకూలంగా ఉన్నాయా? లేదా? అని నిర్ధరించుకోకుండా ప్రభుత్వం ఈ విధానాన్ని బలవంతంగా తీసుకొచ్చిందన్నారు. దిల్లీలో మీడియాతో కేజీవాల్ మాట్లాడారు. "అమెరికా అధ్యక్షుడి ఒత్తిడిని నరేంద్ర మోదీ ప్రభుత్వం తట్టుకోలేకపోతోంది. ఇథనాల్ను అత్యధికంగా ఉత్పత్తి చేస్తున్న దేశం అమెరికా. కానీ, దానిని పూర్తి స్థాయిలో వినియోగించుకోలేక పోతోంది. ఆ ఇథనాల్ కు డిమాండ్ సృష్టించేందుకు భారత్ ఈ20ని బలవంతంగా అమలు చేస్తోంది" అని కేజీవాల్ ఆరోపించారు. గతేడాది అమెరికా నుంచి భారత్ 100 కోట్ల లీటర్ల ఇథనాలను దిగుమతి చేసుకోగా, ఈ ఏడాది 500 కోట్ల లీటర్లను దిగుమతి చేసుకోనుందని చెప్పారు. అసలు అమెరికానే దేశవ్యాప్తంగా ఈ20ని అమలు చేయలేదని, చాలావరకు తక్కువ ఇథనాల్ మిశ్రమాన్నే కొనసాగిస్తోందన్నారు. భారత్‌లో ఈ విధానాన్ని ప్రకటించిన తర్వాత (2022లో), దీనిని అమలు చేసేందుకు మూడేళ్ల గడువు మాత్రమే ఇచ్చిందన్నారు. మౌలిక సదుపాయాలు, లక్షలాది వాహనాలను దీనికి అనుగుణంగా మార్చేందుకు ఈ గడువు సరిపోదన్నారు. పెట్రోల్ కన్నా ఇథనాల్ ఖరీదైనదని, మైలేజీ కూడా తక్కువగా వస్తుందన్నారు. ఈ విధానం వెనుక హేతుబద్ధతను కేజీవాల్ ప్రశ్నించారు.

## డోంట్ వర్రీ..!

పార్టీకి చెందిన ఎంపీకి సమానమైన గౌరవం ఉంటుంది. నేను ఒక పార్టీకి మాత్రమే కాదు.. ప్రతి ఎంపీకి అండగా ఉంటాను. ఇందులో ఎలాంటి ఆందోళనా అవసరం లేదు' అని మోదీ చెప్పుకొచ్చారు. భేటీ అనంతరం ఒక్కో ఎంపీతో విడివిడిగా మాట్లాడిన మోదీ.. వారి వారి నియోజకవర్గాల పరిస్థితులు, అక్కడి ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై ఆరా తీశారు.

## మీకు మాట్లాడే హక్కు ఎక్కడిది?

నీళ్లు వదలడం లేదంటూ బీఆర్ఎస్ నేతలు ఆర్భాటాలు, చౌకబారు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు ప్రాజెక్టులను ప్రారంభిస్తే.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 4.60 లక్షల ఎకరాలకు నీరందించే ఈ ప్రాజెక్టులను తీవ్రంగా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. కల్వకుర్తి కింద 25 టీఎంసీల నీటిని ఇచ్చే పనులను ఎందుకు పూర్తి చేయలేదో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.


WANAPARTHY DISTRICT GAZETTE
EXTRAORDINARY
PUBLISHED BY AUTHORITY

Gazette No. 72/2026 DATE: 20.07.2026.
File No: G/720/2026

The Right to Fair Compensation and in Transparency in Land Acquisition, Rehabilitation and Resettlement Act, 2013
(భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనాలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టము 2013 (కేంద్ర చటం 30/2013) యొక్క సేక్షన్ 11) 1( మరియు రాష్ట్ర రూల్ 25(1) నుసరించి

ఫారం - VI

ప్రాథమిక ప్రకటన

తెలంగాణ ప్రభుత్వం / శ్రీయుత జిల్లా కలెక్టర్, వనపర్తి గారు ప్రజా ప్రయోజనార్ధ అవసర నిమిత్తం వనపర్తి జిల్లా పెద్దమందడి మండలములోని **జంగమాయపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలో** "MGKLISP -- Karne Thanda Lift Irrigation Scheme Minor on left FC -- 1 of SP 1 of - Feeder Channel of Shapur Canal from KM 0.000 to 01.425 KM" నిర్మాణం కొరకు ఈ క్రింది షెడ్యూల్ లో ఉదాహరించిన భూమి ఎకరములు 01.32 గుంటలు పట్టా / ప్రభుత్వ భూములు సేకరించుటకు ప్రతిపాదించనైనది. భూసేకరణ కొరకు భూ సేకరణ పునరావాస, పునస్థాపనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం - 2013 లోని చాప్టర్-(II) లోని సామాజిక ప్రభావ అధ్యయన నివేదిక మరియు చాప్టర్-(III) లోని ఆహార భద్రత మరియు పరిరక్షణకు సంబందించిన మినహాయింపు ఇస్తూ, తెలంగాణ సవరణ చట్టం-2016 అనుసరించి, సెక్షన్-10A ప్రకారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జి.ఓ.యం.యస్.నం.51 (Irrigation & CAD (LA.R&R/A2), Dept., తేది: 25.07.2017 జారి చేసినది, కేంద్ర భూసేకరణ చట్టం, 2013 (చట్టము నెం. 30/2013) యొక్క సెక్షన్ 11(1) ప్రకారం ప్రకటన జారీ చేయనైనది.

పై ప్రాజెక్ట్ కు సంబందించిన భూ సేకరణ పనులను చేపట్టుటకు చట్టంలోని నిబందనలననుసరించి జిల్లా కలెక్టర్, వనపర్తి గారు జారి చేసిన ఉత్తర్వులు నెం. G/225/2026, తేది: 30.03.2026 ప్రకారం ప్రాజెక్ట్ పాలనధికారిగా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) గారిని నియమించినారు.

పై ప్రాజెక్ట్ కు సంబందించిన భూ సేకరణ పనులను చేపట్టుటకు చట్టంలోని నిబందనలననుసరించి జిల్లా కలెక్టర్, వనపర్తి గారు జారి చేసిన ఉత్తర్వులు నెం. G/225/2025, తేది: 30.03.2026 ప్రకారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే), ఆర్.యల్.ఐ.యస్.పి-II, పెబ్బేర్ గారిని భూ సేకరణ అధికారిగా నియమించినారు.

కావున పైన పేర్కొన్న ప్రాజెక్టు కోసం వనపర్తి జిల్లా మరియు పెద్దమందడి మండలములోని జంగమాయపల్లి రెవెన్యూ గ్రామ పరిమితిలో గల ప్రామాణిక కొలత కంటే ఎక్కువ లేదా తక్కువ **ఎకరములు 01.32 గుంటలు** కొలిచే డివిజన్ భూమి, భూ సేకరణ ద్వార సేకరణ చేసే భూముల వివరములు క్రింది విధంగా గలవు.

షెడ్యూల్

గ్రామం : జంగమాయపల్లి మండలం : పెద్దమందడి జిల్లా : వనపర్తి

| క్ర. సం | సర్వే నం. | భూమి రకం తరి / మెట్ట | పట్టా /అసైన్డ్ / ప్రభుత్వ / ఇతర... | భూ సేకరణ కొరకు పరతిపాదిత భూ విస్తీర్ణం ఎ-గు | పట్టాదారు/ అనుభవదారు పేరు మరియు తండ్రి / భర్త పేరు శ్రీ/శ్రీమతి/ కుమారి | సరిహద్దులు ఉ | ద | తూ | ప |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 67 | మెట్ట | ప్రభుత్వ / లా. పట్టా | 00.10 | హస్మే లాల్ తండ్రి బోద్య | షాపూర్ శివారు | 60,61, 62 & బలిజ పల్లి శివారు | గంగారం శివారు | మానాజి పేట్ శివారు |
| 2 | 67 | మెట్ట | ప్రభుత్వ / లా. పట్టా | 00.12 | పాండు తండ్రి తాప్రా | షాపూర్ శివారు | 60,61, 62 & బలిజ పల్లి శివారు | గంగారం శివారు | మానాజి పేట్ శివారు |
| 3 | 67 | మెట్ట | ప్రభుత్వ / లా. పట్టా | 00.06 | పెంట్యా తండ్రి తార్యి | షాపూర్ శివారు | 60,61, 62 & బలిజ పల్లి శివారు | గంగారం శివారు | మానాజి పేట్ శివారు |
| 4 | 67 | మెట్ట | ప్రభుత్వ / లా. పట్టా | 00.06 | రెడ్యా తండ్రి తార్యి | షాపూర్ శివారు | 60,61, 62 & బలిజ పల్లి శివారు | గంగారం శివారు | మానాజి పేట్ శివారు |
| 5 | 67 | మెట్ట | ప్రభుత్వ / లా. పట్టా | 00.05 | శంకర్ తండ్రి భీక్య | షాపూర్ శివారు | 60,61, 62 & బలిజ పల్లి శివారు | గంగారం శివారు | మానాజి పేట్ శివారు |
| 6 | 67 | మెట్ట | ప్రభుత్వ / లా. పట్టా | 00.08 | హీరా లాల్ తండ్రి భీక్య | షాపూర్ శివారు | 60,61, 62 & బలిజ పల్లి శివారు | గంగారం శివారు | మానాజి పేట్ శివారు |
| 7 | 67 | మెట్ట | ప్రభుత్వ / లా. పట్టా | 00.09 | జుమ్మాల్ తండ్రి భీక్య | షాపూర్ శివారు | 60,61, 62 & బలిజ పల్లి శివారు | గంగారం శివారు | మానాజి పేట్ శివారు |
| 8 | 67 | మెట్ట | ప్రభుత్వ / ఫారెస్ట్ | 00.16 | ప్రభుత్వం/ ఫారెస్ట్ | షాపూర్ శివారు | 60,61, 62 & బలిజ పల్లి శివారు | గంగారం శివారు | మానాజి పేట్ శివారు |
| మొత్తం విస్తీర్ణం (ఎ-గు) | | | | 01.32 | | | | | |

భూసేకరణ, పునరావాసం మరియు పునస్థాపనలో పారదర్శకత మరియు పరిహారాన్ని పొందే హక్కు తెలంగాణ సవరణ - 2016 (చట్టం. 21/2017) మరియు భూ సేకరణ చట్టం-2013 (నెం. 30/2013) లోని సెక్షన్ (నిబంధన) 11(1) ప్రకారం సంబంధిత భూ యజమానులకు/ ఆసక్తి గల వ్యక్తులందరికి తెలియచేయుట నిమిత్తం ఇట్టి ప్రకటన (నోటిఫికేషన్) జారీ చేయనైనది.

సదరు చట్టం యొక్క సెక్షన్ 11 (4) ప్రకారం శ్రీయుత జిల్లా కలెక్టర్, వనపర్తి గారి అనుమతి లేకుండా ఇట్టి ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసిన తేదీ నుండి ఆ నోటిఫికేషన్ లో ప్రకటించిన ఊదాహరించిన భూములకు సంబందించిన ఎవరు ఎటువంటి లావాదేవీలు / తాకట్టు, అమ్మకం / కొనుగోలు మొదలగు చర్యలు చేపట్టరాదు అని తెలియచేయనైనది.

సదరు చట్టంలోని సెక్షన్-12లో గల అధికారాలను అనుసరించి తెలంగాణ ప్రభుత్వం / శ్రీయుత జిల్లా కలెక్టర్ గారు భూ సేకరణ అధికారి & స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సి.), ఆర్.యల్.ఐ.యస్.పి-2, పెబ్బేర్ Hq IDOC, వనపర్తి మరియు అతని సిబ్బందికి సదరు భూమిపైకి ప్రవేశించడానికి, సర్వే మరియు ఇతర పనులు చేపట్టుటకు, భూమిని తీసుకోవటానికి, త్రవ్వటానికి అధికారం ఇవ్వడానికి, ఇతర పనులు అమలు కి అనుమతించనైనది.

భూమి యొక్క ప్లాన్ మరియు వివరములు శ్రీయుత జిల్లా కలెక్టర్, వనపర్తి / భూ సేకరణ అధికారి & స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే.), ఆర్.యల్.ఐ.యస్.పి-2, పెబ్బేర్ Hq IDOC, వనపర్తి గారి కార్యాలయములలో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదైనా పని దినములలో మరియు కార్యాలయ పని వేళలలో పరిశీలించుకోవచ్చును.

భూసేకరణ చట్టంలోని సెక్షన్-15(1) ప్రకారం, ఇట్టి నోటిఫికేషన్ జారీ చేసిన తరువాత పైన చూపించిన భూములలో ఎలాంటి సంబంధమున్న వ్యక్తులైన భూ సేకరణపై అభ్యంతరాలున్నచో, అట్టి వ్యక్తులు ఇట్టి నోటిఫికేషన్ ప్రచురించిన తేదీ నుండి 60 (అరవై) రోజులు లోపు శ్రీయుత జిల్లా కలెక్టర్, వనపర్తి/ భూసేకరణ అధికారి & ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే.), ఆర్.ఎల్.ఐ.యస్.పి. యూనిట్-2, పెబ్బేరు, Hq at IDOC, వనపర్తి గారికి లిఖిత పూర్వకంగా తెలియపరచగలరు.

తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జి.ఓ.యం.యస్.నెం.120 (రెవిన్యూ JA & LA), తేదీ: 30.06.2017 ప్రకారం సెక్షన్-23A కింద భూ యజమానులు, ఆసక్తి గల వ్యక్తులు సరైన భూ పరిహారం పొందుటకై సంప్రదింపులు/చర్చల ద్వారా పరిష్కారం చేయదలుచుకున్నవారు తమ ఆసక్తులను ఫారం E-1 ద్వార నోటిఫికేషన్ వెలువడిన తదుపరి సమర్పించవచ్చును.

సం/- ప్రత్యేక ఉప కలెక్టర్ భూసేకరణ ఆర్.పి.ఎస్.ఐ.ఎల్., యూనిట్ - 2 పెబ్బేర్
సం/- అదనపు కలెక్టర్, వనపర్తి
సం/- జిల్లా కలెక్టర్, వనపర్తి

DIPR RO.NO: 617/LA/PP/Advt/Pub/2026-27


# జగిత్యాల జిల్లాలో దారుణ ఘటన

- మహిళపై సామూహిక అత్యాచారం
- ఆపై ఫోన్‌లో వీడియోలతో బెదిరింపులు

జగిత్యాల : జగిత్యాల జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. మల్యాల మండలం నూకపల్లి శివారులోని డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల కాలనీలో ఇద్దరు వ్యక్తులు ఓ మహిళపై సామూహిక అత్యాచారం చేసి బాధితురాలిని వీడియో తీసి బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ ఘటనలో నిందితులతో పాటు వారికి సహకరించిన మరో ఇద్దరిపై కేసు నమోదు చేసి శుక్రవారం సాయంత్రం న్యాయస్థానం ఎదుట హాజరు పరిచినట్లు మల్యాల సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. ఈనెల 3న నిజామాబాద్‌కు చెందిన ఓ మహిళ నూకపల్లి శివారులోని రెండు పడకగదుల ఇళ్ల కాలనీలో తనకు తెలిసినవారి ఇంటికి వచ్చింది. మల్యాల మండలం రాజారం గ్రామానికి చెందిన శివరాత్రి నరేశ్, గుర్రం శ్రీకాంత్ అనే యువకులు సదరు మహిళ ఉన్న ఇంట్లోకి ప్రవేశించి.. ఆమె తనకు సన్నిహితంగా వున్న ఓ వ్యక్తితో కలిసివున్న దృశ్యాలను తమ ఫోన్‌లో చిత్రీకరించారు. తర్వాత ఆమెపై వారిరువురు సామహిక అత్యాచారానికి దాడికి పాల్పడ్డారు. ఆ సమయంలో జగిత్యాల జిల్లా ధరూర్ గ్రామానికి చెందిన మారవేని మల్లేశ్, రాజారం గ్రామానికి చెందిన గుర్రం అంజయ్య నిందితులకు సహకరించారు. అనంతరం నరేశ్, శ్రీకాంత్ బాధిత మహిళకు ఫోన్ చేసి తాము తీసిన వీడియోను పలువురికి పంపిస్తామని బ్లాక్‌మెయిల్‌కు పాల్పడంతో గురువారం బాధితురాలు మల్యాల ఠాణాలో ఫిర్యాదు చేసింది. దీంతో నిందితులను అరెస్టు చేసి పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు సీఐ వివరించారు. నిందితులు వినియోగించిన ఇన్నోవా క్రిస్టా కారు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కేసులో ఏ1 నిందితుడు శివరాత్రి నరేశ్‌పై 13, ఏ2 నిందితుడు గుర్రం శ్రీకాంత్‌పై 9 పాత కేసులతోపాటు రౌడీ షీట్లు ఉన్నట్లు వివరించారు. ఏ3 నిందితుడు మారవేని మల్లేశ్‌పై 2, గుర్రం అంజయ్యపై ఒక కేసు గతంలో నమోదై ఉన్నట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మహిళలపై వేధింపులు, లైంగిక దాడులు, సామాజిక మాధ్యమాల ద్వారా బెదిరింపులకు పాల్పడే వ్యక్తులపట్ల చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రాజ్‌కుమార్ హెచ్చరించారు. రౌడీ షీటర్లు, పాత నేరస్థుల కదలికలపై కూడా ప్రత్యేక నిఘావేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో సీఐతోపాటు ఎస్సై సందీప్, పలువురు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

## వాళ్లిద్దరూ ఒక్కటయ్యారు

చెన్నై, ఆగస్టు 7 (జనంసాక్షి) : తమిళనాడు ముఖ్యమంత్రి, స్టార్ హీరో విజయ్ విడాకుల వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. గత కొంతకాలంగా చర్చనీయాంశంగా మారిన విజయ్-సంగీత విడాకుల కేసుకు చెంగల్పట్టు కుటుంబ న్యాయస్థానం తెరదించింది. విజయ్ భార్య సంగీత తన విడాకుల పిటిషన్‌ను ఉపసంహరించుకోవడంతో కోర్టు కేసును ముగించింది. కొన్ని నెలలుగా ఈ కేసు పలుమార్లు విచారణకు వచ్చినప్పటికీ వివిధ కారణాలతో వాయిదా పడుతూ వచ్చింది. తాజాగా జరిగిన విచారణలో సంగీత తన పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలని నిర్ణయించినట్లు కోర్టుకు తెలియజేశారు. దీంతో చెంగల్పట్టు కుటుంబ న్యాయస్థానం విడాకుల కేసును అధికారికంగా ముగించింది

విజయ్ నుంచి విడాకులు ఇప్పించాలని తమిళనాడులోని చెంగల్పట్టు ఫ్యామిలీ కోర్టులో సంగీత పిటిషన్ దాఖలు చేసారు. గత కొన్నాళ్లుగా ఈ కేసుపై విచారణ జరుగుతోంది. అయితే తన విడాకుల పిటిషన్‌ను సంగీత ఉపసంహరించుకున్నారు. తన భర్తపై పెట్టిన డివోర్స్ కేసులను వాపసు తీసుకుంటున్నట్టు సంగీత న్యాయస్థానికి తెలిపారు. దీంతో విడాకుల కేసును కోర్టు కొట్టేసింది.

విజయ్ - సంగీత 1999లో పెళ్లి చేసుకున్నారు. వీరికి జాసన్ సంజయ్, దివ్యసాష అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. 2023లో విజయ్ - సంగీత మధ్య విభేదాలు వచ్చాయని, ఇద్దరూ వేర్వేరుగా ఉంటున్నారని వార్తలు వచ్చాయి. వారిద్దరు విడాకులు తీసుకోబోతున్నారని కూడా ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో పెళ్లైన 27 ఏళ్ల తర్వాత, సరిగ్గా తమిళనాడు ఎన్నికలకు ముందు విజయ్ నుంచి విడాకులు కోరుతూ కోర్టును ఆశ్రయించారు సంగీత. విజయ్ ఒక నటితో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని , ఈ విషయం 2021లో తనకు తెలిసిందని పేర్కొంటూ సంగీత ఫిబ్రవరిలో విడాకుల పిటిషన్ దాఖలు చేశారు. ఆ సంబంధాన్ని ముగించుకుంటానని విజయ్ హామీ ఇచ్చినప్పటికీ, అతను ఎలాంటి పశ్చాత్తాపం లేకుండా దానిని కొనసాగించాడని పిటిషన్‌లో ఆమె ఆరోపించారు. ఆయన్నుంచి విడిపోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. దీంతో విజయ్ - సంగీత మధ్య రాజీ కుదిరిందని, మళ్లీ కలిసిపోయారని అభిమానులు భావిస్తున్నారు.

# జీవితకాలం జైలులోనే ఉంటావు.. జాగ్రత్త!

- సందీప్ సుల్తానియాను హెచ్చరించిన హైకోర్టు
- కోర్టు ధిక్కరణ కేసులో అధికారిని వ్యక్తిగతంగా విచారించిన ధర్మాసనం




హైదరాబాద్, ఆగస్టు 7 (జనంసాక్షి) : ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలు, చేసిన తప్పిదాల కారణంగా అధికారులను కోర్టుల ముందు వ్యక్తిగతంగా హాజరుపరచాల్సిన పరిస్థితి రావడం బాధాకరమని తెలంగాణ హైకోర్టు వ్యాఖ్యానించింది. కోర్టు ధిక్కరణ కేసులో రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా వ్యక్తిగతంగా హాజరైన సందర్భం గా ధర్మాసనం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. అధికారిపై వెయ్యి కేసులు ఉన్నాయని, వాటన్నింటినీ విచారిస్తే జీవితకాలం జైలులోనే ఉండాల్సి వస్తుందని వ్యాఖ్యానించింది. అధికారులను హైకోర్టుకు వ్యక్తిగతంగా పిలిపించడం తమకు సంతోషం కలిగించే విషయం కాదని, తప్పనిసరి పరిస్థితుల్లోనే హాజరుకావాలని ఆదేశిస్తున్నామని న్యాయస్థానం పేర్కొంది. ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలు, వాటి అమలులో జరిగే లోపాల ప్రభావం అధికారులపై పడుతోందని అభిప్రాయపడింది. అధికారు లపై వరుసగా కోర్టు ధిక్కరణ కేసులు రావడం వల్ల న్యాయ ప్రక్రియలో వారికి ఎదురవుతున్న ఇబ్బందులనూ ధర్మాసనం ప్రస్తావించింది. విచారణ సందర్భంగా ఉచిత పథకాల అంశం కూడా ప్రస్తావనకు వచ్చింది. ఉచిత పథకాల వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. రైతుబంధు పథకం ప్రయోజనాలు సంపన్నులు, ప్రభుత్వ అధికారులు కూడా పొందుతున్నారన్న అంశాన్ని ప్రస్తావిస్తూ.. ఇది బాధాకరమని వ్యాఖ్యానించింది. రైతుబంధు వల్ల రాష్ట్ర ఖజానాపై భారం పడుతోందని పేర్కొంది. ఈ కేసు సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యుడు జె. రామకృష్ణ దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌కు సంబంధించినది. 2024లో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయలేదన్న ఆరోపణల నేపథ్యంలో పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణ సందర్భంగా ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా వ్యక్తిగతంగా కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా న్యాయస్థానం ప్రభుత్వ నిర్ణయాలు, అధికారుల బాధ్యతలు, ఉచిత పథకాల ఆర్థిక ప్రభావంపై కీలక వ్యాఖ్యలు చేసింది.

# మెటాకు అమెరికా కోర్టు రూ.వేల కోట్ల జరిమానా



న్యూఢిల్లీ, ఆగస్టు 7 (జనంసాక్షి) : సోషల్ మీడియా దిగ్గజం మెటాకు అమెరికా కోర్టులో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ప్లాట్‌ఫామ్‌ల వల్ల యువత మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందని నిర్ధారించిన న్యూ మెక్సికో కోర్టు, కంపెనీకి 567 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 5,400 కోట్లకు పైగా) జరిమానా విధిస్తూ సంచలన తీర్పు ఇచ్చింది. ఈ కేసు విచారణలో భాగంగా రెండో దశలో జడ్జి బ్రయాన్ బీడ్‌షీడ్ ఈ ఆదేశాలు జారీ చేశారు. తీర్పు ప్రకారం జరిమానా మొత్తంలో 420 మిలియన్ డాలర్లు సోషల్ మీడియా వల్ల ప్రభావితమైన యువతకు చికిత్సా సేవల కోసం కేటాయించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. మిగిలిన నిధులను రాబోయే ఐదేళ్లలో అవగాహన, నివారణ కార్యక్రమాలు, స్క్రీనింగ్ సేవలు, ఇతర సంబంధిత ఖర్చుల కోసం వినియోగించాలని ఆదేశించింది. ఈ కేసులో గత మార్చి నెలలో వెలువడిన తీర్పునకు ఇది కొనసాగింపు కావడం గమనార్హం. ఆ సమయంలో మెటా ఉద్దేశపూర్వకంగానే పిల్లల మానసిక ఆరోగ్యానికి హాని కలిగించిందని, లైంగిక దోపిడీకి సంబంధించిన సమాచారాన్ని దాచిపెట్టిందని నిర్ధారించిన జ్యూరీ, కంపెనీకి 375 మిలియన్ డాలర్ల సివిల్ పెనాల్టీ విధించింది. ఈ కేసు విచారణలో ప్రాసిక్యూటర్లు మెటా ప్లాట్‌ఫామ్‌లలో కీలక మార్పులు చేయాలని కోరారు. ముఖ్యంగా యువతను వ్యసనపరులుగా మార్చే ఫీచర్లను నియంత్రించాలని, వయసు నిర్ధారణ పద్ధతుల ను కఠినతరం చేయాలని, పిల్లల లైంగిక దోపిడీని అరికట్టేందుకు డిఫాల్ట్ ప్రైవసీ సెట్టింగులను మెరుగుపరచాలని వాదించారు. అయితే, ప్రాసిక్యూటర్ల అభ్యర్థనలను కోర్టు పాక్షికంగానే అంగీకరించింది. 13 ఏళ్లలోపు పిల్లలకు వయసు నిర్ధారణను తప్పనిసరి చేయాలన్న వాదనను తోసిపుచ్చింది. అమెరికాలోని 'చిల్డ్రన్స్ ఆన్‌లైన్ ప్రైవసీ ప్రొటెక్షన్ యాక్ట్' (సీఓపీపీఏ) ప్రకారం కేవలం వయసు నిర్ధారణ కోసం పిల్లల నుంచి వ్యక్తిగత సమాచారం సేకరించడం కుదరదని కోర్టు స్పష్టం చేసింది. అంతేగాక ఇతర సోషల్ మీడియా కంపెనీలకు లేని నిబంధనలను కేవలం మెటాపై మాత్రమే విధించడం సరికాదని, అది కంపెనీపై అనవసర భారం మోపుతుందని అభిప్రాయపడింది. ఈ తీర్పుపై మెటా ఇంకా స్పందించలేదు. ఇదిలా ఉంటే.. ఇటీవల మెటాకు చెందిన ఏఐ మోడల్ సైబర్ సెక్యూరిటీ పరీక్షల్లో భాగంగా బయటి సర్వీస్‌లోకి హ్యాక్ చేయడం, టెక్నాలజీపై నియంత్రణకు సంబంధించి కొత్త ఆందోళనలను రేకెత్తించింది.

### చిన్నారుల లైంగిక వేధింపుల కంటెంట్‌పై

# ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆగ్రహం

కేంద్ర ఐటీశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ సహా పలు అధికారులతో దిల్లీలో గురువారం దాదాపు గంటసేపు సమావేశమైంది. భారత రాజ్యాంగ, న్యాయపరమైన నిబంధనలకు అనుగుణంగా మెటా మాధ్యమాలు ఎంత మేరకు నడుచుకుంటున్నాయన్నదానిపై అధికారులు ఆ సంస్థ ప్రతినిధులను ప్రశ్నించారు. డీప్ ఫేక్ లు, బాలలపై లైంగిక వేధింపుల కంటెంట్, బాట్ అకౌంట్ల వంటి అంశాలను తాము సీరియస్ గా పరిగణిస్తున్నామని.. వాటి కట్టడికి తీవ్రంగా శ్రమిస్తున్నామని ప్రభుత్వంతో మెటా బృందం పేర్కొంది. ఈ విషయంలో ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటూ, ఇంకా మెరుగయ్యేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపినట్లు సమాచారం.

## మా ముగ్గురిలో ఎవరిపై దాడి జరిగినా ముగ్గురిపైనా జరిగినట్టే..!


కలయిక చమురు సంపద కలిగిన సౌదీ అరేబియా, అణు సామర్థ్యం ఉన్న పాకిస్థాన్, నాటో కూటమిలో రెండో అతిపెద్ద సైనిక బలం కలిగిన టర్కీలు ఒకే వేదికపైకి రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా మూడు దేశాల మధ్య సైనిక విన్యాసాలు, టెక్నాలజీ బదిలీ, నిఘా సమాచారాన్ని పరస్పరం పంచుకోనున్నారు. ఇరాన్ అలాగే ప్రాంతీయ తిరుగుబాటు దారుల నుంచిఎదురవుతున్న డ్రోన్, మిస్సైల్ దాడుల నేపథ్యంలో సౌదీ అరేబియా తన రక్షణ భాగస్వామ్యాలను విస్తరించుకునేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. అమెరికా ప్రాధాన్యతలు మారుతుండటం, ఇజ్రాయెల్-గాజా ఉద్రిక్తతల నేపథ్యంలో మారుతున్న ప్రాంతీయ సమీకరణాలకు ఈ ఒప్పందం స్పష్టమైన సంకేతంగా నిలుస్తోంది.

### స్పందించిన ఇరాన్

మూడు దేశాల రక్షణ ఒప్పందంపై ఇరాన్ స్పందించింది. ఒప్పందంపై మూడు దేశాలు సంతకాలు చేసినప్పటికీ.. ఆ కాగితపు ఒప్పందం శాశ్వత భద్రతకు హామీ ఇవ్వదనే విషయాన్ని సౌదీ తెలుసుకోవాలని ఇరాన్ పార్లమెంట్, నేషనల్ సెక్యూరిటీ అండ్ ఫారిన్ పాలసీ కమిషన్ సభ్యుడు ఇబ్రహీం రెజాయి పేర్కొన్నారు. సౌదీ అరేబియా తన విధానాలను మార్చుకుంటే.. భద్రత కోసం ఇతరులను వేడుకోవాల్సిన అవసరం ఉండదన్నారు.

## చిన్నతరహా పరిశ్రమలకు పెద్దపీట

- చేతివృత్తులు, రైతులకు మార్కెట్ అవకాశాలు
- బ్రిక్స్ మంత్రుల సమావేశంలో నిర్ణయం
- కేంద్రమంత్రి పీయూష్ గోయల్




జైపూర్,ఆగస్టు 7 (జనంసాక్షి) : దేశంలోని చిన్న తరహా పరిశ్రమలు, చేతివృత్తుల కళాకారులు, రైతులు, మత్స్యకారుల ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లలో అవకాశాలు పెంచేందుకు వీలుగా కేంద్రం సరికొత్త చర్యలు తీసుకుంది. ఇందుకోసం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల నిబంధనలను సవరించినట్లు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. జైపూర్‌లో జరిగిన 'బ్రిక్స్' వాణిజ్య, పరిశ్రమల మంత్రుల సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ-కామర్స్ ద్వారా అంతర్జాతీయ లబ్ధి: హ్యాండ్‌లూమ్స్, హస్తకళలు, టెక్స్‌టైల్స్, పాదరక్షలు, ఆహార ఉత్పత్తులను పెద్ద ఎత్తున ఈ-కామర్స్ వేదికల ద్వారా విదేశాలకు ఎగుమతి చేసేందుకు నిబంధనలను సరళీకృతం చేశారు. భారతదేశంలోని గ్రామీణ కళాకారులు, ఎంఎస్ఎంఈలు , రైతులకు ప్రపంచవ్యాప్తంగా అతిపెద్ద వినియోగదారుల మార్కెట్లను అందుబాటులోకి తేవడమే లక్ష్యమని అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి బ్రిక్స్ దేశాల్లో పెట్టుబడులు, కొత్త ఉద్యోగ అవకాశాలు సృష్టించడంపై విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. సభ్య దేశాల మధ్య వాణిజ్య పక్రియను మరింత డిజిటలైజ్ చేయడం, కాగిత రహిత పక్రియగా మార్చడం, ఓ-నూఓఇలకు అవసరమైన ఆర్థిక సాయం వేగంగా అందించడంపై నిర్ణయాలు తీసుకున్నారు. కాగా, బ్రిక్స్ కూటమికి కామన్ కరెన్సీ ఏర్పాటు చేసే ఆలోచనకు భారతదేశం మద్దతు ఇవ్వడం లేదని ఈ సందర్భంగా పీయూష్ గోయల్ స్పష్టం చేశారు. జాతీయ చేనేత దినోత్సవం (ఆగస్టు 7) సందర్భంగా తీసుకున్న ఈ నిర్ణయం ఖాదీ, కుటీర పరిశ్రమలు, తోలు రంగానికి చెందిన కళాకారులకు ఎంతో మేలు చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## 10న సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 7 (జనంసాక్షి) :** కొత్తగూడెంలోనిశేషగిరి భవన్ లో కార్మిక సంఘాల నాయకుల విలేకరుల సమావేశం నిర్వహించారు. 12వ వేజ్ బోర్డు అమలులో జాప్యాన్ని నిరసిస్తూ ఈనెల 10న సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ ..సింగరేణి కార్మికులకు 12వ వేతన సంఘం ఏఃఅఅఎ కమిటీని ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం చాలా మొండి వైఖరిగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. కోల్ ఇండియా యాజమాన్యం సైతం తక్కువ వేతనాలతో 12వ వేజ్ బోర్డును తక్కువ వేతనాలతో సరి చేయాలని చూస్తున్నారని, కుట్ర జరుగుతుందని విమర్శించారు. జె బి సి సి ఐ జూలై 12 2026 నుండి 12వ వేతన సంఘం అమరి చేయాల్సి ఉందన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్ ని అమలు చేసి కోల్ ఇండియాలో ఉన్న బొగ్గు గని కార్మికులకు నాలుగు లేబర్ కోడ్స్ ను అమలు చేసి, కేంద్ర సంఘాలకు కూడా ఎన్నికలు పెట్టాలని కుట్రలు చేస్తుందని విమర్శించారు. 51 శాతం ఓట్లు వచ్చిన యూనియన్ ను వన్ యూనియన్ ఫర్ వన్ ఇండస్ట్రీ విధానం అమలు చేసేదుకు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. 20 శాతం ఓట్లు వచ్చిన వారు మాత్రమే ట్రేడ్ యూనియన్ నెగోషియేషన్లో ఉండాలన్న కండిషన్ల పేరుతో 12 వేజ్ బోర్డును జాప్యం చేస్తున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో జాతీయ బొగ్గు గని కేంద్ర కార్మిక సంఘాలు ఐక్యమై ఈనెల 10వ తారీఖున ఆల్ జనరల్ మేనేజర్స్ కార్యాలయాల ఎదుట కార్మికుల ధర్నా చేయనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 12వ తారీఖున దేశవ్యాప్తంగా బొగ్గు గని కార్మికులు, అఖిలపక్ష కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పెద్ద సదస్సును ఏర్పాటు చేసి 12వ వేజ్ బోర్డు కార్మికులకు లాభదాయకంగా ఉండాలని, కోల్ ఇండియాలో ఉన్న యాజమాన్యం నుండి వైఖరికి వ్యతిరేకంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించేందుకు తీర్మానం చేయనున్నట్లు తెలిపారు.


## చేనేత సహకార సంఘాలు ఆర్థిక పరిపుష్టి సాధించాలి

- ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య



**వరంగల్ ప్రతినిధి, ఆగస్టు 7 (జనంసాక్షి):** చేనేత సంఘాలు, చేనేత కార్మికులని దృష్టిలో పెట్టుకొని మార్కెట్ కు తగిన ఉత్పత్తులు తయారు చేసి సంఘాలు పరిపుష్టి అయ్యేలా కృషి చెయ్యాలని ఎమ్మెల్సీ బసవరాజ్ సారయ్య అన్నారు. శుక్రవారం జాతీయ చేనేత దినోత్సవంను పురస్కరిచుకొని, జాతీయ చేనేత దినోత్సవంను వరంగల్ కొత్తవాడ పద్మశాలి కమ్యూనిటీ హాల్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిధులు ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, జిల్లా కలెక్టర్, డాక్టర్ సత్య శారదా దేవి అతిథులుగా పాల్గొని ప్రసంగించారు .ఈ సందర్భంగా చేనేత నడకని కొత్తవాడ లోని, ఇందిరా గాంధీ విగ్రహం నుండి ప్రారంభించటం జరిగినది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి లు కలిసి, చేనేత అనుభవం, నైపుణ్యం కలిగిన చేనేత కార్మికులు సన్మానం చేశారు. జిల్లా కలెక్టర్ డా. సత్య శారద మాట్లాడుతూ ఇక్కడి చేనేత కార్మికులు ప్రస్తుత ఫాషన్ కి తగినట్లు వస్త్రోత్పత్తి చేసి అధిక ఆదాయం పొందాలని ఎమ్మెస్ ఎం ఈ ద్వార చేనేత కార్మికులు నమోదు చేసికొని ఎగుమతికి వీలైన ఉత్పత్తులు చెయ్యాలని ఇక్కడ వున్నా చేనేత కళాకారుల నైపుణ్య వారసత్వాన్ని కొనసాగించాలని, చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాలు కల్పించటం ప్రజలు చేనేత వస్త్రాలను వినియోగించేలా అవగాహనా కల్పించటం ద్వారా చేనేత రంగానికి మరింత ప్రోత్సాహము లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమములో వై. శ్రీకాంత్ రెడ్డి, సహాయ సంచాలకులు, చేనేత మరియు జాలిశాఖ, వరంగల్ గారు, జెనరల్ మేనేజర్, ఇండస్ట్రీస్ వరంగల్ గారు, సుదీర్ కుమార్, డెవలప్మెంట్ ఆఫీసర్, సమాఖ్య అద్యక్షులు, పంతగాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

## బెహరన్‌లో తెలంగాణ ప్రవాసులకు అండ



- సమాజ సేవకులు కోటగిరి నవీన్ ను సన్మానించిన సీఎం ప్రజావాణి ఇంచార్జ్ చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి విద్యాసాగర్

**హైదరాబాద్ (జనంసాక్షి) :** గల్ఫ్ ఎడారి బెహరన్ దేశంలో కష్టాల పాలవుతున్న తెలంగాణ ప్రవాసులకు అండగా నిలుస్తూ అన్ని రకాల సేవలను నిస్వార్ధంగా అందిస్తున్న సమాజ సేవకులు, బహరేన్ దేశంలో నివాసం ఉంటున్న హాస కొత్తూరు వాసి కోటగిరి నవీన్ కుమార్ ను సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి కే. విద్యాసాగర్ శాలువతో ఘనంగా సన్మానించారు. శుక్రవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో జరిగిన ఈ కార్యక్రమంలో కోటగిరి కోటగిరి నవీన్ కుమార్ సేవలను వారు అభినందించారు. ఆపదలో ఉన్న తెలంగాణ వారిని గల్ఫ్ దేశాల్లో ముఖ్యంగా బహరేన్ దేశంలో ఆదుకుంటున్న నవీన్ కుమార్ సేవలు ఇలాగే భవిష్యత్ లో కూడా కొనసాగాలని చిన్నారెడ్డి, విద్యాసాగర్ ఆకాంక్షించారు. కోటగిరి నవీన్ కుమార్ నిజామాబాద్ జిల్లా కమ్మర్పల్లి మండలం హస కొత్తూరు గ్రామ వాసి. ఈ కార్యక్రమంలో ఎన్ ఆర్ ఐ సలహా మండలి వైస్ చైర్మన్ మంద భీం రెడ్డి కూడా పాల్గొన్నారు.

## మనూలో సివిల్స్‌కు ఉచిత శిక్షణ

- మైనార్టీ,ఎస్సీ,ఎస్టీ,మహిళలకు అవకాశం
- ఆగస్టు 12తో దరఖాస్తుల గడువు ముగింపు
- తెలంగాణ మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాకూబ్ పాషా



**హైదరాబాద్ (జనంసాక్షి) :** 2027లో జరగనున్న యుపిఎస్సి సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సిద్ధమవుతున్న మైనారిటీ, ఎస్సీ, ఎస్టీ మరియు మహిళా అభ్యర్థులు, హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ వారు అందిస్తున్న ఉచిత సివిల్స్ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యాకూబ్ పాషా శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కార్పొరేట్ స్థాయికి ధీటుగా జాతీయ స్థాయిలో సివిల్స్ ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలకు గాను ఒక ఏడాది పాటు ఉచిత భోజన, వసతి సౌకర్యాలతో కూడిన శిక్షణను విశ్వవిద్యాలయం అందిస్తుందని, ఆసక్తి గల అభ్యర్థులు తమ 10వ తరగతి సర్టిఫికేట్, డిగ్రీ సర్టిఫికేట్ మరియు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోతో ఆగస్టు 12వ తేదీలోగా https://manuu.gleamappstore.com వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆగస్టు 16న నిర్వహించే ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి ఈ శిక్షణ పొందే అవకాశం లభిస్తుందని పేర్కొంటూ, అర్హులైన అభ్యర్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాల కొరకు 8520860785 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

# టీ బోర్డుల అంశంపై కౌన్సిల్‌లో మాటల యుద్ధం

- ప్రజల భద్రత వర్సెస్ జీవనోపాధి
- కాంగ్రెస్, బీఆర్ఎస్ కౌన్సిలర్ల మధ్య చర్చ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి) :** భూపాలపల్లి మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశం శుక్రవారం ఆసక్తికరంగా సాగింది. మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య అధ్యక్షతన శుక్రవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో పట్టణంలోని టీ బోర్డులు, హోల్డింగ్ బోర్డుల ఏర్పాటు అంశంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ కౌన్సిలర్ల మధ్య మాటల యుద్ధం చోటుచేసుకుంది. సమావేశంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు కురుమిళ్ళ శ్రీనివాస్, కిషన్ లు మాట్లాడుతూ భూపాలపల్లి పట్టణంలో ఇష్టానుసారంగా ఏర్పాటు చేసిన టీ పోల్స్, హోల్డింగ్ లాంటి టీ బోర్డుల కారణంగా ప్రజలు ప్రమాదాలకు గురయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గాలివాన, వర్షాల సమయంలో ఈ బోర్డులు ఊగిసలాడుతున్నాయని, నిత్యం ప్రధాన రహదారిపై రాకపోకలు సాగించే ప్రజలకు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొందని ఆయన అన్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని పలుచోట్ల బోర్డులు కూలి ప్రమాదాలు జరిగిన సంఘటనలను ఉదాహరణగా చూపిన శ్రీనివాస్, ప్రజలకు ఎలాంటి హాని జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ టీ బోర్డులను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కౌన్సిల్‌లో తీర్మానం చేయాలని కోరారు. మరికొందరు కాంగ్రెస్ కౌన్సిలర్లు కూడా ఆయనకు మద్దతుగా మాట్లాడారు.

### జీవనోపాధికి గండిపడుతుంది : బీఆర్ఎస్ కౌన్సిలర్ స్పందన..

కాంగ్రెస్ కౌన్సిలర్ల డిమాండ్‌కు కౌంటర్‌గా బీఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్ గండ్ర హరీష్ రెడ్డి స్పందించారు. టీ బోర్డులు రాష్ట్రంలోని అనేక పట్టణాల్లో ఏర్పాటు చేశారని, అక్కడ లేని ఇబ్బందులు భూపాలపల్లిలో మాత్రమే ఎందుకు వస్తున్నాయని ప్రశ్నించారు. ఈ బోర్డుల ద్వారా అనేకమంది చిన్న వ్యాపారులు, యువకులు తమ కుటుంబాలను పోషించుకుంటున్నారని, వాటిని తొలగిస్తే వారి జీవనోపాధికి గండిపడినట్టు అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రమాదకరంగా ఉన్న బోర్డులను మాత్రమే సరిచేయించాలని, అంతేగానీ అన్నింటినీ తొలగించడం సరికాదని సూచించారు. దీంతో ఇరు పార్టీల కౌన్సిలర్ల మధ్య చర్చ సాగింది.

### 2022లోనే నిషేధం ఉంది : కమిషనర్ వివరణ..

ఇరు పార్టీల కౌన్సిలర్ల మధ్య చర్చ సాగుతున్న సమయంలో మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్ కల్పించుకున్నారు. గత 2022వ సంవత్సరంలోనే అనుమతి లేకుండా టీ బోర్డులు ఏర్పాటు చేయడంపై ప్రభుత్వం నిషేధం విధించిందని ఆయన గుర్తు చేశారు. అయితే పట్టణంలో ఎక్కడెక్కడ అనుమతి లేని బోర్డులు ఉన్నాయనే దానిపై పూర్తిస్థాయిలో సర్వే చేస్తామని, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాటిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల భద్రతకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తామని, అదే సమయంలో చిన్న వ్యాపారుల జీవనోపాధిని కూడా దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకుంటామని కమిషనర్ స్పష్టం చేయడంతో చర్చ సద్దుమణిగింది. సమావేశంలో టీ బోర్డుల అంశంపై ఇంత చర్చ జరగడంతో "వీటి వెనుక ఉన్న అసలు ఉద్దేశం ఏమిటి" అంటూ సభలోని సభ్యులు చర్చించుకోవడం విశేషంగా మారింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సర్పంచులు మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలి

- వరంగల్ జెడ్పి సీఈవో రామ్ రెడ్డి..



**దుగ్గొండి,ఆగస్టు 6 (జనం సాక్షి):** గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తూ సీజన్ కనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ సర్పంచులు ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని వరంగల్ జడ్పీ సీఈవో రామ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం దుగ్గొండి మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జడ్పీ సీఈవో రామ్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సర్వసభ్య సమావేశంలో ఇటీవల మృతి చెందిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డికి ప్రజా నిధులు అధికారులు మౌనం పాటించే పెద్ది మృతికి సంతాపం తెలిపారు. సమావేశంలో విద్య, వైద్యం పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి ఈజీఎస్ అంశాలపై చర్చించారు. జెడ్పి సీఈఓ మాట్లాడుతూ గ్రామాల్లో సర్పంచులు అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని గ్రామంలోన మంచినీటి ఎద్దడి నివారణకు కృషి చేస్తూ వర్షాకాలం సీజన్లో క్లోరినేషన్ చేసిన తాగునీటిని అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించి స్వచ్ఛత వైపు ప్రయాణించేందుకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో దుగ్గొండి ఎంపీడీవో అరుంధతి మాట్లాడుతూ సర్పంచులు గ్రామాలను అభివృద్ధి పథంలో పయనిస్తూ ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో దుగ్గొండి తాసిల్దార్ సమ్మక్క, ఎంఈఓ వెంకటేశ్వర్లు, ఎం పి ఓ చంద్రమోహన్, వైద్యాధికారులు కిరణ్ రాజ్, విజయ్ కుమార్, వెటర్నరీ అధికారి సోమశేఖర్, ఏఈ మంగీలాల్, వ్యవసాయ అధికారి శ్యామ్, సొసైటీ అధ్యక్షులు తోకల శ్రీనివాస్ రెడ్డి, ముత్యాల వెంకటేశ్వర్లు, చెన్నూరి కిరణ్ రెడ్డి, ఇంగోలి రాజేశ్వరరావు, సర్పంచులు అధికారులు పాల్గొన్నారు.

## ఎఫ్‌సీఆర్ఏ చట్ట సవరణపై యూఎస్ ప్రజాప్రతినిధి అభ్యంతరం

- స్పందించిన భారత్



**ఢిల్లీ, ఆగస్టు 7 (జనంసాక్షి) :** విదేశీ నిధుల నియంత్రణకు ఉద్దేశించిన ఎఫ్‌సీఆర్ఏ చట్టానికి భారత్ చేయనున్న సవరణలపై అమెరికా ప్రతినిధుల సభ సభ్యుడు రైలీ మూర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ పరిణామాలపై భారత విదేశాంగ శాఖ స్పందించింది. చట్టాలు, వాటి సవరణలు తమ అంతర్గత విషయాలని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. అమెరికా సహా అనేక దేశాల్లో ఇలాంటి చట్టాలు ఉన్నాయని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. ప్రజాస్వామిక పద్ధతుల్లో భారత్ చట్టాల రూపకల్పన చేస్తుందని చెప్పారు. దేశీయ చట్టాలకు వాటికంటూ ప్రత్యేక నేపథ్యం ఉంటుందని చెప్పారు. ఈ దృష్టికోణంలోనే చట్టాలను విశ్లేషించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రతిపాదిత సవరణలపై రైలీ మూర్ ఇటీవల స్పందిస్తూ పలు ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ సవరణలు చట్ట రూపం దాలిస్తే యూఎస్-భారత్ ద్వైపాక్షిక బంధాలు దెబ్బతింటాయని అన్నారు. ఈ సవరణలతో మతపరమైన చారిటీ సంస్థలను భారత్ నియంత్రించే అవకాశం ఉందని హెచ్చరించారు. విదేశీ నిధులతో దేశ సార్వభౌమత్వం, సమగ్రత, భద్రత, ప్రజాప్రయోజనాలు, ప్రజాస్వామిక సంస్థలపై ప్రతికూల ప్రభావం పడకుండా భారత్ ఎఫ్‌సీఆర్ఏ చట్టాన్ని గతంలో తీసుకొచ్చింది. ఇక విదేశీ నిధులతో నడిచే సంస్థల కార్యకలాపాల్లో మరింత పారదర్శకత, జవాబుదారీతనం, మెరుగైన నిర్వహణ కోసమే తాజా మార్పులను ప్రతిపాదిస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వవర్గాలు తెలిపాయి.

## తెలంగాణలో అధికారంలోకి రావడమే టార్గెట్

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు



**ఢిల్లీ, ఆగస్టు 7 (జనంసాక్షి) :** వచ్చే ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేసి గెలుపు సాధిస్తామన్నారు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు. తెలంగాణలో అధికారంలోకి రావడమే బీజేపీ టార్గెట్ అని స్పష్టం చేసారు. అధికారం చేపట్టే విషయంలో ఎవరితోనూ పొత్తు ఉండదని పేర్కొన్నారు. తెలంగాణలో జనసేనతో సహా ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోబోమని ఆయన తేల్చి చెప్పారు. అయితే, ఎన్డీయే కూటమిలో జనసేన పార్టీ భాగస్వామి అని, దానిపై జాతీయస్థాయిలోనే నిర్ణయం ఉంటుందని స్పష్టం చేశారు. బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపీలతో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో బీజేపీ బలోపేతంపై కీలకంగా చర్చించారు. నియోజకవర్గాల వారీగా పార్టీ పరిస్థితిని సమీక్షించారు. సంస్థాగత విస్తరణ, భవిష్యత్ కార్యాచరణపైనా చర్చ జరిగింది. అనంతరం రాంచందర్ రావు మీడియాతో మాట్లాడుతూ.... రాష్ట్రంలో అధికారం కోసం రోడ్ మ్యాప్ సిద్ధం చేస్తున్నామని తెలిపారు. 937 మండలాల్లో పార్టీని బలోపేతం చేస్తున్నామని వెల్లడించారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీదే గెలుపని, కచ్చితంగా అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్ తరహాలో ఇక్కడా విజయం సాధించి అధికారం చేపడతామన్నారు. రాష్ట్రంలోని కీలక నేతలంతా బీజేపీలో చేరేందుకు సమయం కోసం వేచి చూస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. తమ పార్టీ నేతల మధ్య విభేదాలు లేవని, భేదాభిప్రాయాలు మాత్రమే ఉన్నాయని రాంచందర్ రావు పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వంలో అవినీతి పెరిగిపోయిందని, కలిసి పోరాటం చేయాలని నితిన్ నబీన్ దిశానిర్దేశం చేశారని చెప్పుకొచ్చారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం రాష్ట్ర బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో మరోసారి సమావేశం నిర్వహిస్తామని రాంచందర్ రావు తెలిపారు. ఇకపై ప్రతి మూడు నెలలకు ఒకసారి నితిన్ నబీన్.. రాష్ట్రానికి వస్తారని, ఇక్కడి నేతలతో సమావేశమై దిశానిర్దేశం చేస్తారన్నారు. ప్రజా సమస్యల విషయంలో రాష్ట్ర ప్రభుత్వంపై పోరాడుతామని చెప్పారు. కాగా, ఈ సమావేశంలో సునీల్ బన్సల్, అభయ్ పాటిల్ వంటి నేతలు కూడా పాల్గొన్నారు.

## విద్యార్థులను బూతులు తిడుతున్న వార్డెన్ ను సస్పెండ్ చేయాలి

- పిడిఎస్‌యు డిమాండ్

**నిజామాబాద్, ఆగస్టు 7 (జనంసాక్షి) :** ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పిడిఎస్యు ఆర్మూర్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో ఎస్టీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని విద్యార్థులు పట్ల ఆమానుషంగ బూతులు తిడుతున్న వాడిని సస్పెండ్ చేయాలని నిజామాబాద్ కలెక్టర్ ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రం అందించడం జరిగింది... ఈ సందర్భంగా పిడిఎస్యు జిల్లా ఉపాధ్యక్షులు నిఖిల్ మాట్లాడుతూ ఆర్మూర్ పట్టణ కేంద్రంలో గల ప్రభుత్వ ఎస్టీ బాలుర వసతి గృహంలో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వారు అన్నారు వసతి పురం ప్రారంభమై 40 రోజులు గడుస్తున్నా నేటి వరకు విద్యార్థులకు సకాలంలో పౌష్టికంగా మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని అన్నారు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని వసతి గృహ వార్డెన్ గోదావరి గారిని విద్యార్థులు అడగగా తనకు ఇష్టం వచ్చిన రీతిలో విద్యార్థులు బూతులు తిడుతూ మీరు హాస్టల్ నుండి వెళ్లిపోవాలని హుకుం జారీ చేస్తుందని అన్నారు.. విద్యార్థులు వార్డెన్ దగ్గరికి మెనూ ప్రకారం భోజనం అందించాలని అడిగితే మీరు మహిళ అని చూడకుండా దగ్గరికి వస్తారా అంటూ వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు. వసతి గృహంలో పరిశుభ్రత పాటించడం లేదని మూత్రశాలలు బాత్రూంలను సైతం సరిగ్గా పరిశుభ్రతగా ఉంచకుండా పూర్తిగా గదులలో వాసనతో నిండిపోయిందని అన్నారు..



## సోషల్ మీడియాలో ప్రచారంతో ప్రజలను మభ్యపెట్టలేరు

- బీఆర్ఎస్ నేతలకు భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

**న్యూఢిల్లీ, ఆగస్టు 07 (జనంసాక్షి) :** సోషల్ మీడియాలో ప్రచారంతో ప్రజలను మభ్యపెట్టలేరని బీఆర్ఎస్ నేతలకు భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో వరుస ఓటములపై ఆత్మ పరిశీలన చేసుకోవాలని ఆ పార్టీ నేతలకు సూచించారు. శుక్రవారం న్యూఢిల్లీలో ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డిపై జరుగుతున్న ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ ప్రచారంపై ప్రతి కాంగ్రెస్ నేతకు బాధ్యత ఉందని అన్నారు. జిల్లా, మండల స్థాయిలో స్పోక్స్ పర్సన్లను నియమిస్తామని తెలిపారు. మండల అధ్యక్షులు వారానికి ఓ సారి ప్రెస్ మీట్ పెట్టాలని వారిని ఆదేశించారు.

## ఐఏఎస్ సందీప్ కేసు విచారణలో తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్, ఆగస్టు 7 (జనంసాక్షి) :** కోర్ట్ ధిక్కరణ వ్యవహారంలో తెలంగాణ ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా హైకోర్టు ముందు వ్యక్తిగతంగా విచారణకు హాజరయ్యారు. కేసు విచారణ సందర్భంగా హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సందీప్ సుల్తానియాపై వెయ్యి కేసులు ఉన్నాయని.. అవన్నీ విచారణ చేస్తే జీవిత కాలం జైల్లో ఉండాలని పేర్కొంది. ప్రభుత్వాలు చేసిన తప్పుకు అధికారులకు ఈ పరిస్థితి వచ్చిందన్నారు. అధికారులను హైకోర్టుకు పిలిపించడం బాధగా ఉందని.. తప్పని పరిస్థితుల్లో హాజరుకావాలని ఆదేశిస్తున్నామని న్యాయస్థానం తెలిపింది. ఉచిత పథకాల వల్ల చాలా ప్రమాదం ఉందని.. రైతుబంధు అనేది సంపన్నులు, అధికారులు కూడా తీసుకుంటున్నారని.. ఇది చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేసింది. రైతుబంధుతో రాష్ట్ర ఖజానాకు భారమని హైకోర్టు వ్యాఖ్యానించింది.

## కారు బీభత్సం



**నిజామాబాద్, ఆగస్టు 7 (జనంసాక్షి) :** నందిపేట్ మండల కేంద్రంలో కారు బీభత్సం సృష్టించింది. నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండల కేంద్రంలో రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గ్రామ శివారులో వేగంగా వెళ్తున్న ఓ కారు రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌లపై ప్రయాణిస్తున్న నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం అనంతరం కారు నందిపేట్ మండల కేంద్రంలోని గుత్ప కెనాల్ సమీపానికి చేరుకుని అగ్నికి ఆహుతైంది. మంటలు చెలరేగడంతో కారు పూర్తిగా కాలిబూడిదైంది. స్థానికుల సమాచారంతో ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు, సహాయక సిబ్బంది క్షతగాత్రులను జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సంపాదకీయం

# గోడ దూకితే గౌరవం.. ఓటరే మోసపోయాడా?

## ఫిరాయింపుదారులకు అండగా నిలిచే రాజకీయాలు ప్రజాస్వామ్యానికి ప్రమాద ఘంటికలు

ప్రజాస్వామ్యంలో అంతిమ యజమాని ప్రజలే. ఎన్నికల సమయంలో వారు ఇచ్చే తీర్పు ఐదేళ్ల రాజకీయ దిశను నిర్ణయిస్తుంది. ఆ తీర్పును గౌరవించడం ప్రతి ప్రజాప్రతినిధి, ప్రతి రాజకీయ పార్టీకి రాజ్యాంగబద్ధమైన, నైతికమైన బాధ్యత. కానీ నేడు దేశ రాజకీయాల్లో జరుగుతున్న పరిణామాలు ఈ విలువలను క్రమంగా బలహీనపరుస్తున్నాయనే ఆందోళన పెరుగుతోంది.

పార్టీ మారిన ఎంపీలకు ప్రధాని నరేంద్ర మోదీ "మీకు నేనున్నాను... అందరికీ గౌరవం, అవకాశం ఉంటుంది" అని చెప్పడం రాజకీయ వ్యూహంగా కొందరికి కనిపించవచ్చు. అయితే మరోవైపు, అది ఫిరాయింపులకు నైతిక అంగీకారం లభించినట్టుగా భావించే అవకాశమూ ఉంది. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు ఎన్నికల మధ్యలోనే పార్టీలు మార్చి అధికార పక్షంలో చేరితే, చివరకు ఓడిపోయేది ప్రత్యర్థి పార్టీ కాదు ఓటరే.

ప్రజలు బ్యాలెట్ పత్రంపై ఒక అభ్యర్థి పేరు మాత్రమే చూసి ఓటు వేయరు. ఆ అభ్యర్థి వెనుక ఉన్న పార్టీ, ఎన్నికల గుర్తు, సిద్ధాంతం, నాయకత్వం, హామీలను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. అలాంటి ప్రజా తీర్పును వ్యక్తిగత రాజకీయ భవిష్యత్తు కోసం మరో పార్టీకి తాకట్టు పెట్టడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. అలాంటి చర్యలను రాజకీయంగా ప్రోత్సహించే సంకేతాలు వెలువడితే, ప్రజల ఓటు విలువ క్రమంగా తగ్గిపోతుంది.

ఇది ఒక్క రోజులో మొదలైన జాడ్యం కాదు. "తిలా పాపం తలా పిడికెడు" అన్నట్లుగా దాదాపు అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు ఏదో ఒక సందర్భంలో ఫిరాయింపులను ప్రోత్సహించాయి. కానీ ప్రజాస్వామ్యంలో తప్పుకు చరిత్ర సర్టిఫికెట్ కాదు. గతంలో జరిగిన తప్పును సరిదిద్దాల్సిన బాధ్యత నేటి నాయకత్వంపై ఉంటుంది. అదే తప్పును కొనసాగించడం రాజకీయ చాతుర్యం కాదు; ప్రజాస్వామ్య ప్రమాణాలను దిగజార్చడమే.

పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం (యాంటీ-డిఫెక్షన్ లా) ఉద్దేశం స్పష్టంగా ఉంది. ఓటర్ల తీర్పును కాపాడటం. అయితే ఆచరణలో ఈ చట్టం అనేక సందర్భాల్లో బలహీనపడుతోంది. స్పీకర్ల నిర్ణయాల్లో జాప్యం, న్యాయపరమైన వివాదాలు, రాజకీయ లెక్కలు కారణంగా ఫిరాయింపులు జరిగినా వెంటనే పరిష్కారం కనిపించడం లేదు. దీంతో ప్రజల్లో చట్టాలపై నమ్మకం కూడా దెబ్బతింటోంది. ఇలాంటి పరిస్థితుల్లో అవసరమైంది మరింత కఠినమైన వ్యవస్థ. పార్టీ మారిన ప్రజాప్రతినిధి వెంటనే తన సభ్యత్వాన్ని కోల్పోయి, మళ్లీ ప్రజల తీర్పు కోరాల్సిన పరిస్థితి రావాలి. ప్రజలు తిరిగి గెలిపిస్తే అతనికి నైతిక బలం ఉంటుంది. లేకపోతే ప్రజల తీర్పును మధ్యలోనే మార్చే హక్కు ఏ ప్రజాప్రతినిధికీ ఉండకూడదు.

దేశ యువత నేడు రాజకీయాలను నిశితంగా గమనిస్తోంది. వారికి కేవలం అభివృద్ధి మాత్రమే కాదు; రాజకీయ విలువలు కూడా ముఖ్యమే. నిజాయితీ, జవాబుదారీతనం, ప్రజా తీర్పుపై గౌరవం.. ఇవే కొత్త తరం ఆశిస్తున్న ప్రమాణాలు. అలాంటి సమయంలో ఫిరాయింపులను సహజ రాజకీయ ప్రక్రియగా చూపించడం ప్రజాస్వామ్య భవిష్యత్తుకు మంచిది కాదు.

**పార్లమెంటు, శాసనసభలు కేవలం సంఖ్యాబలం ప్రదర్శించే వేదికలు కావు. అవి ప్రజల విశ్వాసానికి ప్రతీకలు. ఆ విశ్వాసాన్ని కాపాడటమే రాజకీయ నాయకత్వం గొప్ప బాధ్యత. సంఖ్యలు పెరగడం వల్ల ప్రభుత్వం బలపడవచ్చు కానీ సూత్రాలు బలహీనపడితే ప్రజాస్వామ్యం బలహీనపడుతుంది. అధికారాలు శాశ్వతం కావు. ప్రతిపక్షం కూడా శాశ్వతం కాదు. కానీ ప్రజాస్వామ్య విలువలు మాత్రం శాశ్వతంగా నిలవాలి. ఆ విలువలను కాపాడే రాజకీయాలే దేశానికి అవసరం. ఫిరాయింపులకు భరోసా ఇవ్వడం కంటే, ప్రజల తీర్పుకు భరోసా ఇవ్వగల నాయకత్వమే భారత ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుంది.**

# వందేమాతరం.. సమాన గౌరవమా? సమకాలీన వివాదమా?




**'వందేమాతరం'.. భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో కోట్లాది మంది గుండెల్లో దేశభక్తి రగిలించిన అమర నినాదం. బంకిం చంద్ర చటర్జీ 1875లో రచించి, 1882లో తన 'ఆనందమఠ్' నవలలో చేర్చిన ఈ గీతం, బ్రిటిష్ వలసపాలనకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో జాతీయవాదానికి ప్రతీకగా నిలిచింది. 1896లో రవీంద్రనాథ్ ఠాగూర్ దీనికి స్వరకల్పన చేయగా, 1905 స్వదేశీ ఉద్యమంలో ఇది విప్లవ శంఖారావమైంది.**

జనంసాక్షి

స్వాతంత్ర్యానంతరం, 1950 జనవరి 24న రాజ్యాంగ సభ దీనిని 'జనగణమన'తో సమాన హోదా కలిగిన జాతీయ గీతంగా ఆమోదించింది. అయితే, వివాదాలకు తావులేకుండా ఉండేందుకు, కేవలం దీని మొదటి రెండు చరణాలను మాత్రమే అధికారికంగా స్వీకరించడం జరిగింది.

**వివాదానికి మూలాలు – ఆక్షేపణలు**

వందేమాతరం గీతంపై ప్రధానంగా కొన్ని ముస్లిం సంస్థల నుండి వ్యక్తమవుతున్న ఆక్షేపణల వెనుక మతపరమైన, చారిత్రక కారణాలు ఉన్నాయి: మత విశ్వాసాలు: ఇస్లాం సిద్ధాంతం ప్రకారం భగవంతుడు ఒక్కడే (తౌహీద్). సృష్టికర్తను తప్ప మాతృభూమిని దేవతగా భావించి ఆరాధించడాన్ని 'షిర్క్' (భగవంతునికి సాటి కల్పించడం)గా పరిగణిస్తారు. వందేమాతరం పూర్తి పాఠంలో దేశాన్ని దుర్గ, లక్ష్మి వంటి హిందూ దేవతలతో పోల్చడం వల్ల, దీనిని ఆలపించడం తమ మత విశ్వాసాలకు విరుద్ధమని కొందరి వాదన.

**చారిత్రక నేపథ్యం :** 'ఆనందమఠ్' నవలలోని కథాంశం ఆధారంగా, 1930ల కాలంలోనే ముస్లిం లీగ్ ఈ గీతంపై తొలిసారిగా అభ్యంతరాలు వ్యక్తం చేసింది.

**వర్తమాన పరిణామాలు- కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలు**

స్వాతంత్ర్యానంతరం దశాబ్దాల పాటు సర్దుమణిగిన ఈ వివాదం, ఇటీవల కాలంలో కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న వరుస చర్యలతో మళ్లీ తీవ్ర చర్చనీయాంశంగా మారింది. జాతీయవాదాన్ని, సాంస్కృతిక పునరుజ్జీవనాన్ని ప్రాధాన్య అంశాలుగా భావిస్తున్న కేంద్ర ప్రభుత్వం పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, అధికారిక కార్యక్రమాలలో 'వందేమాతరం' ఆలాపనను ప్రోత్సహించడం మరియు కొన్ని సందర్భాల్లో తప్పనిసరి చేసే దిశగా నిబంధనలు తీసుకవచ్చింది.

ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం ఈ గీతానికి ఉన్న చారిత్రక ప్రాధాన్యతను నొక్కి చెబుతూ, 'జనగణమన' లాగే 'వందేమాతరం'కి కూడా సమాన గౌరవం దక్కాలని స్పష్టం చేస్తోంది. అయితే, ఈ చర్యలను మైనారిటీ వర్గాలు మరియు ప్రతిపక్షాలు తమపై జరుగుతున్న సాంస్కృతిక రుద్దింపుగా భావిస్తున్నాయి.

**చట్టపరమైన అంశాలు సుప్రీంకోర్టు తీర్పులు**

ఈ వివాదంలో న్యాయస్థానాలు ఇచ్చిన పలు కీలక తీర్పులు ఇక్కడ గమనించదగినవి:

1. ఆర్టికల్ 25 (మత స్వేచ్ఛ హక్కు): నిబంధనలు లేదా ఉత్తర్వుల ద్వారా గీతాన్ని తప్పనిసరి చేయడం పౌరుల మత స్వేచ్ఛకు భంగం కలిగిస్తుందని విమర్శకులు వాదిస్తున్నారు.
2. న్యాయపరమైన పరిశీలన: గతంలో 'జాతీయ గీతం' లేదా 'జాతీయ గేయం' ఆలాపనను తప్పనిసరి చేయడంపై దాఖలైన పిటిషన్లను విచారించిన సుప్రీంకోర్టు, దేశభక్తిని బలవంతంగా రుద్దలేమని, స్కూళ్లలో లేదా ప్రభుత్వ వేదికల్లో బలవంతపు ఆలాపన సముచితం కాదని స్పష్టం చేసింది.

రాజ్యాంగంలో ఆర్టికల్ 51ఏ(ఖ) ప్రకారం జాతీయ చిహ్నాలను గౌరవించడం ప్రాథమిక విధి అయినప్పటికీ, ఆలాపనను తప్పనిసరి చేయడంపై భిన్నమైన చట్టపరమైన అభిప్రాయాలు ఉన్నాయి.

**దేశభక్తి రాజ్యాంగ సమతుల్యత**

దేశభక్తి అనేది హృదయాంతరాల నుండి స్వచ్ఛందంగా ఉద్భవించే భావన. బలవంతపు నియమాలు లేదా ఓట్ల రాజకీయాల ద్వారా కాకుండా, రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛను గౌరవిస్తూ జాతీయ సమగ్రతను చాటడమే భారతీయుల ప్రథమ కర్తవ్యం.

**చారిత్రక పరిణతి – పరిష్కార మార్గం**

ఈ వివాదానికి స్వాతంత్ర్యానికి ముందే జాతీయ నాయకత్వం ఒక పరిణతితో కూడిన పరిష్కారాన్ని కనుగొంది. 1937లో మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, రవీంద్రనాథ్ ఠాగూర్ లతో కూడిన కాంగ్రెస్ కమిటీ... మాతృభూమి ప్రాకృతిక అందాలను వర్ణించే మొదటి రెండు చరణాలు మాత్రమే జాతీయ వేదికలపై ఆలపించాలని నిర్ణయించింది. ఇది భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడేందుకు నాటి నాయకులు సాధించిన చారిత్రక సమతుల్యత.

**వైవిధ్యంలో ఏకత్వమే 'భారతీయం'**

భారతదేశం బహుళత్వానికి నిలయం. 'వందేమాతరం' మొదటి రెండు చరణాలు దేశంలోని అన్ని వర్గాలకూ ఆమోదయోగ్యమైనవి. స్వాతంత్ర్య సమరంలో ఎందరో ముస్లిం యోధులు కూడా ఈ నినాదంతోనే ప్రాణాలర్పించారు. కాబట్టి, దేశభక్తిని నిరూపించుకోవడానికి బలవంతపు చట్టాలను రుద్దడం కంటే, రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛను గౌరవించడమే లౌకిక భారత స్ఫూర్తి. చారిత్రక వాస్తవాలను గౌరవిస్తూ, సామాజిక సామరస్యాన్ని కాపాడుకోవడమే నేటి తక్షణ కర్తవ్యం.



కాలగిరి శ్రీనివాస్ రెడ్డి
సీనియర్ జర్నలిస్ట్

## చక్రబంధాలు

వస్తుపోతుంటాయి అలలు
వస్తుపోతుంటాయి కలలు
అలలు కలలు చేరవు తీరం
భ్రమలో బతకడం ఘోరం...

కలలు కనాలి చేతనలో
ఉన్నవి
అలలు తుపాను చేతన
పొందాలి
ఓడడం అంటే కార్యాచరణ
లేక పోవడం
గెలవాలంటే సామర్థ్యాలు
పదును పెట్టాలి

ఓడిన వాడితప్పిదాలు
మొండికత్తి
గెలిచిన వాడి ఓర్పు యుక్తిశక్తి
ఓ కైజారు...

ప్రకృతి లోనే వికృతి ఉన్నట్లు
గెలవడం లోనే ఓడడం
ఉంది...
షడ్రిపుల దుష్ట
వక్రాల చక్రాలు దాటాలి
షట్చక్రాల మౌన
సాధనలో గెలుపు మార్గాలు

రేడియమ్
9292527757

## నిప్పుకణికలు

ఈసారి నీరు చాపకిందుగా
రావడం లేదు
నేపాలి మంత్రికుల్లా
కొత్తనీరై ఊరకలేస్తుంది
యువతరం మేలుకొంటుంది
పబ్బం గడుపుకునే నేతలు
మగతలు వీడే రోజు వచ్చింది

ఎముకలు కుళ్ళిన యువకులు
లేరక్కడ!!
అవినీతిని ప్రశ్నించే విద్యార్థులు
ఉపాధి దొరకని యువతరం
అసహనాల రాపిడితో పిడికిలెత్తింది
ఆవేశాలు ఒక్కటిగా మండి
బూడిదయ్యింది.
నిరసన అంటే ప్రభుత్వాన్ని కూల్చడం కాదు!
సమస్యను గట్టిగా చెప్పడమే!

నవతరం నడవాలి, నడిపించాలి
చైతన్య స్వరం వినిపించాలి
రాజకీయ రాబందుల్ని
కలిసికట్టుగా చీకొట్టాలి
వర్గాలుగా మనుషుల్ని విడదీసే
కుట్రలు,కుతంత్రాల వింతల్ని
కనిపెట్టగలగాలి
విద్వేష, విష జ్వాలల్ని ఆర్పేయగలగాలి
మతం మత్తుని నింపే సనాతన
ధర్మ పరిరక్షకుల కొత్త అవతారాలు
కనిపెట్టగలగాలి ..
విద్యా, వైద్యం వ్యాపారసరుకులుగా
అంగట్లో అమ్మకం పెట్టడాన్ని నిరసించాలి
ఆత్మహత్యలు లేని రైతు సౌభాగ్యం సాధించుకోవాలి
యే దేశమైనా ఒక్కటే..!!
ఆందోళన పథం మొదలైందో!!
పాలకుల పని అధోగతే!!
ప్రజాపాలన తాడిత పీడితుల్ని
ఒకే తాటిపై చేర్చేదై ఉండాలి
శిశిరాలు ముసిరిన యువతకు
కాసింత ఉద్యోగ వసంతం ఇవ్వాలి

పాలకుల లక్ష్యం ఎప్పుడు
ప్రజా శ్రేయస్సే ఉండాలి
అది అంతిమంగా ప్రగతికి
దారి దీపమయ్యే పాలన కావాలి

మనిషితనం విరబూసి
ప్రశ్నించే కొత్త గళాలు
జ్వలిత కలాలు కావాలిప్పుడు
కుహనా రాజకీయాల్ని కాలరాసేందుకు
వేసే ప్రతి అడుగు
క్రొంగొత్త అరుణోదయం!!
వేల ఆలోచనలు సంఘర్షించే
నేటి తరం చైతన్యం,
క్రియాశీలక ఉద్యమాలే
క్రొత్త లోకం స్వప్నించే
నవ భారతానికి
గొప్ప చారిత్రాత్మక
మలుపుగా రూపొందుతాయి

అనితకృష్ణ గండమళ్ళ
9490876621

# దుర్గంధమైన నిందెలను ఎదుర్కొంటున్న కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమం

నీట్-యూజీ 2026 పేపర్ లీక్ కుంభకోణం దేశవ్యాప్తంగా విద్యార్థుల ఆగ్రహాన్ని రగిల్చింది. ఈ ఆగ్రహమే 'కాక్రోచ్ జనతా పార్టీ' (బీజేపీ) పేరిట ఓ యువ ఉద్యమంగా రూపుదాల్చింది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి నిరుద్యోగ యువతను 'బొద్దింకలు'గా, 'పరాన్నజీవుల'గా పిలవడమే ఈ ఉద్యమానికి ప్రేరణ. కానీ ఈ వ్యంగ్యం పేరు వెనుక దేశాన్ని కుదిపేస్తున్న ఓ తీవ్రమైన సత్యం ఒకటి ఉంది. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకునే వ్యవస్థ, దాన్ని సమర్థించే అధికార యంత్రాంగం, దానికి తోడు నిరసనకారులపై జరుగుతున్న అమానుష వేధింపులు.

విద్యార్థుల నిరసన ప్రదర్శనలు ప్రజాస్వామ్యంలో సహజమైన రాజ్యాంగ బద్ధమైన హక్కు. కానీ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జూలైలో జరిగిన 'చలో సంసద్' నిరసనకు పోలీసులు చూపించిన స్పందన ఆందోళన కలిగించింది. 50,000 మంది యువతీ,యువకులు, విద్యార్థులు, వారి తల్లితండ్రులు, సాధారణ ప్రజలు శాంతియుతంగా , నిరాయుధంగా ఈ నిరసన ర్యాలీలో పాల్గొన్న వారిపై , పోలీసులు, పారా మిలటరీ బలగాలతో లాఠీఛార్జ్, బాష్పవాయువు ప్రయోగం వంటి కఠిన చర్యలు తీసుకున్నారు. పార్లమెంట్ సమీపంలో రాళ్లతో నింపిన వాహనాలను పోలీసులే తెల్లవారుజామున తీసుకురావడం, స్వయంగా కార్ల అద్దాలు పోలీసులే పగలగొట్టడం వంటి ఘటనలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ దృశ్యాలను వేలాది మంది యువతీ యువకులు తమ చేతిలో ఉండే సెల్ ఫోన్లలో రికార్డ్ చేశారు. కానీ పోలీసులు విద్యార్థులు, ప్రతిపక్షాల కార్యకర్తలు దాడులు చేసినట్లు తప్పుడు కథనాలు అల్లారు. అసత్యపు కేసులు బనాయించేందుకు హర్యానాలో యాక్సిడెంట్ కు గురైన పాత కార్లను తెల్లవారుజామున పార్లమెంటు సమీప ప్రాంతంలో అక్కడ ఉంచినట్లు విద్యార్థులు సెల్ ఫోన్ తో తీసిన ఫొటోలు, వీడియోలలో రికార్డు చేసి వైరల్ చేశారు. ఇది పోలీసు వ్యవస్థ పట్ల ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీసింది. ఈ నిరసనల్లో 15 ఏళ్ల మైనర్ బాలికపై జరిగిన ఘటన మరింత సున్నితమైనది. జంతర్ మంతర్ నిరసనలో ప్రధాని మోదీపై ఆమె చేసిన వ్యాఖ్యలతో నోయిడాలో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఆమె వయస్సును తప్పుగా 25 ఏళ్లుగా పేర్కొన్నారు. తన కుమార్తె 10వ తరగతి చదువుతున్న మైనర్ అని, ఇతరుల ప్రభావంతోనే ఆమె ఆ మాటలు అన్నదని తల్లి మోదీని క్షమాపణలు కోరారు. అయితే ఈ కేసు నమోదు చేసిన ఫిర్యాదుదారు స్మృతి సింగ్ చాందెల్ అఖండ్ భారత్ హిందూ సేన జాతీయ లీగల్ హెడ్. ఒక మైనర్ పై, ఆ సంస్థతో అనుబంధం ఉన్న వ్యక్తి ఫిర్యాదు చేయడం ప్రశ్నార్థకం. అదృష్టవశాత్తూ, యువతీయువకుల డిమాండ్ మేరకు ఈ కేసును ఢిల్లీ పోలీసులు ఉపసంహరించుకున్నారు. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని కూడా పోలీసులు ఈ నిరసన సమయంలో లాగారని వీడియోలు వైరల్ అయ్యాయి.

జనంసాక్షి


ఇక ఆన్ లైన్ వేధింపులు అనేది ఈ ఉద్యమంలోని మరో చీకటి ముఖం. కాక్రోచ్ జనతాపార్టీ (సీజేపీ)నిరసనకారుల ఫోటోలు, వీడియోలు, పేర్లు, చిరునామాలు, కళాశాలల వివరాలు సోషల్ మీడియాలో బీజేపీ, ఆరెస్సెస్ మూకలు వైరల్ చేస్తున్నారు. "వారికి గుణపాఠం చెప్పాలి" అంటూ బీజేపీ శ్రేణులు బహుమతులు కూడా ప్రకటిస్తున్నారు. వారి ఎఐ చిత్రాలు, వీడియోలు కూడా ప్రచారంలో ఉన్నాయి. సీజేపీ ప్రతినిధి రత్నాసింగ్ నుండి తనపై కూడా తీవ్ర ఆన్ లైన్ వేధింపులు ఎదురవుతున్నాయని ఆమె చెప్పారు. ఇది ప్రజాస్వామ్య విలువలకు ఎదురుదెబ్బ. బిజెపి ఎంపీ, సినిమా నటి కంగనా రనౌత్ కూడా ఈ నిరసనకారులపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. "వీరు మంచి గృహిణులు కాలేరు" అంటూ వారి వ్యక్తిగత జీవనశైలిపై విమర్శలు చేయడం, ఒక ప్రజాప్రతినిధి నుండి ఆశించే పరిణతిని అపహాస్యం చేసింది.

బిజెపి నేతల అసభ్యకర వ్యాఖ్యలు ఇవి మాత్రమే కావు. విద్యా శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి, బిల్కిస్ బానో అత్యాచార కేసులో దోషుల విడుదలను సమర్థించడం, ఇతర నేతలు అనేక సందర్భాల్లో అసభ్యకర వ్యాఖ్యలు చేయడం -- వీటన్నింటికీ న్యాయపరమైన చర్యలు ఏవీ తీసుకోలేదు. ఇది ద్వంద్వ ప్రమాణాలను సూచిస్తుంది. నిరసనకారులపై కఠిన చర్యలు, అధికార పక్షం నేతలపై మౌనం , ఈ వైరుధ్యం ప్రజాస్వామ్యాన్ని ప్రశ్నిస్తుంది.

సీబీఐ నీట్-యూజీ కేసులో 13 మందిపై ఎఫ్. ఐ.ఆర్. దాఖలు చేసింది. ప్రధాని మోదీ దోషులపై శీఘ్ర విచారణకు 'ఫాస్ట్-ట్రాక్ కోర్టులు' ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కానీ గత పదేళ్లలో 152 పరీక్షా పేపర్ లీక్లు జరిగినా, ఒక్క కేసులోనూ నేరస్థులకు శిక్ష పడిన దాఖలాలు లేవు. ఇది ప్రభుత్వపై ఇచ్చిన ఉన్న హామీలపై,ప్రజలకు ఉన్న నమ్మకాన్ని దెబ్బతీసింది.సీజేపీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ ఈ హామీని 'విలువ లేనిది'గా కొట్టిపారేశారు. 22 మిలియన్ల ఇన్ స్టాగ్రామ్ అనుచరులతో, 10 లక్షల మంది నమోదు చేసుకున్న ఈ ఉద్యమాన్ని కేంద్ర హోంశాఖ తేలిగ్గా తీసుకోలేదు.. కాక్రోచ్ జనతాపార్టీ వెబ్ సైట్ ను బ్లాక్ చేయడం, సోషల్ మీడియా ఖాతాలను హ్యాక్ చేయడం వంటి చర్యలు ఇందుకు నిదర్శనం.

ఈ నేపథ్యంలో బిహార్ లోని బాంకీపూర్ ఉప ఎన్నిక ఫలితాలు మరింత అర్థవంతంగా కనిపిస్తాయి. బిజెపి కంచుకోటగా భావించే ఈ స్థానంలో జన్ సూరజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిశోర్ 19,324 ఓట్ల మెజారిటీతో గెలిచారు. యువ ఓటర్లు, ముఖ్యమంత్రిపై అసంతృప్తి ఉన్న వర్గాలు, ముస్లిం, యాదవ యువతతో సహా అన్ని వర్గాల మద్దతు ఈ విజయానికి కారణం. బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ సొంత నియోజకవర్గంలో ఈ ఓటమి ఆ పార్టీకి తీవ్ర ఎదురుదెబ్బ. ఈ ఫలితం దేశవ్యాప్తంగా ఒక సందేశాన్ని ఇచ్చింది.

కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమం కేవలం ఓ పేపర్ లీక్ కు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమం మాత్రమే కాదు. అది భవిష్యత్తును కోల్పోతున్న యువతరం ఆక్రోశం, విఫలమవుతున్న వ్యవస్థపై తిరుగుబాటు. మోదీ ప్రభుత్వం 'ఫాస్ట్-ట్రాక్ కోర్టులు', 'దోషులను వదలం' అంటూ హామీలిస్తోంది కానీ అవి కార్యరూపం దాల్చడం లేదని సీజేపీ ప్రతినిధి రత్నాసింగ్ విమర్శించారు. ఒక మైనర్ బాలికపై కేసు నమోదు చేయడం, పోలీసుల దుశ్చర్యలు, ఆన్ లైన్ వేధింపులు, అధికార పక్షం నేతల అసభ్యతరకరమైన వ్యాఖ్యలు... ఇవన్నీ ప్రజాస్వామ్య విలువలను సవాలు చేస్తున్నాయి. ప్రశాంత్ కిశోర్ విజయం బీజేపీ ప్రభుత్వం పతనం ఆరంభానికి ఓ సూచన మాత్రమే. కేవలం ఇప్పుడు తొలి అడుగు మాత్రమే పడింది. ప్రజలు, ముఖ్యంగా యువతీ, యువకులు ఈ దేశ పరిపాలనా వ్యవస్థలో సమూల మార్పులు కోరుకుంటున్నారు. నిజమైన మార్పుకు కేవలం 'ఫాస్ట్-ట్రాక్ కోర్టులు' సరిపోవు. వ్యవస్థలోని లోతైన మత, చాందస వాదం, అనాగరిక కుల,మత, జాతి , ప్రాంతీయ విద్వేషాలను నీచ ప్రచార పద్ధతులకు మూలం అయిన గోదీ మీడియాను సరిదిద్దాల్సిన అవసరం ఉంది. ఇకపై ఈ ఉద్యమం ఎంతగా పెరుగుతుందో, మన ప్రజాస్వామ్యం ఎంతగా పరిణతి చెందిందో అది రాబోయే రోజుల్లో తేలుతుంది.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
ramkishore.1504@gmail.com

# మీరు చల్లిన సిరాతోనే భవిష్యత్తు చరిత్రను లిఖిస్తాం



ఒక దేశం తన యువతను ఎలా చూస్తుందో, ఆ దేశ భవిష్యత్తు కూడా అలాగే రూపుదిద్దుకుంటుంది. యువతను కేవలం ఉద్యోగాల కోసం పోటీ పడే జనసమూహంగా చూసే దేశాలు సంకుచిత భవిష్యత్తును నిర్మించుకుంటాయి. కానీ యువతను ప్రశ్నించే శక్తిగా, సృజనాత్మక ఆలోచనకు ప్రతీకగా, ప్రజాస్వామ్యానికి జీవనాడిగా భావించే దేశాలు మాత్రమే చరిత్రలో నిలిచిపోతాయి. భారతదేశం కూడా అలాంటి గొప్ప సంప్రదాయాన్ని కలిగి ఉంది. స్వాతంత్ర్యోద్యమం నుంచి సామాజిక న్యాయం వరకు, భాషా ఉద్యమాల నుంచి విద్యా హక్కు వరకు ప్రతి చారిత్రక మలుపులో విద్యార్థుల పాత్ర కీలకమైంది.

నేడు దేశంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న అతిపెద్ద సంక్షోభం కేవలం నిరుద్యోగం మాత్రమే కాదు. పరీక్షా వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తున్న పేపర్ లీకేజీలు, నియామకాలలో అవకతవకలు, సంవత్సరాల పాటు పరీక్షల నిర్వహణలో జాప్యం, నియామకాల రద్దులు, అవినీతి వంటి సమస్యలు యువత జీవితాన్ని తీవ్ర అనిశ్చితిలోకి నెట్టాయి. లక్షలాది మంది విద్యార్థులు తమ జీవితంలోని అత్యంత విలువైన సంవత్సరాలను ఒక పరీక్ష కోసం ఖర్చు చేస్తున్నారు. కుటుంబాలు అప్పులు చేసి కోచింగ్ ఫీజులు చెల్లిస్తున్నాయి. రైతులు పంట అమ్మి పిల్లలను చదివిస్తున్నారు. కూలీలు అదనపు పనులు చేసి పుస్తకాలు కొనిపెడుతున్నారు. కానీ చివరకు ఒక ప్రశ్నాపత్రం లీక్ అయితే ఆ కుటుంబాల కలలన్నీ ఒక్క క్షణంలో కూలిపోతాయి.

ఇది కేవలం పరిపాలనా వైఫల్యం కాదు. ఇది సామాజిక అన్యాయం. ఎందుకంటే ఈ వ్యవస్థలో ఎక్కువగా నష్టపోయేది డబ్బు, రాజకీయ ప్రభావం లేని విద్యార్థులే. ధనవంతుడు మరోసారి కోచింగ్ తీసుకోగలడు. కానీ పేద విద్యార్థికి మరో సంవత్సరం అంటే మరో అప్పు, మరో నిరాశ, మరో వలస, మరో కుటుంబ భారం. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా అనేక విద్యార్థి సంఘాలు పేపర్ లీకేజీలకు వ్యతిరేకంగా నిరసనలు చేపడుతున్నాయి. అలాంటి ఒక నిరసన సందర్భంగా రాంచీలో ౼ాxూా--క్ూా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థి నాయకులు, మహిళా ఉద్యమకారులపై దాడి జరిగిందనే నివేదికలు వెలువడ్డాయి. ఈ ఘటనపై వాస్తవాలు నిష్పాక్షికంగా వెలుగులోకి రావాలి. శాంతియుత నిరసనలపై ఎలాంటి హింస జరిగినా అది ప్రజాస్వామ్య వ్యవస్థకు ఆందోళన కలిగించే అంశమే.

ప్రజాస్వామ్యం అంటే కేవలం ఐదేళ్లకోసారి ఓటు వేయడం కాదు. ప్రజలు ప్రశ్నించే హక్కు కలిగి ఉండటం కూడా ప్రజాస్వామ్యమే. ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు, విధానాలను వ్యతిరేకించే హక్కు, శాంతియుతంగా ర్యాలీలు నిర్వహించే హక్కు, ఇవన్నీ భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక స్వేచ్ఛలలో భాగం. ఈ హక్కులను హింసతో అణచివేయాలని ప్రయత్నించడం ప్రజాస్వామ్య సంస్కృతికి విరుద్ధం. ఈ ఘటనలో మహిళా ఉద్యమకారులపై సిరా చల్లినట్లు వచ్చిన సమాచారం ఒక ప్రతీకాత్మక అర్థాన్ని కూడా కలిగిస్తుంది. సిరా అంటే సాధారణంగా జ్ఞానం, రచన, ఆలోచన, చరిత్రకు ప్రతీక. అదే సిరాను అవమానానికి సాధనంగా ఉపయోగించాలని ప్రయత్నించడం ఒక మానసిక హింస. కానీ చరిత్ర మనకు మరో పాఠం చెబుతుంది. అధికారాలు ఎన్నిసార్లు ఆలోచనలను మసకబార్చాలని ప్రయత్నించినా, అదే సిరా కొత్త చరిత్రకు పునాది అయింది.


భారత స్వాతంత్ర్యోద్యమ కాలంలో విద్యార్థులు జైళ్లకు వెళ్లారు. అత్యవసర పరిస్థితి సమయంలో విద్యార్థి ఉద్యమాలు నిర్బంధాన్ని ఎదుర్కొన్నాయి. విద్యా హక్కు కోసం, సామాజిక న్యాయం కోసం, మహిళల భద్రత కోసం, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా అనేక విశ్వవిద్యాలయాలు ప్రజాస్వామ్య చర్చలకు కేంద్రాలయ్యాయి. ఈ చరిత్రను చెరిపివేయడం అసాధ్యం. విశ్వవిద్యాలయం అనేది కేవలం పరీక్షలు రాసే స్థలం కాదు. అది ప్రశ్నలు పుట్టే స్థలం. అక్కడ పుట్టే ప్రశ్నలే సమాజాన్ని ముందుకు నడిపిస్తాయి. ఒక విద్యార్థి "ఎందుకు పేపర్ లీక్ అయింది?" అని అడిగితే, అది తన వ్యక్తిగత ప్రయోజనం కోసం అడిగిన ప్రశ్న కాదు. అది మొత్తం వ్యవస్థను జవాబుదారీగా మార్చే ప్రశ్న.

నేడు పరీక్షా వ్యవస్థలో పారదర్శకత లేకపోవడం వల్ల యువతలో నిరాశ పెరుగుతోంది. ఉద్యోగ ప్రకటన వస్తుంది. పరీక్ష వాయిదా పడుతుంది. మళ్లీ తేదీ మారుతుంది. పరీక్ష జరుగుతుంది. తర్వాత పేపర్ లీక్ వార్తలు వస్తాయి. పరీక్ష రద్దవుతుంది. మళ్లీ పరీక్ష. ఈ చక్రంలో లక్షలాది మంది యువత తమ జీవితంలోని అత్యంత సృజనాత్మక సంవత్సరాలను కోల్పోతున్నారు. ఇది వ్యక్తిగత విషాదం మాత్రమే కాదు. దేశ ఆర్థిక, సామాజిక అభివృద్ధిపైనా దీని ప్రభావం ఉంటుంది. ఈ సంక్షోభానికి పరిష్కారం ఉద్యమాలను అణచివేయడం కాదు. ఉద్యమాలు ఎందుకు వస్తున్నాయో అర్థం చేసుకోవడం. ప్రశ్నించే విద్యార్థులను శత్రువులుగా కాకుండా, వ్యవస్థలోని లోపాలను చూపించే ప్రజాస్వామ్య స్వరాలుగా చూడడం. ప్రజాస్వామ్యం విమర్శలను భరిస్తేనే బలపడుతుంది; భయంతో కాదు. ఈ నేపథ్యంలో ఒక విషయం స్పష్టంగా చెప్పాలి. విద్యార్థులపై జరిగే ప్రతి హింసాత్మక చర్యను చట్టబద్ధంగా విచారించాలి. అదే సమయంలో పేపర్ లీకేజీల ఆరోపణలపై కూడా సమగ్ర, పారదర్శక విచారణ జరిపి బాధ్యులను చట్టం ముందు నిలబెట్టాలి. ప్రజల విశ్వాసాన్ని తిరిగి పొందడానికి ఇదే మార్గం. సిరాతో అవమానించాలని ప్రయత్నించిన వారు ఒక విషయాన్ని మరిచిపోతున్నారు. సిరా చేతులపై పడొచ్చు, బట్టలపై పడొచ్చు. కానీ ఆలోచనలపై పడదు. నిజం మీద పడదు. ప్రజాస్వామ్య ఆశయాలపై పడదు. చరిత్రను రాసేది అధికారపు బెదిరింపులు కాదు, ప్రశ్నించే తరాలే.

జనంసాక్షి

**పేపర్ లీకేజీ అనేది కేవలం ఒక క్రిమినల్ కేసు కాదు. అది సామాజిక విశ్వాస సంక్షోభం. పరీక్షలపై ప్రజల నమ్మకం దెబ్బతింటే, అర్హత ఆధారంగా అవకాశాలు వస్తాయనే విశ్వాసం కూడా కూలిపోతుంది. దాని ప్రభావం క్రమంగా విద్యా వ్యవస్థ నుంచి ప్రభుత్వ సంస్థల వరకు విస్తరిస్తుంది. అందుకే విద్యార్థులు ఈ ప్రశ్నను వీధుల్లోకి తీసుకువస్తున్నారు. వారి నినాదం కేవలం ఒక పరీక్ష గురించి కాదు. "మా శ్రమకు విలువ ఇవ్వండి", "మా భవిష్యత్తుతో ఆటలాడొద్దు", "న్యాయమైన అవకాశాలు కల్పించండి" అనే విజ్ఞప్తి అది.**

సిరా అనేది కేవలం ఒక ద్రవం కాదు. అది జ్ఞానానికి ప్రతీక. రచనకు ప్రతీక. చరిత్రకు ప్రతీక. దానిని అవమానానికి సాధనంగా మార్చాలని ఎవరైనా ప్రయత్నించినా, చివరకు అదే సిరా కొత్త చరిత్రను రాస్తుంది. ప్రతి ఉద్యమం ఒక పాఠం. ప్రతి ప్రశ్న ఒక మార్పుకు నాంది. ప్రతి ప్రతిఘటన ఒక కొత్త ఆశకు ఆరంభం. అందుకే నేటి యువత తరానికి చెప్పాల్సిన సందేశం స్పష్టంగా ఉంది. మీ చేతిలోని కలాన్ని వదలకండి. మీ ప్రశ్నలను ఆపకండి. మీ ప్రజాస్వామ్య హక్కులను విడిచిపెట్టకండి. న్యాయం కోసం, పారదర్శకత కోసం, సమాన అవకాశాల కోసం జరిగే శాంతియుత పోరాటాలు సమాజాన్ని ముందుకు నడిపిస్తాయి. "మీరు చల్లిన సిరాతోనే మేము భవిష్యత్తు చరిత్రను లిఖిస్తాం." చరిత్రను రాసేది అధికారపు అహంకారం కాదు. ప్రశ్నించే యువత. న్యాయం కోసం నిలబడే విద్యార్థులు. సత్యం కోసం పోరాడే ప్రజలు.



మామిండ్ల రమేష్ రాజా
7893230218

## ఉప్పల్ అభివృద్ధికి నిధులు కేటాయించాలి



**ఉప్పల్, ఆగస్టు 7 (జనం సాక్షి) :** ఉప్పల్ నియోజకవర్గంలోని వివిధ అభివృద్ధి పనులకు అవసరమైన నిధులను తక్షణమే మంజూరు చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జోన్ కమిషనర్ లిలిరాధిక గుప్త (ఐఏఎస్)లిలిను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న రహదారుల నిర్మాణం, పారిశుద్ధ్య నిర్వహణ, వీధి దీపాల ఏర్పాటు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదలతో పాటు ఇతర మౌలిక వసతుల అభివృద్ధి పనులకు తగిన నిధులు కేటాయించి, వాటిని యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, ఉప్పల్ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ లక్ష్యమని, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ సహకారంతో అన్ని అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయడానికి చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటం అవసరం

- **6 డీఏలు వెంటనే మంజూరు చేయాలి**
- **పీఆర్సీని 51 శాతం ఫిట్‌మెంట్‌తో ప్రకటించాలి**
- **టియుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లచ్చిమల్ల వెంకన్న**

**హయత్‌నగర్, ఆగస్టు 7 (జనం సాక్షి) :** టియుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టి యు టి ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లచ్చిమల్ల వెంకన్న మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో టి యు టి ఎఫ్ పోషించిన పాత్ర ఎంతో కీలకమైందని అన్నారు. సంస్థ ఆవిర్భావానికి దారితీసిన పరిస్థితులు, ఉపాధ్యాయుల హక్కులు, ఉద్యోగుల సమస్యల సాధన కోసం టి యు టి ఎఫ్ చేపట్టిన ఉద్యమాలను ఆయన వివరించారు.

6 డీఏలను వెంటనే మంజూరు చేయాలి

ఉపాధ్యాయులకు రావాల్సిన 6 డీఏలను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని లచ్చిమల్ల వెంకన్న డిమాండ్ చేశారు. డీఏలు పెండింగ్‌లో ఉండటంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఉద్యోగులకు చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా రావాల్సిన ఆర్థిక



ప్రయోజనాలను ప్రభుత్వం ఆలస్యం చేయకుండా అందించాలని కోరారు.

### 24 శాతం హెచ్‌ఆర్ఏ మంజూరు చేయాలి

జిహెచ్ఎంసి పరిధిలో 8 కిలోమీటర్ల లోపు పనిచేస్తున్న ఉద్యోగులకు 24 శాతం హెచ్ ఆర్ ఏ ను వెంటనే మంజూరు చేయాలని లచ్చిమల్ల వెంకన్న ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగులు పనిచేస్తున్న ప్రాంతాలకు అనుగుణంగా వారికి అందాల్సిన ఇంటి అద్దె భత్యాన్ని చెల్లించాల్సిన అవసరం ఉందన్నారు. హెచ్ ఆర్ ఏ విషయంలో ఉద్యోగులకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని ఆయన కోరారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడం ద్వారా ప్రభుత్వ వ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

### ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఐక్యంగా ముందుకు రావాలి

భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల సాధన కోసం అన్ని సంఘాలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఐక్యంగా ముందుకు రావాలని లచ్చిమల్ల వెంకన్న పిలుపునిచ్చారు. ఉద్యోగుల హక్కులు, సంక్షేమం కోసం ఐక్యత ఎంతో అవసరమని అన్నారు. వ్యక్తిగతంగా కాకుండా సమష్టిగా సమస్యలపై పోరాటం చేస్తే ప్రభుత్వంపై మరింత ప్రభావం చూపే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పనిచేస్తుందని, భవిష్యత్తులో కూడా అవసరమైన పోరాట కార్యక్రమాలను చేపడుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టి యు టి ఎఫ్ జిల్లా నాయకులు సాల్వది దుర్గయ్య, గుండమళ్ల మంజుల, విజయ్, దేవిప్రసాద్, బాలమళ్ల తదితరులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విజయవంతం చేశారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

- **బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షులు అరవింద్ స్వామి**
- **జడ్చర్లలో తహశీల్దార్ కార్యాలయం ముట్టడి**
- **తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేత**

**జడ్చర్ల, ఆగస్టు 7 (జనంసాక్షి) :** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అరవింద్ స్వామి డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘ జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య పిలుపు మేరకు శుక్రవారం జాతీయ బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు బదనమోని వెంకటేష్ ఆధ్వర్యంలో జడ్చర్లలో ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు బంద్ పాటించి ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు అరవింద్ స్వామి మాట్లాడుతూ నిరుపేద విద్యార్థుల చదువుల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉండాలని, వెంటనే పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా



అధ్యక్షులు బదనమోని వెంకటేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న రూ. 8,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి ఇతర పథకాలపై ఉన్న శ్రద్ధ విద్యార్థుల పట్ల ఎందుకు లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు లక్షల కోట్లు అప్పుగా చేస్తే, అందులో విద్యార్థుల చదువు కోసం ఈ బకాయిలను ఎందుకు చెల్లించలేకపోతోందని నిలదీశారు. ప్రభుత్వం బకాయిలు విడుదల చేయకపోవడంతో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఫీజుల కోసం విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నాయని, పైతరగతులకు వెళ్లే విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విద్యా సంవత్సరం నుండి ఫీజు నిధులను విద్యార్థుల ఖాతాల్లో వేస్తామని తెచ్చిన జీవో నెం. 8 మరియు జీవో నెం. 9ల వల్ల అడ్మిషన్ ఫీజులు కూడా చెల్లించుకోలేని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, అగ్రకుల పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. కాబట్టి ప్రభుత్వం ఆ జీవోలను రద్దు చేసి పాత విధానంలోనే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయి నిధులను చెల్లించనియెడల జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు గౌడుగు నర్సిములు, విద్యార్థి నాయకులు పవన్ గౌడ్, రణప్రసాద్ ముదిరాజ్, రోహిత్, దామోదర్, శిరీష, అఖిల, జ్యోతిక, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇథనాల్ ఫ్యాక్టరీలను వెంటనే మూసివేయాలి

- **ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణే లక్ష్యం**
- **జిల్లా కలెక్టర్‌కు 11న అఖిలపక్షం వినతి**



**బెజ్జంకి, ఆగస్టు 7 (జనం సాక్షి) :** బెజ్జంకి మండల కేంద్రంలో శుక్రవారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. మండల పరిధిలో ఉన్నా ఇథనాల్ ఫ్యాక్టరీలను వెంటనే మూసివేయాలని సమావేశంలో నాయకులు ఏకగ్రీవంగా డిమాండ్ చేశారు.ప్రజల ప్రాణాలు, ఆరోగ్యం, పర్యావరణం,వ్యవసాయ భూములు,భూగర్భ జలాల పరిరక్షణే లక్ష్యంగా 'మా భూమి – మా ఆరోగ్యం – మా ఊరు'అనే నినాదంతో ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేయాలని నిర్ణయించారు.ఇందులో భాగంగా ఈ నెల 11న మంగళవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించాలని నిర్ణయించారు.అవసరమైతే శాంతియుత నిరసన కార్యక్రమాలు చేపట్టి ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని నాయకులు తెలిపారు.ఇథనాల్ ఫ్యాక్టరీల సమస్యపై ఇప్పటికే ఎమ్మార్వోకు వినతిపత్రం సమర్పించడంతో పాటు బెజ్జంకి మండల బంద్ నిర్వహించినప్పటికీ సంబంధిత అధికారుల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన లేకపోవడం పట్ల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తూ,అధికారులు తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు.ప్రజల సమస్యకు పరిష్కారం లభించే వరకు అఖిలపక్షం ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటాన్ని కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్ రెడ్డి,బీజేపీ మండల అధ్యక్షుడు కొలిపాక రాజు,సీపీఐ మండల కార్యదర్శి రూపేష్ భువనగిరి,సీపీఎం మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్,మాజీ ఎంపీటీసీ లింగాల లక్ష్మణ్, బీజేపీ నాయకుడు కరివేద మహిపాల్ రెడ్డి,బీఆర్ఎస్ నాయకుడు ఏల శేఖర్,నాయకులు బొమ్మిడి సాయికృష్ణ,బోనగిరి లింగయ్య,లింగాల వెంకటేష్,సాయి కంగండ్ల శంకర్,లింగాల సురేష్,ధర్మ సమాజ్ పార్టీ మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి న్యాయవాది తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ ప్రజా వ్యతిరేక పాలనను నిరసించాలి

**తెలకపల్లి, ఆగస్టు 7 (జనంసాక్షి) :** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో ఈ నెల 6 నుంచి 14వ తేదీ వరకు నిర్వహిస్తున్న పాదయాత్రలను విజయవంతం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి వేనేపల్లి రవీందర్ పిలుపునిచ్చారు. శనివారం మండల పరిధిలోని గట్టు రాయిపాకులలో 'బద్రావు జారూరి.. మార్పు కావాలి' అనే కరపత్రాలు, వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై దేశవ్యాప్తంగా ప్రజల్లో వ్యతిరేకత



పెరుగుతోందన్నారు. గత దశాబ్ద కాలంగా అధికారంలో ఉన్న నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశం అభివృద్ధిలో ఎంతో పురోగతి సాధించిందని చెబుతున్నప్పటికీ, ప్రజల వాస్తవ జీవన పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని ఆరోపించారు. పెరుగుతున్న నిరుద్యోగం, ప్రజల ఆదాయాలు పెరగకపోవడం, నిత్యావసరాల ధరల భారంతో సామాన్యుల జీవనం ఇబ్బందికరంగా మారిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సంక్షోభం మరింత తీవ్రంగా ఉందని పేర్కొన్నారు.ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గట్టు రాయిపాకుల సీపీఐ కార్యదర్శి గౌడుగు విష్ణు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆగస్టు 10న జైల్ భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

**హయత్ నగర్, ఆగస్టు 7 (జనం సాక్షి) :** ఆగస్టు 10న క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో నిర్వహించనున్న జైల్ భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జిహెచ్ఎంసి ఎంప్లాయీస్ యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఆలేటి ఎల్లయ్య పిలుపునిచ్చారు. జిహెచ్ఎంసి ఎంప్లాయీస్ యూనియన్ రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కార్మికులకు జైల్ భరో



కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను కార్మికులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలేటి ఎల్లయ్య మాట్లాడుతూ, కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆగస్టు 10న రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని, విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని, 12 గంటల పని విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాడు బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా సాగిన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో నేడు కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 10న నిర్వహించే జైల్ భరో కార్యక్రమంలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్. జంగయ్య, కళావతి, యాదమ్మ, సురేష్, అనురాధ, సామ పద్మ, హేమలత, లక్ష్మి, పున్నమ్మ, అమృత, రాజేశ్వరి, పుల్లమ్మ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

# సేవ, వినయం, క్రమశిక్షణే నిజమైన నాయకత్వం

- **నేటి విద్యార్థులే రేపటి దేశ నిర్మాతలుగా ఎదగాలి**
- **డిఎస్పీ నర్సింగ్ యాదయ్య**

**తాండూరు, ఆగస్టు 7 (జనంసాక్షి) :** సేవ, వినయం, క్రమశిక్షణే నిజమైన నాయకత్వమని డిఎస్పీ నర్సింగ్ యాదయ్య పేర్కొన్నారు.తాండూర్‌లోని ప్రముఖ విద్యాసంస్థ కృష్ణవేణి కాన్సెప్ట్ స్కూల్లో 2026--2027 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఇన్వెస్టిచర్ వేడుకలు శుక్రవారం అత్యంత వైభవంగా జరిగాయి. నూతనంగా ఎన్నికైన విద్యార్థి నాయకులు అధికారికంగా బాధ్యతలు స్వీకరించి, నాయకత్వం, క్రమశిక్షణ, సేవాభావంతో ముందుకు సాగుతామని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమానికి డిఎస్పీ నర్సింగ్ యాదయ్య ముఖ్య అతిథిగా హాజరై వేడుకకు ప్రత్యేకతను చేకూర్చారు. పాఠశాల హెచ్.ఎం మరియు మేనేజింగ్ డైరెక్టర్ ప్రశాంత్, డైరెక్టర్లు సతీష్, శ్రీ వెంకటేశం, మల్లేశం కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులను ఆశీర్వదించారు.కార్యక్రమం దీప్రజ్వలన, జాతీయ గీతం, పాఠశాల మరియు హౌస్ పతాకాల ఆవిష్కరణతో ప్రారంభమైంది. ఈ ఏడాది స్కూల్ క్యాబినెట్‌గా హెడ్ బాయ్‌గా చరణ్ సాయి, డిప్యూటీగా సాకేత్, హెడ్ గర్ల్‌గా లక్ష్మీ ప్రసన్న, డిప్యూటీగా వర్ధిని ఎంపికయ్యారు. లిటరేచర్, కల్చరల్, డిసిప్లిన్, స్పోర్ట్స్ విభాగాలకు, అలాగే వివేకానంద, పటేల్, సుభాష్ చంద్రబోస్, భగత్ సింగ్ నాలుగు హౌస్‌లకు కూడా కెప్టెన్లు, వైస్ కెప్టెన్లను ప్రకటించారు.ఈ సందర్భంగా డిఎస్పీ నర్సింగ్ యాదయ్య ప్రమాణ స్వీకారం చేయించారు. పాఠశాల గౌరవాన్ని కాపాడుతూ నిజాయితీగా విధులు నిర్వర్తిస్తామని విద్యార్థులు ప్రమాణం చేశారు.హెచ్.ఎం ప్రశాంత్ మాట్లాడుతూ నిజమైన నాయకత్వం అంటే సేవ, వినయం, జట్టు స్ఫూర్తి అని తెలిపారు. డిఎస్పీ నర్సింగ్ యాదయ్య విద్యార్థులు మంచి విలువలతో సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు.ఈ సందర్భంగా స్పీడ్ ల్యాబ్ నిర్వహించిన ఐఐటి నెట్ ఈఓవై పరీక్షల్లో జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను సత్కరించారు. జి. స్పృథిక, ఎం. గీతిక త్రినయన జాతీయ 1వ ర్యాంకు, బి. ఆరోషి 2వ ర్యాంకు, కె. లక్ష్మీ ప్రసన్న 3వ ర్యాంకు




సాధించారు.ప్రాథమిక విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, అనంతరం నాలుగు హౌస్‌ల క్రమశిక్షణతో కూడిన కవాతు అందరినీ ఆకట్టుకున్నాయి. కవాతు అనంతరం హెడ్ బాయ్ చరణ్ సాయి, హెడ్ గర్ల్ లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడతామని, తోటి విద్యార్థులతో కలిసి పాఠశాలను మరింత ముందుకు తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, టీచర్లు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# చేనేత రంగం భారతీయ వారసత్వానికి ప్రతీక

**ముషీరాబాద్, ఆగస్టు 6 (జనం సాక్షి) :** భారతదేశ సంస్కృతి, సంప్రదాయం, కళా వైభవానికి చేనేత రంగం ప్రతీక అని, తరతరాలుగా వస్తున్న నైపుణ్యం, కృషి, సృజనాత్మకత భారతీయ వారసత్వాన్ని చేనేత రంగం సజీవంగా ప్రతిబింబిస్తోందని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ పేర్కొన్నారు. అలాయ్ బలాయ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మాజీ ఎంపీ రాపోలు ఆనంద భాస్కర్, ఎమ్మెల్సీ ఎల్. రమణ, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, అలాయ్ బలాయ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ బండారువిజయలక్ష్మి కలిసి ఈ సందర్భంగా చేనేత రంగానికి, సమాజానికి సేవలందించిన ప్రముఖులను శాలువాలతో సత్కరించి ప్రశంసపత్రాలు అందజేశారు. అనంతరం మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ1905 ఆగస్టు 7న ప్రారంభమైన స్వదేశీ ఉద్యమ స్ఫూర్తిని చిరస్థాయిగా నిలబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం 2015లో ఆగస్టు 7ను జాతీయ చేనేత దినోత్సవంగా ప్రకటించిందని గుర్తు చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో వోకల్



ఫర్ లోకల్ – లోకల్ ఫర్ గ్లోబల్ భావనతో చేనేత రంగ అభివృద్ధికి కేంద్రం విశేష ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గత ఐదేళ్లలో దేశవ్యాప్తంగా 356 చిన్న చేనేత క్లస్టర్లు, 2 మెగా క్లస్టర్లు ఏర్పాటు చేయడంతో పాటు, 5.34 లక్షల మంది చేనేత కార్మికులను సామాజిక భద్రతా పథకాల పరిధిలోకి తీసుకువచ్చామని వివరించారు. చేనేత ఉత్పత్తిని కొనుగోలు చేయడం అంటే ఒక వస్త్రాన్ని కొనడం మాత్రమే కాదు. ఒక చేనేత కుటుంబానికి ఉపాధి కల్పించడం, ఒక కళను సంరక్షించడం, భారతీయ వారసత్వాన్ని భావితరాలకు అందించడం" అని అన్నారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాల వినియోగాన్ని ప్రోత్సహించి, స్వదేశీ ఉత్పత్తులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తన చేయూత హామీలో చేనేత కార్మికులకు నెలకు రూ. 4,000 పెన్షన్ ఇస్తామని చెప్పిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచినందున ఈ హామీని అర్హులైన ప్రతి చేనేత కార్మికుడికి అమలు చేస్తున్నారా అనే దానిపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతంగా వినియోగించుకుని, తెలంగాణ చేనేత ఉత్పత్తులను స్థానిక మార్కెట్ల నుంచి జాతీయ, అంతర్జాతీయ మార్కెట్ల వరకు తీసుకెళ్లాలని సూచించారు. అలాయ్ బలాయ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ బండారువిజయలక్ష్మి మాట్లాడుతూ, చేనేత రంగాన్ని ప్రోత్సహించడం ఆయా రంగాల్లో గుర్తింపు పొందిన పద్మశాలి ప్రముఖులను గౌరవించుకోవడం తమ ఫౌండేషన్‌కు ఎంతో గర్వకారణమని తెలిపారు.ఈ కార్యక్రమంలో అలాయ్ బలాయ్ ఫౌండేషన్ సభ్యులు, పద్మశాలి సంక్షేమ సంఘాల నాయకులు చేనేత ప్రేమికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బోడుప్పల్-పోచారం అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



**బోడుప్పల్, ఆగస్టు 7 (జనంసాక్షి) :** బోడుప్పల్ సర్కిల్, పోచారం డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ అధికారులను కోరారు. శుక్రవారం జోనల్ కమిషనర్ రాధిక గుప్తా, ఈఈ రమేష్ బాబులను కలిసి ఆయా డివిజన్లలో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఆయన సమీక్ష నిర్వహించారు. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్లు, డ్రైనేజీలు, పారిశుధ్యం తదితర సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పెండింగ్‌లో ఉన్న పనులను ప్రాధాన్యత ఆధారంగా త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారుఅభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అజయ్ యాదవ్ సూచించారు.ఈ సమావేశంలో డివిజన్ అధ్యక్షులు బొమ్మకు కళ్యాణ్, కర్రె రాజేష్, తుంగతుర్తి రవి, నాగారం కాంగ్రెస్ నాయకులు జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
08 ఆగస్టు 2026

# చేనేత ఉత్పత్తులకు ప్రోత్సాహం

● జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 7 (జనం సాక్షి) :** చేనేత రంగ అభివృద్ధికి,నేత కార్మికులకు జిల్లా యంత్రాంగం అన్ని విధాలా సహకారం అందిస్తుందని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా శుక్రవారం కలెక్టర్ కార్యాలయం సమావేశంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. చేనేత వస్త్రం వెనుక చేనేత కార్మికుల శ్రమ, నైపుణ్యం, అంకితభావం దాగి ఉంటాయని, చేతితో నేసిన ప్రతి వస్త్రానికి ప్రత్యేకమైన గుర్తింపు ఉంటుందని కలెక్టర్ అన్నారు. యంత్రాలతో తయారయ్యే వస్త్రాలతో పోలిస్తే చేనేత ఉత్పత్తులకు కళాత్మకత, నాణ్యత, సంప్రదాయం ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన గద్వాల్, నారాయణపేట చేనేత ఉత్పత్తులు దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా చేనేత కార్మికులకు గరిష్ట ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. మహబూబ్‌నగర్ శిల్పారామంలో స్థానిక చేనేత ఉత్పత్తుల విక్రయానికి స్టాల్‌ల కేటాయింపు ప్రాధాన్యం కల్పించనున్నట్లు, ఆసక్తి ఉన్న చేనేత కార్మికులు హ్యాండ్లూమ్ అధికారుల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లా స్థాయి ప్రభుత్వ కార్యక్రమాల్లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాల కోసం ఉచితంగా స్టాళ్లు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. జిల్లాకు వచ్చే విశిష్ట అతిథులకు అందించే బహుమతులు, శాలువాలు స్థానిక చేనేత కార్మికుల నుంచే కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు



తెలిపారు. మధ్యవర్తులు లేకుండా నేరుగా చేనేత కార్మికుల నుంచి ఉత్పత్తులు కొనుగోలు చేసే విధానాన్ని ప్రోత్సహిస్తామని చెప్పారు. చేనేత కార్మికుల సమస్యలు, సూచనలు తెలుసుకునేందుకు ప్రత్యేక సమావేశాలు నిర్వహించడంతో పాటు అవసరమైతే గ్రామాల్లో పర్యటించి వారితో ప్రత్యక్షంగా మాట్లాడతామని కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు. ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ సాయి శివాని మాట్లాడుతూ చేనేత వస్త్రాలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, ప్రతి చేనేత వస్త్రం వెనుక కార్మికుల అపారమైన శ్రమ, నైపుణ్యం దాగి ఉంటుందని ఆమె అన్నారు. చేనేత కార్మికులు ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ నాణ్యమైన వస్త్రాలను తయారు చేస్తున్నారని, వారిని ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి వినియోగించడం ద్వారా కార్మికుల జీవనోపాధికి తోడ్పడటంతో పాటు మన వారసత్వాన్ని పరిరక్షించవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాల వినియోగాన్ని అలవాటు చేసుకుని చేనేత రంగ అభివృద్ధికి సహకరించాలని ఆమె పిలుపునిచ్చారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల 10 వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన పోటీలలో ప్రతిభ కనబరిచిన ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు జిల్లా కలెక్టర్ అందించారు. అలాగే జిల్లా నుండి గుర్తించిన ఉత్తమ చేనేత కార్మికులను జిల్లా కలెక్టర్ సన్మానించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాల స్టాళ్లను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సందర్శించి, చేనేత కార్మికులు తయారు చేసిన వస్త్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చీరాలు, ఇతర వస్త్రాల తయారుకు ఎంత ఖర్చు అవుతుంది, వాటిని ఎంత ధరకు అమ్ముతున్నారు అనే విషయాలను వారికి అడిగి తెలుసుకున్నారు. చేనేత కార్మికులు తయారు చేసిన నారాయణపేట, గద్వాల కాటన్ చీరలను జిల్లా కలెక్టర్ చూసి చాలా బాగున్నాయని అన్నారు. అనంతరం ఆమె కొన్ని చీరలను కొనుగోలు చేశారు. అలాగే జిల్లా అధికారులు, ఉద్యోగులు కూడా చేనేత వస్త్రాలను కొనాలని, చేనేత కార్మికులకు ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డి. ఆర్.ఓ ఎ. నిర్మలా, జిల్లా హ్యాండ్లూమ్ అభివృద్ధి అధికారి రాజేష్ , చేనేత సంఘాల నాయకులు, చేనేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.తొలుత జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కలెక్టర్ కార్యాలయం గేట్ నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు.

## మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అరెస్టు

● ఉర్కొండ పీఎస్‌కు తరలింపు



**ఉర్కొండ, ఆగస్టు 7 (జనం సాక్షి) :** అచ్చంపేట నియోజకవర్గం లింగాల మండలంలో జరుగుతున్న పండగ సాయన్న విగ్రహం తొలగింపుపై కుల సంఘాలు ముదిరాజు సంఘం నేతలు చేస్తున్న నిరసన కార్యక్రమానికి వెళుతుండగా అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే బీజేపీరాష్ట్ర నాయకులు గువ్వల బాలరాజు ను పోలీసులు కల్వకుర్తి నియోజకవర్గం కొట్ర గేటు వద్ద ముందస్తుగా అరెస్టు చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉందన్న కారణంతో పోలీసులు ముందస్తు అరెస్టుకు పాల్పడ్డారు. అరెస్టు అనంతరం ఆయనను ఉర్కొండ పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ విషయం తెలిసిన వెంటనే కల్వకుర్తి, జడ్చర్ల నియోజకవర్గానికి సంబంధించిన బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉర్కొండ పీఎస్ వద్దకు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా జరుగుతున్న ఆందోళనను అడ్డుకోవడం సరికాదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అచ్చంపేట నియోజకవర్గం లింగాల మండలంలో పండగ సాయన్న విగ్రహాన్ని అధికారులు తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ స్థానికులు ఆందోళనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మద్దతు తెలిపేందుకు వెళ్తున్న మాజీ ఎమ్మెల్యేను పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం రెండు గంటల తర్వాత వదిలిపెట్టారు.

## రామచంద్రపురంలో బోనాల ఏర్పాట్ల పరిశీలన



**రామచంద్రాపురం, ఆగస్టు 7 (జనం సాక్షి) :** రామచంద్రాపురం డివిజన్ పరిధిలో ఆదివారం జరగనున్న ఆషాఢమాస బోనాల పండుగ ఏర్పాట్లను మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ పరిశీలించారు. ఓల్డ్ రామచంద్రాపురంలోని శ్రీ పోచమ్మతల్లి ఆలయాన్ని సందర్శించి ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఆలయ పరిసరాలను సీఎంసీ సిబ్బందితో శుభ్రం చేయించారు. ఆలయం ముందు భాగంలో డస్ట్ వేయడంతో పాటు విద్యుత్ దీపాల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎంసీ శానిటేషన్ అధికారులకు పలు సూచనలు చేశారు. శ్రీనివాస్‌నగర్ కాలనీ, కసిరెడ్డిపల్లి, మల్లికార్జుననగర్, రామచంద్రారెడ్డినగర్, మయూరినగర్, కనుకుంట తదితర ప్రాంతాల్లోనూ బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్యం, విద్యుత్ దీపాలు, ఇతర మౌలిక సదుపాయాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

## శ్రీరంగాపూర్ మండలంలో వరి పంటల క్షేత్ర పరిశీలన



**శ్రీరంగాపూర్, ఆగస్టు 8 (జనం సాక్షి) :** శ్రీరంగాపూర్ మండలంలోని షేర్‌పల్లిమరియు కంబాలాపూర్ గ్రామాలలో నేరుగా విత్తే విధానంలో సాగు చేస్తున్న వరి పంట పొలాలను తెలంగాణ రైతువిజ్ఞానకేంద్రం(టీఆర్‌వీకే), వనపర్తిఆధ్వర్యంలో శుక్రవారం రోజున పరిశీలించారు.ఈ కార్యక్రమంలో భాగంగా రైతులకు నానో యూరియా మరియు నానో డీఏపీ వినియోగంపై అవగాహన కల్పించారు. క్షేత్రస్థాయిలో ప్రయోగాత్మక పరిశీలనలు నిర్వహించేందుకు నానో యూరియా, నానో డీఏపీని రైతులకు పంపిణీ చేశారు. పాల్గొన్న అధికారులుఎన్. నవత సమన్వయకర్త, తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, వనపర్తిఎం. హైమావతి - మండల వ్యవసాయ అధికారి, శ్రీరంగాపూర్ శివ క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి, శ్రీరంగాపూర్ రైతులు తదితరులు కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

## ఎల్‌నినో వేళ ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు అధిక ఆదాయం



**గోపాల్‌పేట, ఆగస్టు 7 (జనంసాక్షి) :** ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు వరికి బదులుగా ఆయిల్‌పామ్ వంటి అధిక ఆదాయాన్ని అందించే ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. గోపాల్‌పేట మండలం తాడిపర్తి గ్రామానికి చెందిన రైతు భాను పొలంలో జిల్లా ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆయిల్‌పామ్ మొక్కల నాటే కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మొక్క నాటి నీరు పోశారు. అనంతరం రైతుతో మాట్లాడి సాగు విస్తీర్ణం, నీటి వసతి, ఇతర ఏర్పాట్లపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో సుధీర్‌రెడ్డి, డీహెచ్‌ఎస్‌వో విజయ్ భాస్కర్, తహసీల్దార్, ఎంపీడీవో, సర్పంచ్ లోకారెడ్డి, ఉపసర్పంచ్ రామచంద్రయ్య, డీసీయూ మాజీ చైర్మన్ గొల్ల చంద్రయ్య, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## పంట కుంటల నిర్మాణానికి రైతులను ప్రోత్సహించాలి

● అదనపు కలెక్టర్ నర్సింగరావు

**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 7 (జనం సాక్షి) :** వర్షాలు తక్కువగా కురుస్తున్నందున ఉన్న జలాలను నిలువ చేసుకునేందుకు రైతులు పంట కుంటలను నిర్మించుకునేలా సంబంధిత అధికారులు ప్రోత్సహించాలని అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. వానాకాలంలో పంటల సాగు,స్మార్ట్ రేషన్ కార్డులు,కొత్త పెన్షన్లు తదితర అంశాలపై శుక్రవారం హైదరాబాద్ నుంచి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు,ఉత్తమ్ కుమార్ రెడ్డి,జూపల్లి కృష్ణారావు,ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ లో సమీక్షించారు. రాష్ట్రంలోనీ పలు ప్రాజెక్టులకు ప్రస్తుతం వరద నీరు వస్తున్నప్పటికీ ఆయా రిజర్వాయర్లలో నీటి లభ్యతను ఆధారంగా చేసుకొని రైతులు వేయాల్సిన పంటలపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కాలువలు కింద రైతులు వరి సాగు చేస్తే వరద నీరు తగ్గినప్పుడు పంటలు చేతికి వచ్చేవరకు సాగునీటి విడుదల కష్టమవుతుందన్నారు. దీనినీ దృష్టిలో ఉంచుకొని ఈనెల 8న ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డులు సమావేశాలు నిర్వహించుకొని నిర్ణయాలు తీసుకోవాల్సి ఉందన్నారు. భూగర్భ జలాల పరిస్థితి, విద్యుత్ సరఫరాపై అంచనాలతో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయ సమావేశాలు నిర్వహించి ముందుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చే వేసవి వరకు తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని,ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురుస్తున్నందున రైతులు



ఆరుతడి పంటలు సాగు చేసేలా సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు సూచించాలన్నారు. పంటల వైవిధ్యంతోనే రైతులు ఆర్థిక పురోగతి సాధిస్తారని పేర్కొన్నారు. వన మహోత్సవంలో భాగంగా లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. ఆగస్టు 15 నుంచి స్మార్ట్ రేషన్ కార్డులు అందజేసేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. అర్హులైన వారందరికీ కొత్తగా పెన్షన్లు ఇచ్చేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అన్ని జిల్లాల అధికారులను ఆదేశించారు. గద్వాల ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీసీ లో పాల్గొన్న అదనపు కలెక్టర్ నర్సింగరావు వీసీ అనంతరం జిల్లా అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రాజ్ కుమార్, డిఆర్డిఓ ముషాహిదా బేగం, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రాజ్ కుమార్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కార్మికులను ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకోవాలి



**పెద్ద శంకరంపేట, ఆగస్టు 7 (జనం సాక్షి) :** ప్రభుత్వం చేనేత కార్మికులను అన్ని రకాలుగా ఆదుకోవాలని రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షులు వల్లకాటి రాజకుమార్ అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకొని పెద్ద శంకరంపేటలో చేనేత కార్మికులు పట్టణ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. మండల పద్మశాలి సంఘం అధ్యక్షులు గుజ్జరి కనక రాజు అధ్యక్షతన మార్కండేయ మందిరంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చేనేత వృత్తిమీద ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న చేనేత కార్మికులందరికీ ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రోత్సాహం అందజేయాలని అన్నారు. రాష్ట్రంలో నేతన్న ల ఆకలి చావులు లేకుండా ప్రభుత్వం భరోసా కల్పించాలన్నారు పద్మశాలి కార్పొరేషన్ ద్వారా చేనేత వృత్తుల వారితోపాటు పద్మశాలీలలో ఇతర వృత్తులు చేసుకుంటున్నవారికి సైతం ఆర్థిక సహాయం అందజేయాలని ప్రభుత్వానికి విన్నవించామన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చేనేత కార్మికులకు జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకొని ప్రతి ఒక్క చేనేత కార్మికుడికి 25వేల రూపాయలు దాదాపు 71 వేల 1903 మందికి అందించారని అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలో సైతం ప్రతి ఒక్క చేనేత కార్మికుడికి ఆర్థిక సాయం అందజేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.. చేనేత కార్మికులు పద్మశాలీ లు ఆర్థికంగా రాజకీయంగా సామాజికంగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు మేకల జయరాములు. పెద్ద శంకరంపేట మండల పద్మశాలి సంఘం అధ్యక్షులు గుజ్జరి కనకరాజు. చేనేత సహకార సంఘం అధ్యక్షులు మహంకాళి కృష్ణమూర్తి. పట్టణ అధ్యక్షులు జంగం రాములు గుజ్జరి సంగమేశ్వర్. అనిల్ డాక్టర్. ఉపేందర్ జంగం రాఘవులు. సిహెచ్ నవీన్ . సంతోష్ కుమార్ .. దస్వంత్ నీలకంటి విట్టల్. కోట రమేష్. పడాల రవి. ఆయా గ్రామాల నుండి చేనేత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## చేనేత కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలి

● అదనపు కలెక్టర్ పాండు



**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 7 (జనం సాక్షి) :** చేనేత రంగాన్ని ప్రోత్సహించడంతో పాటు చేనేత కార్మికుల కళానైపుణ్యానికి తగిన గుర్తింపు కల్పించి, వారి సంక్షేమానికి కృషి చేయాలని అదనపు కలెక్టర్ పాండు పేర్కొన్నారుజాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం సంగారెడ్డి ప్రభుత్వ ఐటీఐ కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించిన హ్యాండ్లూమ్ వాక్ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆదనపు కలెక్టర్ పాండు మాట్లాడుతూ... చేనేత రంగం భారత సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తోందని, తరతరాలుగా ఈ వృత్తిని కొనసాగిస్తూ అద్భుతమైన వస్త్రాలను తయారు చేస్తున్న చేనేత కార్మికుల కృషిని ప్రతి ఒక్కరూ గుర్తించి గౌరవించాలని అన్నారు.ప్రజలు చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి వినియోగించడం ద్వారా చేనేత కార్మికులకు తమ వంతు సహకారం అందించాలని ఆయన కోరారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ, ప్రోత్సాహక పథకాలపై చేనేత కార్మికులకు విస్తృత అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరూ వాటిని సద్వినియోగం చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో హ్యాండ్లూమ్ శాఖ సహాయ సంచాలకులు వెంకట్రావు, జిల్లా అధికారులు, సిబ్బంది, చేనేత కార్మికులు, యువత, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి



**మక్తల్, ఆగస్టు 7 (జనంసాక్షి) :** ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని యుఎస్ పిసి నాయకుల డిమాండ్ చేశారు. శుక్రవారం ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ పిలుపు మేరకు మంతన్ గోడ్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ?ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న డీఏ లను విడుదల చేయాలని, పీఆర్‌సీ నివేదికను తెప్పించుకుని 51 శాతం ఫిట్‌మెంట్‌తో నూతన వేతన సవరణను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీ మేరకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. అలాగే విద్యా రంగానికి బడ్జెట్‌లో 15 శాతం నిధులు కేటాయించి, పాఠశాలల్లో ఎదురవుతున్న వివిధ సమస్యలను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకపోతే రాబోయే రోజుల్లో దశలవారీగా పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో నాయకులు సూర్యచంద్ర, అశోక్, శ్రీనివాసరావు, లక్ష్మినరసింహచారి, సునంద, శ్రీకాంత్, మమత, మంజుల తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య, విద్య, సేవలే ప్రభుత్వ లక్ష్యం

● మంత్రి దామోదర్ రాజనర్సింహ

**సంగారెడ్డిబ్యూరో, ఆగస్టు 7 (జనం సాక్షి) :** ప్రజలకు మెరుగైన వైద్య, విద్య సేవలే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి మంత్రి వివిధ శాఖల పనితీరు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. వైద్య, విద్య, సాగునీరు, తాగునీరు, వ్యవసాయం, రెవెన్యూ, మహిళా శిశు సంక్షేమ శాఖల పనితీరును శాఖల వారీగా సమీక్షించారు. జోగిపేట ఏరియా ఆసుపత్రిలో డ్యూటీ డాక్టర్ స్థానంలో నకిలీ వ్యక్తి విధులు నిర్వహించిన ఘటనపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, ఆసుపత్రుల్లో వైద్యుల హాజరు, విధుల నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని అధికారులను ఆదేశించారు. కంకోల్, సింగితం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని, బర్దిపూర్, సుల్తాన్‌పూర్, నేరడిగుంట పీహెచ్‌సీ భవన నిర్మాణాలను వేగవంతం చేయాలని మంత్రి సూచించారు. డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి




సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు, వైద్య పరికరాలు, మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సంగారెడ్డి నర్సింగ్ కళాశాల, పటాన్‌చెరు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, జహీరాబాద్ ఎంసీహెచ్‌ను త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రిలో అవసరమైన పరికరాలు, మందులు అందుబాటులో ఉండాలని నిరంతరం పర్యవేక్షించాలని జిజిహెచ్ సూపరింటెండెంట్‌కు సూచించారు. విద్యా రంగంలో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సూచించారు.కేజీబీవీ లు, మోడల్ స్కూళ్లపై ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని మంత్రి ఆదేశించారు. పిహెచ్‌సిలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, కె జి బి విలు,మోడల్ స్కూళ్లు, జడ్ పి హెచ్ ఎస్ లలో త్రాగునీరు, డ్రైనేజీ, మరుగుదొడ్ల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన పనులను పూర్తి చేయాలని మంత్రి కలెక్టర్‌కు సూచించారు. కొత్త రేషన్ కార్డుల జారీ అంశంపై మంత్రి సమీక్షస్తూ,ఈ నెల 15న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంగారెడ్డి జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో, కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి సంబంధించి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు, సబ్ కలెక్టర్ ఉమా హారతి, సంబంధిత శాఖల అధికారులు,రెవెన్యూ డివిజనల్ అధికారులు, పాల్గొన్నారు.

# 15 నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

- హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవి



**హనుమకొండ ప్రతినిధి ఆగస్టు 7 (జనం సాక్షి) :** జిల్లాలో ఈ నెల 15వ తేదీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ప్రారంభం కానుందని హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవి తెలిపారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయానికి చేరుకున్న స్మార్ట్ రేషన్ కార్డులను ఇన్‌చార్జి కలెక్టర్ పరిశీలించారు. అనంతరం జిల్లాలో కార్డుల పంపిణీకి చేపట్టాల్సిన ఏర్పాట్లపై పౌరసరఫరాల శాఖ అధికారులతో సమీక్షించారు. జిల్లాలోని 14 మండలాలకు మొత్తం 2,56,838 స్మార్ట్ రేషన్ కార్డులు అందినట్లు అధికారులు తెలిపారు. మండలాల వారీగా ఆత్మకూరు 11,641, భీమదేవరపల్లి 15,783, దామెర 9,264, ధర్మసాగర్ 17,069, ఎల్కతుర్తి 14,055, హనుమకొండ 44,283, హసన్‌పర్తి 26,220, ఐనవోలు 15,389, కమలాపూర్ 22,095, కాజీపేట 30,959, నడికూడ 11,658, పరకాల 14,714, శాయంపేట 14,884, వేలేరు 8,824 కార్డులు వచ్చినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ రవి మాట్లాడుతూ, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి ముందస్తు ప్రణాళికతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రేషన్ షాపు పరిధిలోని లబ్ధిదారులకు కార్డులు సులభంగా, పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పంపిణీ ప్రక్రియను సమన్వయం చేసేందుకు ప్రతి మండలానికి నోడల్ అధికారులను నియమించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మహేందర్, పౌరసరఫరాల శాఖ డీటీలు, సిబ్బంది పాల్గొన్నారు.

# 16న ములుగు జిల్లాకు సీఎం రాక

- అభివృద్ధి పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలి
- రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న పంచాయతీ రాజ్ హామ్ రోడ్ల పనులకు ఇక్కడి నుండే శ్రీకారం.
- నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవం
- మంత్రి దనసరి అనసూయ సీతక్క




**ములుగు ప్రతినిధి, ఆగష్టు 07(జనంసాక్షి) :** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఈ నెల 16న ములుగు జిల్లాలో పర్యటించనున్నారని, రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న పంచాయతీ రాజ్ హామ్ రోడ్ల పనుల కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఇక్కడి నుండే శ్రీకారం చుట్టనున్నారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అన్నారు. జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రానున్న సందర్భంగా మంత్రి సీతక్క శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవురావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనా లతో కలిసి అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ముఖ్యమంత్రి హైదరాబాదు నుండి నేరుగా మేడారం చేరుకొని వన దేవతలను దర్శించుకొని, అనంతరం ములుగు చేరుకొని పైలాన్ ప్రారంభించడమే కాకుండా ములుగు మండలం ఇంచర్ల గ్రామ శివారులో ఏడు కోట్ల రూపాయలతో నిర్మించిన ఇందిరమ్మ మహిళా శక్తి భవనాన్ని వర్చువల్, నూతన కలెక్టరేట్ సముదాయ భవనాన్ని ప్రారంభిస్తారని వెల్లడించారు. జిల్లా లో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్న అభివృద్ధి పనుల వివరాల జాబితాను అన్ని శాఖల అధికారులు ఈ నెల 10వ తేదీ వరకు సిద్ధం చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన పూర్తి షెడ్యూల్ ఈ నెల 12న వెల్లడించడం జరుగుతుందని తెలిపారు. సీఎం పర్యటన సందర్భంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని అన్నారు. మేడారం పరిసర ప్రాంతాల్లో రహదారులు ఆక్రమించిన వ్యాపారాలు చేస్తున్న వారికి జరిమానా విధించాలని, వ్యాపారాలు ఏర్పాటు చేయకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు మహేందర్ జి, సంపత్ రావు, జిల్లా గ్రంధాలయ చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ రఘు, రాష్ట్ర పంచాయతీరాజ్ డైరెక్టర్ భగవాన్ రెడ్డి, ఆర్డీఓ కృష్ణవేణి, డిఆర్ఓ రవికుమార్, ఎస్ డి సి ప్రతాప్, డిప్యూటీ ట్రేని కలెక్టర్ కుషిల్ వంశీ, అన్ని శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన శాఖ డిప్యూటీ డైరెక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

- కేజీబీవీ గూడూరు ఫిర్యాదుల విచారణను నిష్పాక్షిక అధికారికి అప్పగించాలి..
- ఎన్‌టీవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ రామన్న నాయక్ డిమాండ్..



**మహబూబాబాద్ ప్రతినిధి, ఆగస్టు 7 (జనం సాక్షి):** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని దామరవంచ గిరిజన గురుకులం (బాలుర)లో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న, గతంలో కేజీబీవీ గూడూరులో హిందీ సీఆర్‌టిగా పనిచేసిన శ్రీమతి వనజపై వచ్చిన ఆరోపణలు, అవకతవకలకు సంబంధించి గతంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించినట్లు ఎన్‌టీవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ రామన్న నాయక్ తెలిపారు. ఆ ఫిర్యాదుపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జి. దేశీరాం 16-06-2026న కేజీబీవీ గూడూరులో విచారణ నిర్వహించి సంబంధిత రికార్డులను పరిశీలిస్తామని అధికారిక ఉత్తర్వులు జారీ చేసి, సంబంధిత అధికారులతో పాటు ఫిర్యాదుదారునికీ సమాచారం అందజేశారని పేర్కొన్నారు. అయితే, ప్రకటించిన తేదీన విచారణకు హాజరు కాకపోవడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న అధికారి జిల్లా కలెక్టర్ ఆదేశాలను, తాను జారీ చేసిన అధికారిక ఉత్తర్వులను సైతం అమలు చేయకపోవడం వల్ల విచారణ ఆలస్యమవుతోందని ఆయన అన్నారు. దీంతో సంబంధిత రికార్డుల్లో మార్పులు (ట్యాంపరింగ్) జరిగే అవకాశం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకుని తమ ఆదేశాలను అమలు చేయని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జి. దేశీరాం పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, అలాగే కేజీబీవీ గూడూరు ఫిర్యాదుల విచారణను నిష్పాక్షికమైన ఉన్నతాధికారికి అప్పగించి త్వరితగతిన పూర్తి చేయాలని బానోత్ రామన్న నాయక్ డిమాండ్ చేశారు. ప్రజా ప్రయోజనాలు, పారదర్శక పరిపాలన, బాధ్యతాయుతమైన పాలన దృష్ట్యా ఈ అంశంపై జిల్లా యంత్రాంగం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# తహసీల్దార్ కార్యాలయాల్లో కంప్యూటర్ ఆపరేటర్లను తొలగించడం సరికాదు

- 20 ఏళ్లుగా కార్యాలయాల్లో సేవలు చేస్తున్నాం
- సూపర్ న్యూమరీ పోస్టులు ఇచ్చి సర్దుబాటు చేయాలి
- కంప్యూటర్ ఆపరేటర్స్ అసోసియేషన్ ములుగు జిల్లా అధ్యక్షులు రమేష్



**వెంకటాపూర్ (రామప్ప), ఆగస్టు 07(జనం సాక్షి):** తహసీల్దార్ కార్యాలయాల్లో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లను తొలగించడం సరైంది కాదని కంప్యూటర్ ఆపరేటర్స్ అసోసియేషన్ ములుగు జిల్లా అధ్యక్షులు భూపెల్లి రమేష్ అన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మండల కేంద్రంలోని తాళ్లపాడు సెంటర్లో విలేకరులతో మాట్లాడారు. గత 20 ఏళ్లుగా తహసీల్దార్ కార్యాలయాల్లో చాలిచాలని జీతంతో కంప్యూటర్ ఆపరేటర్లుగా పనిచేస్తూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి కంప్యూటర్ ఆపరేటర్లను తొలగించాలని మెమోలు జారీ చేయడం బాధాకరమని అన్నారు. కార్యాలయాల్లో సర్టిఫికెట్లతో పాటు ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ప్రతి పనిని కంప్యూటర్ ఆపరేటర్లే చేశారని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం తాత్కాలిక ఉద్యోగులను పర్మనెంట్ చేయకపోవడంతో పాటు తొలగించడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. గత కొన్ని నెలలుగా చేసిన పనికి సైతం జీతాలు రాలేదని, అప్పులు చేసి మరి కుటుంబాలను పోషించుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. రెవిన్యూ శాఖలో సుమారు 5వేలకు పైగా ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, వీఆర్ఏలకు అవకాశం ఇచ్చిన విధంగా తమ 20 ఏళ్ల సేవలను దృష్టిలో ఉంచుకొని సూపర్ న్యూమరి పోస్టులు ఇచ్చి కంప్యూటర్ ఆపరేటర్లను సర్దుబాటు చేయాలని ఆయన కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం, రెవెన్యూ శాఖ అధికారులు స్పందించి కంప్యూటర్ ఆపరేటర్లకు న్యాయం జరిగే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు.

# పాముకాటుతో మహిళ మృతి



**గుడిహత్నూర్, ఆగస్టు 7 (జనం సాక్షి) .** గుడిహత్నూర్ మం డలంలోని తోషశీ ఇంక్కగూడ గ్రామానికి చెందిన ముడిమడుగుల రాజ్యలక్ష్మి పాము కాటుతో మృతి చెంది నట్లు ఎస్సై ఎల్.శ్రీకాంత్ తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం గురువారం ఇంట్లో శుభ్రం చేస్తుండగా పాము కాటు వేసిందని, పాము కుట్టిన విషయాన్ని తన భర్తకు తెలపడంతో ఇంటి పక్కనే నివసించే తన బావమరిది మహేష్ కు చెప్పగా అతని కారులో చికిత్స నిమిత్తం అదిలాబాదుకు చికిత్స నిమిత్తం తీసుకొచ్చారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందిందని తెలిపారు. ఈ విషయమై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# చనిపోయిన వ్యక్తికే వెంటిలేటర్ చికిత్స?

- హాస్పిటల్‌లో బంధువుల ఆందోళన
- బిల్లుల కోసం ప్రైవేట్ ఆస్పత్రి వేధింపులని కుటుంబం ఆరోపణ
- హనుమకొండ డిఎంహెచ్‌వో అప్పయ్యకు సమాచారం ఇచ్చిన కూడా స్పందించని తీరు



**హనుమకొండ / నెక్కొండ ఆగస్టు 6 (జనం సాక్షి):** నెక్కొండ మండల కేంద్రంలోని హనుమకొండ విజయ టాకీస్ సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నెక్కొండ మండలం బుల్లికొండ గ్రామానికి చెందిన పంజాల శ్రీధర్ (32)కు సంబంధించి కుటుంబ సభ్యులు తీవ్ర ఆరోపణలు చేశారు. బ్రెయిన్ సర్జరీ అనంతరం రెండు రోజులుగా ఎలాంటి స్పందన లేకపోయినా వెంటిలేటర్‌పై ఉంచి బిల్లులు పెంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుడిని తొలుత మరో ప్రైవేట్ ఆస్పత్రికి, అనంతరం మెరుగైన వైద్యం పేరుతో ఈ ఆస్పత్రికి తరలించారని తెలిపారు. రోగి పరిస్థితిపై స్పష్టమైన సమాచారం ఇవ్వకుండా భారీ బిల్లులు వేస్తున్నారని, ఆరోగ్యశ్రీ ప్రక్రియలో ఉన్నప్పటికీ రూ.70 వేల వరకు వసూలు చేశారని ఆరోపించారు. బిల్లులు చెల్లిస్తేనే మృతదేహాన్ని అప్పగిస్తామని ఆస్పత్రి యాజ మాన్యం ఒత్తిడి తెస్తోందని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. రోగి అప్పటికే బ్రెయిన్ డెత్‌కు గురయ్యాడని, కేవలం వెంటిలేటర్‌పై ఉంచి బిల్లులు పెంచుతున్నారనే అనుమానం వ్యక్తం చేశారు. ఘటనపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, పోలీసులు వెంటనే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు, స్థానికులు డిమాండ్ చేశారు.

## తల్లితండ్రులు మందలించడంతో

# కుమారుడు ఆత్మహత్య

**నెక్కొండ ఆ గస్టు 6 (జనం సాక్షి):** నెక్కొండ మండల కేంద్రం లోని బత్తుల సాయి రాం తండ్రి ఎల్ల స్వామి(19) సు మారుగా 6 సంవత్సరాల క్రితం 10 వ తరగతి ఫెయిల్ అయి ఏ విధమైన పని చేయకుండా జులాయిగా తిరుగుతూ సెల్ ఫోన్ చూస్తూ కాలక్షేపం చేస్తుండగా అతని తల్లిదండ్రులు ఎప్పుడు సెల్ ఫోన్ చూడకుండా, ఏదైనా పని చేసుకొమ్మని చెప్పగా అతడు ఇంట్లో నుండి గురువారం రోజు సాయంత్రం 6 గంటలకు వెళ్ళినాడు, శుక్రవారం ఉదయం6.30 గంటలకు మృతుని తండ్రి ఎల్ల స్వామి వారి నిర్మాణంలో ఉన్న ఇంటికి నీళ్లు కొట్టుటకు వెళ్లగా నిర్మాణంలోని పిల్లరులకు అడ్డంగా ఇనుప రాడ్ వేసి దానికి చీరతో ఉరివేసుకొని చనిపోయి ఉన్నాడు. తండ్రి ఎల్ల స్వామి నెక్కొండ పోలీస్ ల కు తెలియజేశారు.

## అడవిముత్తారం పోలీసుల చాకచక్యంతో

# దొంగల ముఠా అరెస్ట్

- చోరీ సొత్తు స్వాధీనం



**మహా ముత్తారం ఆగస్టు7 (జనం సాక్షి) :** పోలీసులు చాకచక్యంతో దొంగల ముఠా పట్టుకొని అరెస్టు చేశారు. శుక్రవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా (అడవిముత్తారం) మహా ముత్తారం పోలీస్ స్టేషన్ పరిధిలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా, యామన్‌పల్లి గ్రామంలోని తెలంగాణ వైన్స్‌లో చోరీ చేసినట్లు, అలాగే ఒక హీరో స్ప్లెండర్ మోటార్ సైకిల్‌ను దొంగిలించినట్లు నేరాన్ని అంగీకరించారు. నిందితుల వద్ద నుండి 05 ఖఫీ లైట్ బీర్ బాటిళ్లు, 25 రాయల్ స్టాగ్ క్వార్టర్ బాటిళ్లు, నగదు రూ.5,000/- చోరీకి వినియోగించిన స్విఫ్ట్ కారు, రెండు స్మార్ట్ ఫోన్లు మరియు హీరో స్ప్లెండర్ మోటార్ సైకిల్ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో నిందితులను అరెస్ట్ చేసి, స్వాధీనం చేసుకున్న వస్తువులతో పాటు కోర్టు ముందు హాజరుపరచేందుకు తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు అడవిముత్తారం ఎస్సై జి.రమేష్ తెలిపారు.

# విద్యుద్ఘాతంతో మహిళ మృతి



**పర్వతగిరి, ఆగస్టు 7: (జనం సాక్షి) :** పర్వతగిరి మండలం, తురకల సోమవారం గ్రామంలో శుక్రవారం విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన షేక్ సలీమా (సుమారు 35) శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంటి వద్ద విద్యుత్ హీటర్‌ను తొలగిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురైనట్లు సమాచారం. కుటుంబ సభ్యులు, స్థానికులు వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా, అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు తెలిసింది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# తప్పుడు జనన ధృవీకరణ పత్రం జారీ

- పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్
- కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత




**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 07(జనంసాక్షి ):** జిల్లాలోని సిర్పూర్ (టి) మండలం సిర్పూర్ (టి) గ్రామపంచాయతీలో తప్పుడు జనన ధృవీకరణ పత్రం జారీ చేసినట్లు నిర్ధారణ కావడంతో పంచాయితీ కార్యదర్శి సస్పెండ్ చేస్తూ కంప్యూటర్ ఆపరేటర్ ను విధుల నుండి తొలగించడం జరిగిందని జిల్లా కలెక్టర్ కె.హరిత ఒక ప్రకటనలో తెలిపారు. విచారణలో జనన మరణాల నమోదు చట్టం, 1969 నిబంధనలను ఉల్లంఘిస్తూ గ్రామపంచాయతీ కార్యదర్శి షైనీ తిరుపతి విధి నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించినట్లు నిర్ధారణ అయిందని, విచారణ నివేదిక ప్రకారం, సంబంధిత వ్యక్తి పొన్నం శ్రీనిధి కి సంబంధించిన జనన తేదీ రిజిస్టర్‌లో నమోదు లేకపోవడం, దరఖాస్తు స్వీకరించకపోవడం, అవసరమైన ఎటువంటి ఆధార పత్రాలను పరిశీలించకపోవడం జరిగినప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా నేరుగా యూనిఫైడ్ బర్త్ అండ్ డెత్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి జనన ధృవీకరణ పత్రాన్ని జారీ చేసినట్లు విచారణలో తేలిందని వివరించారు. విధి నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం, అధికార దుర్వినియోగం, ప్రభుత్వ నిబంధనల ఉల్లంఘనకు పాల్పడిన పంచాయతీ కార్యదర్శి షైనీ తిరుపతిని తక్షణమే సస్పెండ్ చేస్తూ, తదుపరి శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించడం జరిగిందని తెలిపారు. తప్పుడు నమోదు ప్రక్రియలో బాధ్యత వహించిన కంప్యూటర్ ఆపరేటర్ నీలేష్‌ను విధుల నుండి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం, నిబంధనల ఉల్లంఘన, తప్పుడు ధృవీకరణ పత్రాల జారీ వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, గ్రామపంచాయతీలలో ప్రజలకు అందించే సేవలు పూర్తిగా పారదర్శకంగా, చట్టబద్ధంగా ఉండాలని, ప్రతి దరఖాస్తును సంబంధిత ఆధారాలు, రికార్డులను సమగ్రంగా పరిశీలించిన అనంతరమే పరిష్కరించాలని తెలిపారు.

# ఆపరేషన్ ఛబుత్ర పకడ్బందీగా అమలు

- నేరాలు,దొంగతనాల అదుపునకు ప్రత్యేకంగా చర్యలు
- 134 మంది యువకులకు కౌన్సిలింగ్, తల్లిదండ్రులకు అప్పగింత
- 20 పత్రాలు లేని వాహనాలు స్వాధీనం
- ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి



**మావల ఆగస్ట్ 08 ( జనం సాక్షి):** అర్ధరాత్రి జిల్లా వ్యాప్తంగా పట్టణాలలో అనవసరంగా, అకారణంగా తిరిగే వారిపై చట్టపకారం చర్యలు తీసుకోబడతాయని అదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి తెలిపారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు కఠిన చర్యలు తీసుకోబడతాయని పేర్కొన్నారు .ఆదిలాబాద్ పట్టణంలో గత రాత్రి లిఆపరేషన్ ఛబుత్రలి నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలో రాత్రి 12 గంటల తర్వాత నిర్వహించిన ఆకస్మికంగా తనిఖీలలో యువత ప్రజలు పెద్ద ఎత్తున అకారణంగా అనవసరంగా సంచరిస్తున్న 134 మందిని గుర్తించమని అన్నారు. వారిని ఆదిలాబాద్ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ కు తరలించి కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగిందని తెలిపారు. తదుపరి యువతను వారి తల్లిదండ్రులకు అప్పగించడం జరిగింది అని అన్నారు. నిరంతరం ఆదిలాబాద్ పట్టణంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం జరుగుతుంది . పదేపదే సంచరిస్తున్న వారు పట్టుబడితే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. అకారణంగా ఎవరైనా రోడ్లపై మరియు గద్దె లపై, హోటళ్ల ముందు భాగంలో, ప్రధాన కూడళ్ల వద్ద, వీధులలో అనవసరంగా కూర్చోకుండా ఉండాలని సూచించారు. ఆదిలాబాద్ పట్టణ వ్యాపార సమూహాలు 10:30 గంటలకు మూసి వేయబడతాయని, తదుపరి 11 గంటల వరకు ఇళ్లకు చేరుకావాలని సూచించారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అర్ధరాత్రి పట్టణంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రశాంత వాతావరణము కలగజేయడానికి మరియు నేరాలను నియంత్రణకు యువత ఎలాంటి గొడవలకు దారి తీయకుండా ప్రమాదాల నివారణకు దోహదపడుతుందని తెలియజేశారు. నేర రహిత సమాజ నిర్మాణానికి మరియు ఆదిలాబాద్ పట్టణంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు చోటు చేసుకోకుండా ఉండేందుకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇదేవిధంగా అర్ధరాత్రి ప్రత్యేకంగా డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు, గంజాయి టెస్టులు నిర్వహించడం జరుగుతుందని యువత సన్మార్గంలో ఉండాలని చెడు వ్యసనాలకు బానిస కాకుండా మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితులలో తప్ప అకారణంగా తిరిగినట్లయితే కేసులు నమోదయితాయని హెచ్చరించారు. ప్రజలు శాంతిభద్రతల కోసం రాత్రి సమయాలలో అనవసరంగా తిరిగితే చర్యలు తప్పవు. ఆదిలాబాద్ పట్టణ సీఐలు డి సునీల్ కుమార్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు టి మురళి, ఎన్ చంద్రశేఖర్, ఎస్సైలు నాగనాథ్, అశోక్, ఆర్ఎస్ఐ లు గోపి కృష్ణ, మనీష్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ ఆపరేషన్ లో ఆదిలాబాద్ పట్టణ సీఐలు డి సునీల్ కుమార్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు టి మురళి, ఎన్ చంద్రశేఖర్, ఎస్సైలు నాగనాథ్, అశోక్, ఆర్ఎస్ఐ లు గోపి కృష్ణ, మనీష్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
08 ఆగస్టు 2026

## మునుగోడులో నేతన్నల సమస్యల పరిష్కారానికి కృషి



**చండూరు, ఆగస్టు 7 (జనంసాక్షి) :** చేనేత వృత్తిని కాపాడటంతో పాటు నేతన్నల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నిర్వహించిన చేనేత కళాకారుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చేనేత కార్మికుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. చేనేత వృత్తి, నేతన్నలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. నేతన్నల పిల్లలు, రుణాలు, జీఎస్టీ, ట్యాగింగ్ తదితర సమస్యలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి సీఎం దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. చేనేతను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, నేతన్నలకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాజగోపాల్‌రెడ్డి తెలిపారు.

## ఉన్నత విద్యతో బంగారు భవిష్యత్

- జనగాం ఎమ్మెల్యే వీజేఐటి చైర్మన్ డాక్టర్ పళ్ళ రాజేశ్వర్ రెడ్డి
- ఘనంగా ఓరియంటేషన్ డే




**మొయినాబాద్, ఆగస్టు 7 (జనం సాక్షి) :** ఉన్నత విద్యతో విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉందని విద్యార్థులు క్రమశిక్షణతో నాలుగు సంవత్సరాలు ఇష్టంతో చదివితే మీ జీవితాలు చక్కబడతాయని జనగాం ఎమ్మెల్యే కళాశాల చైర్మన్ పళ్ళ రాజేశ్వర్ రెడ్డి. టిసిఎస్ ట్రాన్స్ ఫర్మేషన్ కోచ్ లింక్ 6 సిగ్మా కన్సల్టెంట్ డాక్టర్ ప్రసాద్ చిట్టి మల్ల లు అన్నారు రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం లోని అజిత్ నగర్ చౌరస్తాలో గల విద్య ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంజనీరింగ్ లో చేరిన విద్యార్థులకు ఓరియంటేషన్ అంటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పళ్ళ రాజేశ్వర్ రెడ్డి తో పాటు టి సి ఎస్ ట్రాన్స్ పర్మిషన్ కోచ్ డాక్టర్ ప్రసాద్ చీటీమల్ల.. ట్రీ లాజి ఇన్నోవేషన్ సీనియర్ హెచ్ఆర్ స్పెషలిస్ట్ అర్చనగైలు పాల్గొని ఓరియంటేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు అనంతరం వారు మాట్లాడుతూ ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని సూచించారు నాలుగు సంవత్సరాల పాటు ఉన్నత విద్యలో క్రమశిక్షణతో ఏ రోజుకు ఆ రోజు విద్యుత్ తో పాటు ప్రాక్టికల్స్ నిర్వహించినప్పుడే ఉన్నతముగా ఉత్తీర్ణులై వివిధ కంపెనీలలో మంచి ఉద్యోగ అవకాశాలు సంపాదించుకుంటారని తెలిపారు ముఖ్యంగా కళాశాలలో విద్యార్థులకు కావాల్సిన మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యను బోధించడం జరుగుతుందని రాజేశ్వర్ రెడ్డి తెలిపారు విద్యార్థులకు మా వంతు కృషి ఉన్నప్పటికీని తల్లిదండ్రులు కూడా ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాల్సిన బాధ్యత మీ పైన ఉంటుందని అన్నారు భావిస్తూ వీరి భవిష్యత్తు కోసం నాణ్యమైన విద్యను అందించేందుకు మంచి ఫ్యాకల్టీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు విద్యార్థులు అటెండెన్స్ విషయంలో తప్పనిసరిగా కళాశాలకు రావాల్సిందేనని పేర్కొన్నారు. దేశంలో పలు మంచి కంపెనీలలో ఉద్యోగాలు సంపాదిస్తున్నారంటే అది మన తెలంగాణ ప్రజలు అని చెప్పుకోవచ్చునని తెలిపారు ఐఐటి ఉత్తర వాటిలో తెలంగాణ విద్యార్థుల ముందున్నారని పేర్కొన్నారు. ఇంజనీరింగ్ విద్య అభ్యసించే విద్యార్థులకు మంచి భవిష్యత్తు లభిస్తుందని తల్లిదండ్రులను గౌరవిస్తూ కళాశాలలో చెప్పిన వాటిని సక్రమంగా నేర్చుకుంటే మీకే మంచి భవిష్యత్తు ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ జి శ్రీలత కళాశాలడ్డీ డాక్టర్ ప్లేస్మెంట్ డైరెక్టర్ వెంకట చలం ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ అధికారి శిఖ కౌశల్ సైన్సెస్ విభాగ అధిపతి డాక్టర్ కె లక్ష్మీనారాయణ ప్రసాద్ విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## భూభారతి సాదాబైనామా దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- ప్రజావాణి అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి
- తహసిల్దార్లతో సమీక్షలో కలెక్టర్ భవేష్ మిశ్రా
- ఆలస్యంగా హాజరైన తహసిల్దార్లకు షోకాజ్ నోటీసులు

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 7 (జనం సాక్షి) :** భూభారతి, సాదాబైనామా పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రధాన సమీక్ష మందిరంలో శుక్రవారం ఆయన అన్ని మండలాల తహసిల్దార్లతో భూభారతి, సాదాబైనామా పెండింగ్ దరఖాస్తులు, ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారం, ఇతర రెవెన్యూ అంశాలపై సమీక్ష జరిపారు. ఒక్కో మండలం వారీగా పెండింగ్ లో ఉన్న దరఖాస్తులు ఎన్ని అని ఆరా తీస్తూ, వాటి పరిష్కారంలో జాప్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ దరఖాస్తులను సమగ్రంగా పరిశీలన జరుపుతూ ఈ నెలాఖరులోగా అన్నింటిని పరిష్కరించాలని కలెక్టర్ గడువు విధించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చొరవ చూపాలన్నారు. దరఖాస్తుల ధ్రువీకరణ ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం పాటించాలని, ప్రాధాన్యత క్రమంలో దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. కస్టం మిల్లింగ్ కోసం లేవీ ధాన్యం కేటాయించిన రైస్ మిల్లులను ప్రతి పక్షం రోజులకు ఒకసారి అయిన తప్పనిసరిగా సందర్శిస్తూ, ధాన్యం నిల్వలను పరిశీలించాలని తహసిల్దార్లను ఆదేశించారు. నూతన తహసిల్దార్ కార్యాలయాల నిర్మాణాల కోసం ఆయా మండలాలలో అవసరమైన స్థలాలను గుర్తిస్తూ, సమగ్ర వివరాలతో నివేదికలు పంపాలని సూచించారు.

### ఆలస్యంగా హాజరైన తహసిల్దార్లకు షోకాజ్ నోటీసులు జారీ

ఇదిలా ఉండగా, సమీక్షా సమావేశానికి ఆలస్యంగా హాజరైన తహసిల్దార్లకు కలెక్టర్ భవేష్ మిశ్రా షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నిర్ణీత సమయానికి కలెక్టర్ సమావేశ మందిరానికి చేరుకోగా, పలు మండలాల తహసిల్దార్లు గైర్హాజరు కావడాన్ని గమనించి వారి తీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్ణీత



సమయం అనంతరం మరో 15 నిమిషాల వరకు కూడా సమావేశం హాల్ కు చేరుకోలేకపోయిన తహసిల్దర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ప్రతి ఒక్కరు విధిగా సమయ పాలన పాటించాలని కలెక్టర్ సూచించారు. సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, జిల్లా రెవెన్యూ అధికారి గీత, నిజామాబాద్, బోధన్ ఆర్డీఓలు రాజేంద్రకుమార్, విజయకుమారి, ఆయా మండలాల తహసిల్దార్లు పాల్గొన్నారు.

## గిరిజన గురుకుల కళాశాలలో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

- ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స
- ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్న వైద్యులు

**భద్రాచలం, ఆగస్టు 6 (జనంసాక్షి) :** భద్రాచలం చర్ల రోడ్డులోని గిరిజన గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. సమాచారం ప్రకారం, ఉదయం విద్యార్థినిని చూసేందుకు ఆమె తండ్రి కళాశాలకు వచ్చారు. ఈ సందర్భంగా తాను కళాశాలలో ఉండలేనని, ఇంటికి తీసుకెళ్లాలని విద్యార్థిని తండ్రిని కోరినట్లు తెలిసింది. అయితే చదువు దృష్ట్యా కళాశాలలోనే కొనసాగాలని తండ్రి సూచించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో మనస్తాపానికి గురైన విద్యార్థిని కొద్దిసేపటికే టాబ్లెట్లు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు సమాచారం. విషయాన్ని గమనించిన తోటి విద్యార్థులు కళాశాల యాజమాన్యానికి తెలియజేయగా, ప్రిన్సిపాల్ వెంటనే స్పందించి విద్యార్థినిని భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ఆమెకు చికిత్స అందిస్తుండగా, ప్రస్తుతం విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలిపారు. ఘటనపై ఐటీడీఏ గురుకులాల రీజినల్ కో–ఆర్డినేటర్ (ఆర్‌సీఓ) అరుణకుమారి ఆసుపత్రికి చేరుకుని పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు సమాచారం. ఘటనకు దారితీసిన పరిస్థితులపై కళాశాల యాజమాన్యం ఆరా తీస్తోంది. అయితే, ఈ ఘటన నేపథ్యంలో పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కళాశాలలో ఉండనని విద్యార్థిని ఎందుకు పట్టుబట్టింది? ఆమెను అంతగా మనస్తాపానికి గురిచేసిన కారణాలు ఏమిటి? అలాగే ఆత్మహత్యాయత్నానికి ఉపయోగించినట్లు చెబుతున్న టాబ్లెట్లు విద్యార్థిని వద్దకు ఎలా చేరాయి? అవి ఎక్కడి నుంచి వచ్చాయి? అనే అంశాలపై పలువురు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ నిర్వహించి వాస్తవాలను వెలికితీయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు కోరుతున్నారు.

## నేతన్నలకు చేతినిండా పని కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

- ఇందిరా మహిళా శక్తి చీరలతో ఉపాధి
- త్రిఫ్ట్, బీమా పథకాలతో కార్మిక కుటుంబాలకు భరోసా
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- రాజన్న సిరిసిల్లలో జాతీయ చేనేత దినోత్సవ ర్యాలీ




**సిరిసిల్ల టౌన్, ఆగస్టు 7 (జనం సాక్షి) :** నేతన్నలకు చేతినిండా పని కల్పించి, వారి ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కోర్టు నుంచి పాత బస్ స్టాండ్ వద్ద ఉన్న నేతన్న విగ్రహం వరకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ జెండా ఊపి ర్యాలీని ప్రారంబించి.. ప్రభుత్వ విప్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, చేనేత, వస్త్ర పరిశ్రమ కార్మికులతో కలిసి భారీ ర్యాలీ తీశారు. పాత బస్ స్టాండ్ వద్ద ఉన్న నేతన్న విగ్రహానికి ప్రభుత్వ విప్, జిల్లా కలెక్టర్ తదితరులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సిరిసిల్ల చేనేత, వస్త్ర పరిశ్రమకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలిపారు. సిరిసిల్లలోని నేతన్నలు, కార్మికులు, ఆసాములు, యజమానులకు సంవత్సరంలో సుమారు ఎనిమిది నెలల పాటు పని కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. గత సంవత్సరం 6 కోట్ల 70 లక్షలకు పైగా మీటర్ల ఇందిరా మహిళా శక్తి చీరల ఉత్పత్తికి ఆర్డర్లు ఇచ్చినట్లు తెలిపారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 4 కోట్ల 50 లక్షల మీటర్ల ఇందిరా మహిళా శక్తి చీరల ఆర్డర్ ఇచ్చామని తెలిపారు. త్వరలో మరో కోటి 50 లక్షలకు పైగా మీటర్లకు ఆర్డర్లు ఇచ్చే అవకాశం ఉందని తెలిపారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫాంలు, ఇతర అవసరాలకు సంబంధించిన వస్త్రాల ఉత్పత్తి ద్వారా కూడా స్థానిక నేతన్నలకు పని కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, సంగీతం శ్రీనివాస్, సూర దేవరాజు, ఆర్డీఓ శ్రీధర్ బాబు, హ్యాండ్లూమ్ అండ్ టెక్స్టైల్స్ ఏడీ సంతోష్, తహసీల్దార్ మహేష్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, చేనేత, వస్త్ర పరిశ్రమ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలి

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 7 (జనం సాక్షి) :** పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్య సంరక్షణ కోసం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ వినూత్న ప్రాజెక్టులను రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం గర్గుల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా సైన్స్ అధికారి ఎం. సిద్ధిరామ్ రెడ్డి ఆధ్వర్యంలో 'ఎకో సెన్స్ ప్రాజెక్ట్' నమూనాపై ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. జిల్లాలోని పీఎం శ్రీ పాఠశాలలు, ఉన్నత పాఠశాలల అటల్ టింకరింగ్ ల్యాబ్‌లకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పక్షుల రియల్‌టైమ్ పర్యవేక్షణ, వాటి ధ్వనుల ఆధారంగా గుర్తింపు, పక్షులు కనిపించిన సమయాన్ని నమోదు చేయడం, నిర్దిష్ట ప్రాంతాల్లో వాటి సంచారాన్ని పర్యవేక్షించడం వంటి అంశాలపై శిక్షణ అందించారు. రాస్ప్‌బెర్రీ పై సాంకేతికతను ఉపయోగించి పక్షుల ధ్వనులను గుర్తించడం, వాటికి సంబంధించిన సమాచారాన్ని సేకరించడం, డేటాను నమోదు చేసి విశ్లేషించడం వంటి అంశాలను ప్రాక్టికల్‌గా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులు పర్యావరణ పరిరక్షణతో పాటు సమాజానికి ఉపయోగపడే వినూత్న ప్రాజెక్టుల రూపకల్పనపై దృష్టి పెట్టాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సృజనాత్మకంగా వినియోగించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు సమర్థవంతమైన పరిష్కారాలను అభివృద్ధి చేయవచ్చన్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో జీవవైవిధ్యం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించాలని సూచించారు. జిల్లాలోని అన్ని అటల్ టింకరింగ్ ల్యాబ్ పాఠశాలల్లో 'ఎకో సెన్స్' తరహా నమూనాలను ఏర్పాటు చేసి, విద్యార్థులను పర్యావరణహిత సాంకేతిక ప్రాజెక్టుల వైపు ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి మల్లికార్జున్, మండల విద్యాధికారి ఎల్లయ్య, జిల్లా సైన్స్ అధికారి ఎం. సిద్ధిరామ్ రెడ్డి, అటల్ టింకరింగ్ ల్యాబ్ ఇన్‌చార్జి బాలగంగాధర్, సోహం రోబోటిక్స్ ప్రతినిధులు, వివిధ పాఠశాలల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూల్స్‌ను విధిగా సందర్శించాలి



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 7 (జనం సాక్షి) :** ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూల్స్ ను క్రమం తప్పకుండా సందర్శించాలని మండల ప్రత్యేక అధికారులను కలెక్టర్ భవేష్ మిశ్రా దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా విద్యా సంస్థల నిర్వహణ గణనీయంగా మెరుగుపడేలా, నాణ్యమైన విద్యా బోధన జరిగేలా మండల స్పెషల్ ఆఫీసర్లు క్రియాశీలక పాత్ర పోషించాలని అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో శుక్రవారం మండల ప్రత్యేక అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. మండల స్థాయి అధికారులను సమన్వయము చేసుకుని ప్రతి వారం – – ప్రతి విద్యా సంస్థను తప్పనిసరిగా సందర్శించేలా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. సంక్షేమ వసతి గృహాలతో పాటు, జిల్లాలో గల అన్ని కేజీబీవీలు, ఆశ్రమ పాఠశాలలు, మహాత్మా జ్యోతిబాపూలే, బీ.సీ, ఎస్.సీ, మైనారిటీ రెసిడెన్షియల్ విద్యా సంస్థలను విధిగా సందర్శించి నిర్వహణ తీరుతెన్నులను నిశితంగా పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడ కూడా ఫుడ్ పాయిజనింగ్, పాముకాటు, తేలు కాటు వంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తుగానే అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. విద్యా సంస్థలను సందర్శించిన సందర్భంగా గమనించిన అంశాలను ఎప్పటికప్పుడు ప్రత్యేక యాప్ ద్వారా తమకు నివేదించాలని కలెక్టర్ సూచించారు. ఎక్కడైనా డ్రైనేజీ సమస్య నెలకొని ఉంటే తక్షణమే పరిష్కరించాలని, సానిటేషన్ సమస్య నెలకొనకుండా చొరవ చూపాలన్నారు. శిథిలావస్థకు చేరిన పురాతన భవనాలు ఉంటే, ప్రమాదాలకు ఆస్కారం లేకుండా వెంటనే వాటిని తొలగింపజేయాలని ఆదేశించారు. విద్యార్థిని, విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాన్ని మెరుగుపర్చేందుకు వీలుగా చేపట్టిన ఎఫ్.ఎల్.ఎన్ విధానం ప్రతి విద్యా సంస్థలోనూ పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. కాగా, జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ రూపొందించేందుకు జిల్లాలోని అన్ని మండలాల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, చారిత్రక ప్రదేశాల సమాచారాన్ని క్షేత్రస్థాయి అధికారులు పక్కాగా అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, జెడ్పీ సీ.ఈ.ఓ సాయాగౌడ్, మండల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

## ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా అభివృద్ధి చేస్తాం

- ఏదులాపురం మున్సిపాలిటీ అభివృద్ధికి ముఖ్యమంత్రి రూ.100 కోట్ల నిధులు మంజూరు
- ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌళిక వసతుల కల్పనకు క్షేత్రస్థాయిలో పర్యటన
- త్రాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ.
- రాష్ట్ర రెవిన్యూ,గృహ నిర్మాణ సమాచారా పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి



**ఖమ్మం రూరల్, ఆగస్టు 7 (జనం సాక్షి) :** ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 22, 23వ వార్డులైన సాయిగణేష్ నగర్, సత్యనారాయణపురం, ఇందిరమ్మ కాలనీలలో జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకర్‌తో కలిసి కాలినడకన కాలనీల్లో తిరుగుతూ మంత్రివర్యులు అభివృద్ధి పనులు, పారిశుధ్య పరిస్థితులు, ప్రజా మౌళిక వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీలను విలీనం చేసి ఏర్పాటు చేసిన ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రంలోనే మోడల్ మున్సిపాలిటీగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏదులాపురం మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధి కోసం రూ.100 కోట్ల నిధులు మంజూరు చేశారని చెప్పారు. ప్రజలకు అవసరమైన మౌళిక వసతులను గుర్తించి, వాటిని ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేసేందుకే క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నామని పేర్కొన్నారు. లోతట్టు ప్రాంతాల్లో తుమ్మ చెట్లు పెరగడం, రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉండడం వంటి సమస్యలు తమ దృష్టికి వచ్చాయని, వాటి శాశ్వత పరిష్కారం కోసం అవసరమైన డ్రైనేజీ నిర్మాణంతో పాటు ఇతర మౌళిక సదుపాయాల కల్పనకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో త్రాగునీటి సమస్య ఉందని స్థానికులు తమ దృష్టికి తీసుకువచ్చారని, దానిని త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. విద్యుత్ తీగలకు సంబంధించిన సమస్యలను కూడా సంబంధిత శాఖల సమన్వయంతో పరిష్కరిస్తామని తెలిపారు. కొంతమంది ఇందిరమ్మ ఇళ్లు, ఇంటి స్థలాల కోసం వినతులు అందజేశారని, వాటిని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలో పార్కుల అభివృద్ధి పనులు ఇప్పటికే ప్రారంభం అయ్యాయని, ఈ నెలాఖరులోగా వాటిని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని, అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రతి పనిని నిర్ణీత గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. సాయిగణేష్ నగర్ లో రోడ్డు వెంట ఉన్న టీ స్టాల్ లో కూర్చుని టీ త్రాగి అనంతరం ఇందిరమ్మ కాలనీలో పర్యటించారు. వర్షం పడుతున్న కాలి నడకన గొడుగు చేత పట్టుకుని తిరిగి పరిసరాలను పరిశీలిస్తూ కాలనీవాసులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, ఏదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ పోక బత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, ఆర్ అండ్ బి ఎస్ఈ యుగంధర్, పంచాయతీ రాజ్ ఎస్.ఈ. వెంకట్ రెడ్డి, ఏదులాపురం మునిసిపల్ కమీషనర్ శ్రీనివాస్, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాస చారి, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, ఆర్డీఓ శ్రీనివాస్, సంబంధిత అధికారులు,స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

## దీపక్ చౌదరి చొరవతో తొలగిన ట్రాఫిక్ అంతరాయం

- మామిళ్లగూడెలో రోడ్డుపై కూలిన భారీ చెట్టు..
- వెంటనే రంగంలోకి దిగిన డీఆర్ఎఫ్



**ఖమ్మం, ఆగస్టు 7 (జనంసాక్షి) :** ఖమ్మం నగరంలోని 45వ డివిజన్ మామిళ్లగూడెం, ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ సమీపంలో శుక్రవారం కురిసిన భారీ వర్షాలకు ఓ భారీ చెట్టు విరిగి ప్రధాన రహదారిపై పడింది. దీంతో ఆ మార్గంలో వాహనాల రాకపోకలు నిలిచిపోయి ప్రయాణికులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న కాంగ్రెస్ పార్టీ ఖమ్మం నగర అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ నాగండ్ల దీపక్ చౌదరి వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య తీవ్రతను వివరించారు. ఆయన చొరవతో డీఆర్‌ఎఫ్ బృందం, డివిజన్ జవాన్లు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని విరిగిపడిన చెట్టును ముక్కలుగా కోసి రహదారి నుంచి తొలగించారు. అనంతరం రోడ్డును పూర్తిగా శుభ్రం చేసి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. వర్షాల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడకుండా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను కోరిన నాగండ్ల దీపక్ చౌదరి, సమస్య పరిష్కారమయ్యే వరకు అక్కడే ఉండి సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఆయన చొరవతో వేగంగా స్పందించిన డీఆర్‌ఎఫ్ సిబ్బంది, డివిజన్ జవాన్లను స్థానికులు అభినందించారు.




యూపీఐపై ఎండీఆర్ పడితే.. ఛార్జీ చెల్లించేది వ్యాపారే అయినా, దాని మోత వినియోగదారుడి జేబుకే తగలనుందా? నేరుగా యూపీఐ చెల్లింపుపై రుసుము వసూలు చేయకపోయినా.. వ్యాపారులపై పెరిగే లావాదేవీ వ్యయం వస్తువుల ధరలు పెంచడం, కన్వీనియన్స్ ఫీజులు జోడించడం వంటి మార్గాల్లో చివరకు కస్టమర్ బిల్లులోకి చేరే అవకాశం ఉంది. ప్రస్తుతం యూపీఐ చెల్లింపులు ఉచితంగానే ఉన్నప్పటికీ.. ఎండీఆర్ రేటు ఎంత? ఎవరికి వర్తిస్తుంది? చిన్న లావాదేవీలకు మినహాయింపు ఉంటుందా? అన్నదానిపైనే సామాన్యుడిపై పడే భారం ఆధారపడి ఉంటుంది. 'వ్యాపారిదే ఛార్జీ.. కస్టమర్‌దే భారం'గా మారకుండా ఎలాంటి నిబంధనలు వస్తాయన్నదే ఇప్పుడు కీలకంగా మారింది.


# యూపీఐపై ఎండీఆర్.. జేబుకు షాక్?

## ఛార్జీ వ్యాపారిదే.. భారం మాత్రం కస్టమర్‌పైనేనా?

- ధరల పెంపు, కన్వీనియన్స్ ఫీజుతో మోత మోగేనా?
- చిన్న లావాదేవీలకు మినహాయింపుపై ఆశలు
- ఎండీఆర్ రేటు.. అమలు విధానంపైనే అసలు భారం

**మార్జిన్‌లోనే భరించే అవకాశమూ ఉంది.**

**చిన్న వ్యాపారులపై ప్రభావం ఎంత? అనేదీ కీలకమే. కిరాణా దుకాణాలు, చిన్న హోటళ్లు, చిరు వ్యాపారుల వద్ద జరిగే తక్కువ విలువ లావాదేవీలకు మినహాయింపులు ఇస్తే సామాన్యుడిపై ప్రభావం పరిమితమవుతుంది. పెద్ద వ్యాపార సంస్థలు, అధిక విలువ లావాదేవీలకే ఎండీఆర్‌ను పరిమితం చేస్తే యూపీఐ వినియోగానికి పెద్దగా ఆటంకం ఉండకపోవచ్చు. అదే సమయంలో రుసుము అధికంగా నిర్ణయిస్తే తక్కువ మార్జిన్‌తో పనిచేసే వ్యాపారులపై ఒత్తిడి పెరిగి, ఆ భారం వినియోగదారుడికి బదిలీ అయ్యే ప్రమాదం ఉంటుంది.**




**న్యూఢిల్లీ, ఆగస్టు 7 (జనంసాక్షి) :** యూపీఐ చెల్లింపులపై ఎండీఆర్ విధిస్తే.. రుసుము నేరుగా వినియోగదారుడి ఖాతా నుంచి కట్ కాకపోయినా, దాని ప్రభావం చివరకు కస్టమర్ జేబుపై పడే అవకాశమే ఇప్పుడు ప్రధాన చర్చగా మారింది. వ్యాపారులపై విధించే ఈ రుసుమును వారు తమ లాభాల్లో భరిస్తారా? లేక వస్తువుల ధరలు పెంచి, కన్వీనియన్స్ లేదా పేమెంట్ ప్రాసెసింగ్ ఫీజుల రూపంలో వినియోగదారుడికి బదిలీ చేస్తారా? అన్నదే కీలక ప్రశ్నగా మారింది.

ఒక వినియోగదారు రూ.1,000 విలువైన వస్తువును యూపీఐ ద్వారా కొనుగోలు చేశాడనుకుందాం. ఆ లావాదేవీపై వ్యాపారికి స్వల్ప ఎండీఆర్ భారం పడితే ఒక్క లావాదేవీకి అది పెద్ద మొత్తంగా కనిపించకపోవచ్చు. కానీ రోజుకు వందలు, వేల లావాదేవీలు నిర్వహించే పెద్ద సంస్థలకు ఏడాదిలో ఈ వ్యయం గణనీయంగా మారుతుంది. దీంతో వ్యాపారులు తమ మార్జిన్‌ను తగ్గించుకోవడం కంటే ధరలను స్వల్పంగా పెంచే మార్గాన్ని ఎంచుకుంటే.. యూపీఐకి నేరుగా ఛార్జీ లేకున్నా వినియోగదారుడి బిల్లు పెరిగే అవకాశం ఉంటుంది.

ఈ ప్రభావం ముఖ్యంగా ఈ-కామర్స్, ఆన్‌లైన్ బుకింగ్, ఫుడ్ డెలివరీ, డిజిటల్ సేవల రంగాల్లో కనిపించే అవకాశం ఉంది. 'కన్వీనియన్స్ ఫీజు', 'పేమెంట్ ప్రాసెసింగ్ ఫీజు' వంటి పేర్లతో అదనపు రుసుములు విధిస్తే కస్టమర్‌కు యూపీఐ చెల్లింపు ఉచితంగానే ఉన్నప్పటికీ.. మొత్తం చెల్లింపు మాత్రం పెరుగుతుంది. అయితే పోటీ ఎక్కువగా ఉన్న రంగాల్లో ధరలు పెంచితే కస్టమర్లు ప్రత్యామ్నాయ విక్రేతల వైపు వెళ్లే అవకాశం ఉండటంతో వ్యాపారులు ఎండీఆర్ భారాన్ని కొంతమేర తమ యూపీఐపై ఛార్జీలు అమల్లోకి వస్తే కొంతమంది వ్యాపారులు నగదు చెల్లింపులను ప్రోత్సహించే అవకాశమూ ఉంది. అయితే యూపీఐ వేగం, సౌలభ్యం, లావాదేవీల రికార్డు వంటి ప్రయోజనాల కారణంగా వినియోగదారులు పూర్తిగా నగదు వైపు మళ్లే అవకాశం తక్కువేనని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. అసలు ప్రభావం మాత్రం ఎండీఆర్ ఎంత? ఎవరి నుంచి వసూలు చేస్తారు? ఏ లావాదేవీలకు వర్తిస్తుంది? అనే అంశాలు స్పష్టమైన తర్వాతే తెలుస్తుంది.

ప్రస్తుతం యూపీఐ చెల్లింపులు ఉచితమే. ఎండీఆర్‌కు చట్టపరమైన మార్గం ఏర్పడినంత మాత్రాన వెంటనే వినియోగదారులపై ఛార్జీ పడదు. తుది విధానం, రుసుము శాతం, మినహాయింపులు వంటి అంశాలపై నిర్ణయాలు రావాల్సి ఉంది. అయితే భవిష్యత్తులో యూపీఐపై ఎండీఆర్ అమలైతే 'ఛార్జీ వ్యాపారిదే.. భారం కస్టమర్‌దేనా?' అన్న ప్రశ్నకు సమాధానం ధరల కదలికల్లో కనిపించే అవకాశం ఉంది. అందుకే చిన్న వ్యాపారులు, చిన్న లావాదేవీలకు రక్షణ కల్పిస్తూ.. ఎండీఆర్ భారాన్ని వినియోగదారుడిపై పరోక్షంగా మోపకుండా స్పష్టమైన నియంత్రణలు అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

> ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం.. ఎండీఆర్ విధించినా పెద్ద వ్యాపార సంస్థలు, ఈ-కామర్స్ వేదికలు వంటి అధిక విలువ లావాదేవీలు నిర్వహించే సంస్థలకే పరిమితం చేసే అవకాశం ఉంది. చిన్న వ్యాపారులు, తక్కువ విలువ కలిగిన లావాదేవీలను మినహాయించే అవకాశాలున్నాయి. ఎండీఆర్ రేటు ఎంత ఉండాలన్న దానిపై కూడా ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. పరిశ్రమ వర్గాల్లో 0.04 శాతం నుంచి 0.3-0.4 శాతం వరకు రుసుము ఉండొచ్చనే అంచనాలు వినిపిస్తున్నప్పటికీ.. అధికారికంగా ఎలాంటి రేటును ఖరారు చేయలేదు.

> **యూపీఐని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు 2020 జనవరి నుంచి జీరో ఎండీఆర్ విధానం అమల్లో ఉంది. అంటే యూపీఐ ద్వారా చెల్లింపు జరిగినప్పుడు ఆ లావాదేవీని నిర్వహించే బ్యాంకులు, పేమెంట్ సంస్థలకు వ్యాపారుల నుంచి ఎలాంటి మర్చంట్ ఫీజు వసూలు చేయడం లేదు. ఇప్పటివరకు యూపీఐ, రూపే డెబిట్ కార్డు లావాదేవీలపై ఎండీఆర్ వసూలును ఆదాయపు పన్ను చట్టం ద్వారా నిషేధించారు. తాజా సవరణతో ఆ నిషేధానికి తెరపడింది. అయితే చట్ట సవరణ జరిగిందంటే వెంటనే యూపీఐపై ఛార్జీలు అమల్లోకి వస్తాయని కాదు. పార్లమెంటరీ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఎన్‌పీసీఐ ఆధ్వర్యంలోని యూపీఐ అండ్ సర్వీసెస్ స్టీరింగ్ కమిటీ ఎండీఆర్ విధానంపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.**

గూగుల్ మ్యాప్స్‌కు కొత్త రూపు..

# 'ఆస్క్ మ్యాప్స్'తో ఫుడ్ ఆర్డర్

- హోటల్ సెర్చ్, టికెట్ బుకింగ్ సదుపాయం
- జీమెయిల్‌తో అనుసంధానం.. ప్రయాణ సూచనలు
- భారత్‌లో హిందీలోనూ అందుబాటు

**న్యూఢిల్లీ, ఆగస్టు 7 (జనంసాక్షి) :** గూగుల్ మ్యాప్స్ కొత్త రూపు సంతరించుకుంటోంది. ఎప్పటికప్పుడు కొత్త ఫీచర్లు జోడించుకుంటూ వినియోగదారులకు మరింత చేరువవుతోంది. కేవలం దారి చూపించే సాధనంగానే కాకుండా ఇకపై ఫుడ్ ఆర్డర్, హోటల్ సెర్చ్ వంటివీ చేయొచ్చు. 'ఆస్క్ మ్యాప్స్' పేరిట ఈ మేరకు కొన్ని సదుపాయాలను జోడించినట్లు గూగుల్ తన బ్లాగ్ పోస్ట్‌లో పేర్కొంది. ఏదైనా కొత్త ప్రదేశానికి వెళ్లినప్పుడు అక్కడ ఏదైనా తినాలనిపిస్తే వేరేగా రెస్టారెంట్ల కోసం వెతికే పని లేకుండా ఆస్క్ మ్యాప్స్‌లోనే ఈ సదుపాయం పొందొచ్చు. మీకు కావాల్సిన రెస్టారెంట్లను వెతకడం, కావాల్సిన వంటకాలను నేరుగా కార్ట్‌కు యాడ్ చేయడం వంటివి చేయొచ్చు. ఇదే తరహాలో హోటళ్లు వెతకడం, కాన్సర్టులు, కామెడీ షోలకు టికెట్ బుకింగ్‌కు సంబంధించిన లింకులూ పొందొచ్చు. మీ జీమెయిల్‌లో ఉన్న ప్రయాణ వివరాలను (ఫ్లైట్ టికెట్లు, హోటల్ బుకింగ్‌లు) అనుసంధానించుకుని, దానికి తగిన విధంగా ప్రయాణ సూచనలు పొందొచ్చు. గూగుల్ మ్యాప్స్ ఇకపై మీ పాత సంభాషణలనూ గుర్తుంచుకుంటుంది. కాబట్టి ప్రయాణ ప్లానింగ్‌ను గతంలో ఎక్కడ ఆపారో అక్కడి నుంచే కొనసాగించవచ్చు. బస్సులు, మెట్రో, రైళ్లు, ఫెర్రీల వివరాలను లైవ్‌లో తెలుసుకునే సౌకర్యమూ తీసుకొచ్చారు. భారత్‌లో ఇంగ్లిష్‌లోనే కాకుండా హిందీలోనూ ఆస్క్ మ్యాప్స్ ప్రశ్నలు అడిగి హోటళ్లు, రెస్టారెంట్లు, పర్యాటక ప్రాంతాల వివరాలు తెలుసుకోవచ్చు. భారత్, అమెరికా సహా 150కి పైగా దేశాల్లో ఈ సదుపాయాలను రోల్ అవుట్ చేసింది. ఫుడ్ ఆర్డర్, ఈవెంట్ సెర్చ్ ఫీచర్లు ప్రస్తుతానికి అమెరికాలో అందుబాటులోకి వచ్చాయి. దశలవారీగా ఇతర దేశాల్లోనూ తేవున్నారు.

| నెక్ గుడ్ల ధరలు | ఫామ్‌గేట్ | డజన్ |
|---|---|---|
| హైదరాబాద్ | ₹ 530 | ₹ 63.60 |
| వరంగల్ | ₹ 532 | ₹63.84 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**

| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు |
|---|---|---|
| హైదరాబాద్ | ₹1,43,990 | ₹1,31,990 |
| చెన్నై | ₹1,44,000 | ₹1,35,974 |

**వెండి ధరలు (కేజీ)** హైదరాబాద్ ₹ 2,24,900

# డాబర్‌కు ఢిల్లీ హైకోర్టు ఊరట

- ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ నిషేధంపై స్టే
- '100% స్వచ్ఛత' ప్రకటనలపై వివాదం
- విచారణ లేకుండా ఆదేశాలు సరికాదని కోర్టు
- తేనె, నెయ్యి, నూనెల అమ్మకాలకు అనుమతి
- రెండు వారాలకు విచారణ వాయిదా




**ఢిల్లీ, ఆగస్టు 7 (జనంసాక్షి) :** ప్రముఖ ఎఫ్‌ఎంసీజీ కంపెనీ డాబర్ ఇండియాకు ఢిల్లీ హైకోర్టులో ఊరట లభించింది. వంద శాతం స్వచ్ఛత పేరుతో తేనె, ఆవు నెయ్యి, నూనెలు వంటివి విక్రయించొద్దంటూ ఆహార నియంత్రణ సంస్థ ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ జారీ చేసిన నిషేధాజ్ఞలపై హైకోర్టు స్టే విధించింది. విచారణకు అవకాశం లేకుండా నిషేధం విధించడం సరికాదని అభిప్రాయపడింది. తదుపరి విచారణ తేదీ వరకు స్టే ఉత్తర్వులు కొనసాగుతాయని స్పష్టం చేసింది. ఈ కేసు తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. తమ ఉత్పత్తులు 100 శాతం స్వచ్ఛమైనవని, ప్రకృతిసిద్ధంగా సమీకరించినవి, స్వచ్ఛతకు హామీ, రసాయన రహితమైనవి అన్న ప్రచారంతో తేనె, ఆవు నెయ్యి, వంటనూనెలు, యాపిల్ సైడర్ వెనిగర్, కొబ్బరి నూనె, కొబ్బరి నీళ్లు, కొబ్బరి పాలు వంటివి విక్రయించొద్దని డాబర్ ఇండియాను ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ ఇటీవల ఆదేశించింది. ఈ ప్రకటనలు వినియోగదారులను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని తెలిపింది. దీనిపై డాబర్ ఇండియా ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ ఆదేశాలు ప్రాథమిక న్యాయ సూత్రాలను ఉల్లంఘించేవిగా ఉన్నాయని డాబర్ తరఫు సీనియర్ న్యాయవాది వాదించారు. కనీసం షోకాజ్ నోటీసులు గానీ, విచారణ గానీ జరగకుండా ఏకపక్షంగా ఆదేశాలు ఇచ్చిందని పేర్కొన్నారు.డాబర్ ఇండియాకు గతంలో నోటీసులు జారీ చేసినట్లు కేంద్రం తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. విచారణకు అవకాశం ఇవ్వకుండా నిషేధం విధించడం సముచితం కాదని పేర్కొంటూ తదుపరి విచారణ వరకు నిషేధంపై స్టే విధించింది. దీంతో డాబర్ ఉత్పత్తుల అమ్మకాలు కొనసాగవచ్చు.

# హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ కొత్త క్లౌడ్ రీజియన్

- తెలంగాణలో టెక్ రంగానికి మరో భారీ పెట్టుబడి అడుగు
- దేశంలో నాలుగో క్లౌడ్ రీజియన్‌గా హైదరాబాద్
- క్లౌడ్, ఏఐ సేవలకు మరింత ఊతం
- డిజిటల్ మౌలిక వసతులకు బలమైన మద్దతు




**హైదరాబాద్, ఆగస్టు 7(జనంసాక్షి) :** టెక్నాలజీ రంగంలో హైదరాబాద్ మరో కీలక మైలురాయిని చేరుకుంది. మైక్రోసాఫ్ట్ భారత్‌లో తన నాలుగో క్లౌడ్ రీజియన్‌ను హైదరాబాద్‌లో ప్రారంభించినట్లు తాజా సమాచారం వెల్లడించింది. క్లౌడ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధ (ఏఐ), డేటా సేవలకు పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా ఈ మౌలిక వసతులు అందుబాటులోకి రావడం నగర ఐటీ రంగానికి మరింత ఊతమివ్వనుంది. హైదరాబాద్ ఇప్పటికే దేశంలోని ప్రముఖ ఐటీ, డేటా సెంటర్ కేంద్రాల్లో ఒకటిగా కొనసాగుతోంది. మైక్రోసాఫ్ట్ క్లౌడ్ రీజియన్ ఏర్పాటుతో సంస్థలు తమ డిజిటల్ కార్యకలాపాలను మరింత వేగంగా విస్తరించుకునే అవకాశం లభించనుంది. ముఖ్యంగా ఏఐ ఆధారిత అప్లికేషన్లు, క్లౌడ్ సేవలు, డేటా అనలిటిక్స్ వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాల వినియోగానికి ఇది దోహదపడే అవకాశం ఉంది.

దేశంలో క్లౌడ్ మౌలిక వసతుల అవసరం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో హైదరాబాద్‌లో కొత్త రీజియన్ ఏర్పాటు కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, స్టార్టప్‌లు, పెద్ద టెక్నాలజీ కంపెనీలకు స్థానికంగా మరింత సమర్థవంతమైన క్లౌడ్ సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. డేటా భద్రత, తక్కువ ఆలస్యంతో సేవలు, వ్యాపార కార్యకలాపాల నిరంతర కొనసాగింపునకు కూడా క్లౌడ్ మౌలిక వసతులు కీలకంగా మారుతున్నాయి. మైక్రోసాఫ్ట్ నిర్ణయంతో హైదరాబాద్ అంతర్జాతీయ టెక్నాలజీ హబ్‌గా మరింత బలోపేతం కానుందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. క్లౌడ్, ఏఐ రంగాల్లో పెట్టుబడులు పెరగడంతోపాటు నైపుణ్య ఆధారిత ఉద్యోగ అవకాశాలు, సాంకేతిక భాగస్వామ్యాలు, డిజిటల్ ఎకోసిస్టమ్ విస్తరణకు ఇది దోహదపడే అవకాశం ఉంది.

# మార్కెట్లకు మళ్లీ నష్టాల సెగ

## సెన్సెక్స్ 500 పాయింట్లకు పైగా పతనం

- 24,550 దిగువకు జారిన నిఫ్టీ
- బ్యాంకింగ్ షేర్లలో భారీ అమ్మకాలు
- ఐటీ, ఆటో రంగాలే కొంత అండ



**ముంబయి, ఆగస్టు 7 (జనంసాక్షి) :** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు శుక్రవారం నష్టాలతో ముగిశాయి. అంతర్జాతీయంగా చమురు ధరలు పెరగడం, ఫైనాన్షియల్ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి కారణంగా సూచీలు నేల చూపులు చూశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 455.59 పాయింట్లు లేదా 0.58 శాతం నష్టంతో 78,499.17 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 65.35 పాయింట్లు లేదా 0.27 శాతం క్షీణించి 24,570.65 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.20గా ఉంది. మరోవైపు ఐటీ, ఆటో రంగాల షేర్లలో కొనుగోళ్లు మార్కెట్ పతనానికి కొంతమేర అడ్డుకట్ట వేశాయి. ప్రైవేట్ బ్యాంకులు, ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగాల్లో అమ్మకాల ఒత్తిడి ఉదయం నుంచే కొనసాగింది. దీంతో కీలక సూచీలపై ప్రభావం పడింది. ముఖ్యంగా బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్ వంటి షేర్లు ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. బ్యాంకింగ్ రంగంలోని ప్రధాన షేర్లలో విక్రయాలు పెరగడంతో మార్కెట్ సెంటిమెంట్ బలహీనపడింది. పెట్టుబడిదారులు అప్రమత్తంగా వ్యవహరిస్తూ లాభాల స్వీకరణకు మొగ్గుచూపినట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి. అయితే ఐటీ రంగం మార్కెట్‌కు కొంత ఊరటనిచ్చింది. ఇతర రంగాల షేర్లు బలహీనంగా ఉన్నప్పటికీ ఐటీ కంపెనీల్లో కొనుగోళ్ల మద్దతు కనిపించింది. ఉదయం ట్రేడింగ్‌లో ఐటీ సూచీ సుమారు 2 శాతం వరకు లాభపడినట్లు మార్కెట్ సమాచారం వెల్లడించింది. దీంతో మార్కెట్ పతనం మరింత తీవ్రం కాకుండా ఐటీ షేర్లు కొంతమేర అడ్డుకట్ట వేశాయి. ఆటో రంగంలోని కొన్ని షేర్లలోనూ కొనుగోళ్లు కనిపించాయి. అయినప్పటికీ బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగాల్లో కొనసాగిన అమ్మకాల ఒత్తిడి ప్రధాన సూచీలను దిగజార్చింది. సెన్సెక్స్ 500 పాయింట్లకు పైగా నష్టపోవడం, నిఫ్టీ 24,550 దిగువకు జారడం ద్వారా మార్కెట్‌లో ప్రస్తుతం అమ్మకాల ఆధిపత్యం స్పష్టమైంది. అంతర్జాతీయ పరిణామాలు, అమెరికా ఆర్థిక గణాంకాలు, విదేశీ పెట్టుబడుల కదలికలపై ఇన్వెస్టర్లు దృష్టి సారించిన నేపథ్యంలో రానున్న సెషన్లలోనూ సూచీల కదలికలు కీలకంగా మారనున్నాయి.

# ఎస్బీఐ త్రైమాసిక ఫలితాల్లో దూకుడు

## రూ.24,113 కోట్ల నికర లాభం.. 13.73% వృద్ధి




**ముంబయి (జనంసాక్షి) :** ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో అదరగొట్టింది. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో ఏకీకృత ప్రాతిపదికన బ్యాంక్ రూ.24,113 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గతేడాది ఇదే కాలంలో నమోదైన రూ.21,201 .47 కోట్లతో పోలిస్తే లాభం 13.73 శాతం పెరిగింది.

మార్చితో ముగిసిన గత త్రైమాసికంలో నమోదైన రూ.19,642.87 కోట్ల నికర లాభంతో పోలిస్తే కూడా ఎస్బీఐ మెరుగైన పనితీరును కనబరిచింది. స్టాండలోన్ ప్రాతిపదికన బ్యాంక్ నికర లాభం 10.23 శాతం పెరిగి రూ.21,121.22 కోట్లకు చేరింది. గతేడాది ఇదే త్రైమాసికంలో ఈ లాభం రూ.19,160.44 కోట్లుగా ఉంది.సమీక్షా త్రైమాసికంలో ఎస్బీఐ మొత్తం ఆదాయం రూ.1.35 లక్షల కోట్ల నుంచి రూ.1.43 లక్షల కోట్లకు పెరిగింది. అదే సమయంలో మొత్తం ఖర్చులు రూ.1.04 లక్షల కోట్ల నుంచి రూ.1.10 లక్షల కోట్లకు చేరాయి. మరోవైపు నిరర్థక ఆస్తుల (ఎన్‌పీఏ) కోసం కేటాయించే ప్రొవిజన్లు రూ.4,934 కోట్ల నుంచి రూ.3,359 కోట్లకు తగ్గాయి. బ్యాంక్ ఆస్తుల నాణ్యత కూడా మెరుగుపడింది. నికర ఎన్‌పీఏ నిష్పత్తి గతేడాది 1.49 శాతం నుంచి 1.47 శాతానికి తగ్గింది. త్రైమాసిక ఫలితాలు వెలువడిన నేపథ్యంలో ఎస్బీఐ షేర్లు బీఎస్ఈలో 2.13 శాతం లాభంతో రూ.1,108 వద్ద ట్రేడయ్యాయి.మొత్తంగా లాభాల వృద్ధి, ప్రొవిజన్ల తగ్గుదల, ఎన్‌పీఏల నియంత్రణతో ఎస్బీఐ త్రైమాసిక ఫలితాలు బ్యాంకింగ్ రంగంలో సానుకూల సంకేతాలను ఇచ్చాయి.



# ప్రపంచ సెమీకండక్టర్ మార్కెట్‌లో భారీ వృద్ధి

- రెండో త్రైమాసికంలో 35.1 శాతం పెరుగుదల
- అమ్మకాలు 403.3 బిలియన్ డాలర్లకు చేరువ
- ఏఐ డిమాండ్‌తో రికార్డు స్థాయి
- సంవత్సరం చివరికి 1.5 ట్రిలియన్ డాలర్లు దాటే అవకాశం

**వాషింగ్టన్, ఆగస్టు 7(జనంసాక్షి) :** ప్రపంచ సెమీకండక్టర్ మార్కెట్‌లో భారీ వృద్ధి నమోదైంది. 2026 రెండో త్రైమాసికంలో ప్రపంచ సెమీకండక్టర్ అమ్మకాలు 35.1 శాతం పెరిగి 403.3 బిలియన్ డాలర్లకు చేరినట్లు తాజా పరిశ్రమ సమాచారం వెల్లడించింది. అమెరికా సెమీకండక్టర్ ఇండస్ట్రీ అసోసియేషన్ (ఎస్ఐఏ), వరల్డ్ సెమీకండక్టర్ ట్రేడ్ స్టాటిస్టిక్స్ (డబ్ల్యూఎస్‌టీఎస్) సంయుక్తంగా విడుదల చేసిన గణాంకాల ప్రకారం ఇది గత త్రైమాసికంతో పోలిస్తే అత్యధిక వృద్ధి. జూన్ నెలలోనే అమ్మకాలు 134.5 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఇది గతేడాది జూన్‌తో పోలిస్తే 123.6 శాతం, మే నెలతో పోలిస్తే 9.7 శాతం పెరుగుదల. అమెరికా, ఆసియా-పసిఫిక్, చైనా మార్కెట్లలో బలమైన డిమాండ్ ఈ వృద్ధికి దోహదపడింది. కృత్రిమ మేధ (ఏఐ) మౌలిక సదుపాయాలు, హై-పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్, అధునాతన మెమరీ చిప్స్‌పై పెట్టుబడులు పెరగడం ప్రధాన కారణం. ఎస్ఐఏ అధ్యక్షుడు జాన్ న్యూఫర్ మాట్లాడుతూ.. 2026లో ప్రపంచ చిప్ అమ్మకాలు 1.5 ట్రిలియన్ డాలర్లు దాటుతాయని అంచనా వేశారు. సెమీకండక్టర్లు తదుపరి తరం సాంకేతిక ఆవిష్కరణలు, ఆర్థిక పోటీతత్వాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. మెమరీ సెగ్మెంట్‌లో అత్యధిక వృద్ధి నమోదవుతోందని, లాజిక్ చిప్స్‌లోనూ గణనీయమైన పెరుగుదల ఉందని తెలిపారు.

క్రూడ్ ధరల పెరుగుదల..

# మార్కెట్లకు ఒత్తిడి

## బ్రెంట్ 83 డాలర్లు దాటి ట్రేడ్

- దేశీయ సూచీలు ప్రతికూలంగా ప్రారంభం
- హోర్ముజ్ జలసంధి ఉద్రిక్తతలు ప్రభావం



**ముంబయి, ఆగస్టు 7(జనంసాక్షి) :** అంతర్జాతీయంగా ముడిచమురు ధరల కదలికలు దేశీయ మార్కెట్లపై ప్రభావం చూపుతున్నాయి. శుక్రవారం భారత మార్కెట్లు ప్రతికూలంగా ప్రారంభం కావడానికి పెరిగిన క్రూడ్ ధరలు, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన మిశ్రమ సంకేతాలు కారణమయ్యాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 83 డాలర్లు దాటి ట్రేడ్ అవుతోంది.

మధ్యప్రాచ్యంలో హోర్ముజ్ జలసంధి చుట్టూ నెలకొన్న ఉద్రిక్తతలు చమురు ధరలను పెంచాయి. ఇరాన్ ప్రతిపాదనలు కారణంగా సరఫరా అంతరాయాల భయం పెరిగింది. భారత్ తన చమురు అవసరాల్లో 85 శాతం కంటే ఎక్కువ దిగుమతి చేసుకుంటుంది. కాబట్టి ధరల పెరుగుదల దిగుమతి బిల్లు, ద్రవ్యోల్బణంపై ఒత్తిడి పెంచుతుంది. రూపాయి విలువపైనా ప్రభావం చూపుతోంది. సెన్సెక్స్, నిఫ్టీ సూచీలు తెరుచుకున్నప్పుడే నష్టాల్లోకి జారాయి. గ్లోబల్ సెంటిమెంట్ బలహీనంగా ఉండడం, చమురు ధరల పెరుగుదల కలిసి పెట్టుబడిదారులను జాగ్రత్తగా వ్యవహరించేలా చేశాయి. విశ్లేషకులు చమురు ధరల కదలికలను దగ్గరగా పరిశీలిస్తున్నారు.

# అమెరికా ఉద్యోగ డేటాపైనే మార్కెట్ల ఉత్కంఠ

- నాన్‌ఫార్మ్ పేరోల్స్ గణాంకాల కోసం ఎదురుచూపు
- నిరుద్యోగిత రేటు.. ఫెడ్ నిర్ణయాలకు కీలకం

**వాషింగ్టన్, ఆగస్టు 7(జనంసాక్షి) :** అమెరికా ఉద్యోగ గణాంకాలే ఇప్పుడు ప్రపంచ ఆర్థిక మార్కెట్ల దిశను నిర్దేశించనున్నాయి. జులై నెలకు సంబంధించిన నాన్‌ఫార్మ్ పేరోల్స్, నిరుద్యోగిత రేటు వివరాలు శుక్రవారం విడుదల కానుండటంతో పెట్టుబడిదారుల్లో ఉత్కంఠ నెలకొంది. అమెరికా కార్మిక మార్కెట్ బలం, ఆర్థిక వ్యవస్థ పయనం ఎలా ఉందన్న దానిపై స్పష్టత ఇవ్వనున్న ఈ గణాంకాలు.. ఫెడరల్ రిజర్వ్ తదుపరి వడ్డీ రేటు నిర్ణయాలపై అంచనాలను మార్చే అవకాశముంది. దీంతో అమెరికా మార్కెట్లతో పాటు ఆసియా, యూరప్ మార్కెట్లు కూడా తాజా డేటా కోసం వేచిచూస్తున్నాయి. ఆర్థికవేత్తల అంచనాల ప్రకారం జులైలో అమెరికాలో నాన్‌ఫార్మ్ పేరోల్స్ 70 వేల నుంచి 80 వేల వరకు పెరిగే అవకాశం ఉంది. నిరుద్యోగిత రేటు 4.2 శాతం వద్ద కొనసాగవచ్చని భావిస్తున్నారు. అయితే అంచనాలను మించి ఉద్యోగాలు పెరిగితే అమెరికా కార్మిక మార్కెట్ పటిష్ఠంగా ఉందనే సంకేతం వెలువడుతుంది. ఇది ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు కొనసాగుతున్నాయనే అభిప్రాయానికి బలం చేకూర్చి, ఫెడ్ వడ్డీ రేట్ల విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించేలా చేయొచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

మరోవైపు ఉద్యోగ కల్పన గణనీయంగా తగ్గి, నిరుద్యోగిత రేటు పెరిగినట్లు గణాంకాలు వెల్లడైతే అమెరికా ఆర్థిక వ్యవస్థలో మందగమన సంకేతాలు కనిపిస్తున్నాయనే అభిప్రాయం బలపడొచ్చు. ప్రస్తుతం ఫెడ్ వడ్డీ రేట్లను 3.50-3.75 శాతం పరిధిలో కొనసాగిస్తోంది. భవిష్యత్ ద్రవ్య విధానంపై స్పష్టత కోసం ఉద్యోగ గణాంకాలను ఫెడ్ అధికారులు కూడా నిశితంగా పరిశీలించే అవకాశం ఉంది.అమెరికా డాలర్, బాండ్ ఈల్డ్స్, స్టాక్ సూచీలు, బంగారం వంటి కమోడిటీలలో తీవ్ర ఒడిదుడుకులకు అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. బలమైన ఉద్యోగ డేటా వెలువడితే డాలర్, బాండ్ ఈల్డ్స్ పెరిగే అవకాశం ఉండగా.. బలహీన గణాంకాలు వడ్డీ రేట్ల కోత అంచనాలను పెంచి స్టాక్స్, బంగారానికి మద్దతుగా నిలిచే అవకాశం ఉంది. అందుకే శుక్రవారం వెలువడే అమెరికా ఉద్యోగ గణాంకాలపై దేశీయ మార్కెట్ల పెట్టుబడిదారుల చూపు కూడా నిలిచింది.

# ఫోటో కొట్టుడే.. చలాన్ వేసుడే!

- ట్రాఫిక్ కానిస్టేబుల్లా.. లేక ఫొటోగ్రాఫర్లా?
- ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ పోలీసుల వింత వైఖరి
- మండిపడుతున్న వాహనదారులు
- ట్రాఫిక్ నియంత్రణ గాలికి, కెమెరాలకే ప్రాధాన్యం
- సమస్యలొచ్చి పడ్డా పట్టించుకోని వైనం..
- అత్యవసరాలకూ తప్పని తిప్పలు..
- పార్కింగ్ లేని షాపింగ్‌లపై ప్రేమ
- శబ్ద కాలుష్యంపై ఎందుకింత మౌనం..



**రంగారెడ్డి, , ఆగస్టు 07 ( జనం సాక్షి)** ట్రాఫిక్ నియంత్రణను గాలికొదిలేసిన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ శాఖ తీరుపై వాహనదారులు తీవ్రస్థాయిలో మండి పడుతున్నారు. రోడ్లపై వాహనాలను క్రమబద్ధీకరించాల్సిన అధికారులు.. కేవలం డిజిటల్ చలాన్ల వసూళ్లే లక్ష్యంగా పెట్టుకున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. "ఫోటో కొట్టుడే.. చలాన్ వేసుడే" అన్న చందంగా సామాన్య ప్రజలను దోచుకుంటున్నారంటూ ప్రజలు, వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**ట్రాఫిక్ నియంత్రణ గాలికి.. కెమెరాలకే ప్రాధాన్యం..**

ప్రస్తుతం ఇబ్రహీంపట్నంలో ఏ ప్రధాన వీధిలో చూసినా ట్రాఫిక్ పోలీసుల కంటే ఫోటోగ్రాఫర్లే ఎక్కువగా కనిపిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి కానిస్టేబుల్ చేతిలో కెమెరాలు, సెల్‌ఫోన్‌లే దర్శనమిస్తున్నాయి. ట్రాఫిక్ నియంత్రణను పూర్తిగా మరిచిపోయి, కేవలం చలాన్లు వేయడమే వారి ఏకైక కర్తవ్యంగా మారిపోయింది. ట్రాఫిక్ పోలీసుల తీరుపై సర్వాంతర వ్యవస్థ రచయితవుతున్నాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**సమస్యలొచ్చి పడ్డా పట్టించుకోని వైనం..**

రోడ్లపై కిలోమీటర్ల కొద్దీ వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ జామ్ అయినా ట్రాఫిక్ పోలీసులకు పట్టదు. ప్రధాన కూడళ్ల (జంక్షన్ల) వద్ద ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి, దారి చూపాల్సిన బాధ్యతను వారు పూర్తిగా విస్మరించారు.

**అత్యవసరాలకూ ట్రాఫిక్ తిప్పలు..**

అత్యవసర పనులపై రోడ్లెక్కిన వాహనాలను, మెడికల్ షాపులకు వెళ్లే వారిని, చివరకు పిల్లలను స్కూళ్ల వద్ద దింపడానికి, పికప్ చేసుకోవడానికి వచ్చే వారిని సైతం వారు వదలడం లేదు. క్షణాల వ్యవధిలో రోడ్డు పక్కన బండి ఆపితే చాలు.. వాహనదారులపై చలాన్ పిడుగు పడుతోంది.

**పార్కింగ్ లేని షాపింగ్‌లపై ప్రేమ...**

నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి పార్కింగ్ సౌకర్యం లేని వాణిజ్య సముదాయాలు, షాపింగ్‌లపై మాత్రం ఎలాంటి చర్యలు శూన్యం. దీనివల్ల రోడ్లపైనే వాహనాలు నిలపాల్సి వస్తున్నా అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేదు. వారితో కుమ్మక్కయ్యారని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. రాఘవేంద్ర ఫర్టిలైజర్ షాప్ ఎదుట వారికి సంబంధించిన ఆటోలు పదుల సంఖ్యలో రోడ్డుపైనే ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా పార్కు చేస్తున్న పట్టించుకోవడం లేదు. అదే ప్లేస్ లో ఇతర వాహన లాపితే మాత్రం చలాన్ లో వచ్చి పడుతున్నాయి.

**శబ్ద కాలుష్యంపై మౌనం..**

చెవులు చిల్లులు పడేలా ద్విచక్ర వాహనాల సైలెన్సర్ల శబ్దాలు మోగిస్తూ యువత హంగామా సృష్టిస్తున్నా వాటిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ముందే, నిబంధనలకు విరుద్ధంగా భారీ శబ్ద కాలుష్యంతో నడుస్తున్న వాహనాలను చూసీచూడనట్లు వదిలేస్తున్నారనే ఆరోపణలున్నాయి.



**శాశ్వత పరిష్కారం కోరుతున్న ప్రజలు..**

ట్రాఫిక్ కష్టాలను తీర్చాల్సిన పోలీసులే తమకు శాపంగా మారుతున్నారని ఇబ్రహీంపట్నం ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై వాహనాల రాకపోకలను సాఫీగా సాగేలా చూడాల్సిన వారు.. కేవలం ఫోటోలు తీసి జరిమానాలు విధించడంపైనే దృష్టి పెట్టడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, విచక్షణారహితంగా చలాన్లు విధిస్తున్న సిబ్బంది తీరును మార్చాలని కోరుతున్నారు. మెరుగైన ట్రాఫిక్ నిర్వహణకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

# సర్పంచ్ మెడకు ఉచ్చు..!!



- దళితులపై దాడి కేసు విచారణదాడి ప్రమేయం ఉన్న నిందితుల గుర్తింపు
- విచారణ వేగవంతం చేసిన వికారాబాద్ డిఎస్పి అంజయ్య
- సర్పంచ్ మాజీ సర్పంచ్ తో సహా మరి కొందరిపై అట్రాసిటీ కేసు..?

**మర్పల్లి ఆగస్టు 7( జనం సాక్షి)** నియంతల విర్రవీగే వారి కోరలు పీకడానికి చట్టం తన పని తాను చేసుకుంటుంది. నాకు ఎదురే లేదు అని రాత్రివేళ దళితులపై దాడి చేసిన సర్పంచ్ మాజీ సర్పంచ్ మెడకు ఉచ్చు బిగిసుకుంటుంది. వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలంలోని కొంశ పల్లి గ్రామ దళిత కుటుంబం పై సర్పంచ్ తో సహా ఆయన అనుచరులు దాడి చేసిన విషయం పాఠకులకు విధితమే. ఈ విషయమై వికారాబాద్ డిఎస్పి అంజయ్య మోమిన్ పేట సీఐ వెంకటేష్ మర్పల్లి ఎస్ఐ ఆధ్వర్యంలో శుక్రమాదం నాడు విచారణ జరిపారు. దళితుల భూమి నుంచి కొంశ ట్ పల్లి గ్రామ సర్పంచ్ రఫీయోద్దీన్ మాజీ సర్పంచ్ శేఖర్ ఆధ్వర్యంలో రాత్రిపూట వారి అనుచరులతో తమ ఇంట్లోకి చొరబడి కులం పేరుతో బూతులు తిట్టి దాడి చేసినట్లు బాధిత దళిత మహిళ ఐదుల పురం ఇందిరమ్మ మర్పల్లి వికారాబాద్ డిఎస్పి ఎస్పీ కలెక్టర్ కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసింది. ఈ మేరకు వికారాబాద్ డిఎస్పి అంజయ్య కేసు విచారణ జరిపారు. శుక్రవారం కొమి శెట్టి పల్లి గ్రామానికి వెళ్లి ప్రత్యక్ష సాక్షుల నుంచి వాగ్మూలం తీసుకున్నారు. సర్పంచ్ తో సహా ఆయన వర్గం దళిత కుటుంబం పై కులం పేరుతో బూతులు తిట్టి దాడి జరిపినట్లు ప్రాథమిక విచారణలో తేలినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా గ్రామ సర్పంచ్ రఫీయోద్దీన్ నేర చరిత్రపై విచారణ జరిపినట్లు తెలుస్తోంది. ఆయనపై ఇప్పటికే అనేక కేసులతో పాటు రౌడీషీట్ ఉన్నట్లు బాధిత మహిళ తోపాటు గ్రామ పెద్దలు కొందరు వికారాబాద్ డిఎస్పి అంజయ్య దృష్టికి తీసుకువచ్చారు. గ్రామ సర్పంచ్ పై ఉన్న కేసులు నేరాల తీవ్రతను బట్టి దళితులపై దాడి కేసులో పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి అవకాశం ఉంది. గ్రామ సర్పంచ్ రఫీయోద్దీన్ తమ అనుచరులతో దళితులపై దాడి చేయడం పట్ల సొంత పార్టీ నాయకులు విస్మయం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఈ కేసు రాజకీయానికి ముడిపడి ఉన్నందున తీవ్ర సంచలనంగా మారింది. ఏది ఏమైనా పోలీసులు మాత్రం నిష్పక్షపాతంగా దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులపై నమ్మకం సన్నగిల్లుతున్న ఈ రోజుల్లో ఈ కేసు దర్యాప్తు అనంతరం పోలీసుల పట్ల కొంతమేరకు విశ్వాసం పెరగడం కోసం మెరుపు...



## కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్

**అర్బన్ అభివృద్ధి పనుల ప్రతిపాదనలు అందజేత**

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 07 ( జనం సాక్షి)** ఇందూరు: నగరంలోని పలు రోడ్లు, వంతెనల అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతిపాదనలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ తో కలిసి శుక్రవారం కేంద్ర రోడ్డు మరియు జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ప్రతిపాదనలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నగరంలోని దేవీ రోడ్డు, రైల్వే స్టేషన్, నాందేవాడ అదనపు వంతెన ( ఆర్ వో బీ ) మంజూరుచేయాలని కోరడం జరిగిందన్నారు. అలాగే సోనీ ఫంక్షన్ హాల్ సమీపంలో ఎల్లమ్మ గుట్ట వద్ద ఆర్ యూబీ ఏర్పాటు చేయడం అత్యంత ఆవశ్యకమన్నారు. ఇందుకోసం రెండిటికి రూ.170 కోట్లు మంజూరు కావాలన్నారు. అలాగే నిజామాబాదులోని రేడియో స్టేషన్ నుంచి ముదక్పల్లి పాత జిపి ఆఫీస్ వరకు రూ.30 కోట్లతో ఆర్ అండ్ బీ రోడ్డు కోసం ప్రతిపాదించడం జరిగిందన్నారు. వర్ని జంక్షన్ నుంచి నిజామాబాద్, డిచ్పల్లి, ఇందల్వాయి, భీమ్గల్ మీదుగా కమ్మర్పల్లి వరకు నగరాన్ని కలుపుతూ 107 కిలోమీటర్ల పొడవుతో కొత్త జాతీయ రహదారి ప్రతిపాదనను కూడా అందజేశామన్నారు. మరొక రోడ్డు నగరంలోని రాజీవ్ గాంధీ విగ్రహం నుంచి ఎన్టీఆర్ విగ్రహం, దుబ్బ మీదుగా కాలూర్ రోడ్డు ను పూర్తి చేయాలని కోరడం జరిగిందన్నారు. ఎమ్మెల్యేతో పాటు రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి అభయ్ పాటిల్, ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు ఉన్నారు.

## కిడ్నాప్ చేసి దాడి.. రూ.52 వేలు స్వైప్ చేశారంటూ ఫిర్యాదు

**కరీంనగర్ టౌన్, ఆగస్టు 7 ( జనం సాక్షి)** కరీంనగర్‌లో ఓ వ్యక్తిని కారులో తీసుకెళ్లి బంధించి తీవ్రంగా కొట్టడంతో పాటు బ్యాంకు కార్డుల ద్వారా రూ.52 వేల నగదును స్వైప్ చేశారంటూ టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. సప్తగిరి కాలనీకి చెందిన బుద్దిరెడ్డి కమలాకర్ ఫిర్యాదు మేరకు, మంకమ్మతోటకు చెందిన అమ్మిగల్ల ప్రశాంత్ అలియాస్ శశి తనను ఆగస్టు 4న ఉదయం కారులో తీసుకెళ్లాడని పేర్కొన్నాడు. అనంతరం సెల్‌ఫోన్ లాక్కొని ఓ ఇంటిలో బంధించి, తన భార్యతో అక్రమ సంబంధం ఉందని ఒప్పుకోవాలని ఒత్తిడి తెచ్చారని ఆరోపించాడు. ఒప్పుకోకపోవడంతో చేతులతో కొట్టడంతో పాటు కటింగ్ ప్లేయర్‌తో కాలిపై గాయపరిచి, కత్తితో బెదిరిస్తూ ప్రాణహాని కలిగించేలా వ్యవహరించారని తెలిపాడు. తన సెల్‌ఫోన్ పాస్‌వర్డ్, బ్యాంకు కార్డుల వివరాలు బలవంతంగా తెలుసుకుని జ్యోతినగర్‌లోని ఓ పెట్రోల్ బంక్‌లో యాక్సిస్ బ్యాంక్, ఎస్‌బీఐ కార్డుల ద్వారా మొత్తం రూ.52 వేల నగదును స్వైప్ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. అనంతరం విషయం బయటకు చెబితే తనతో పాటు కుటుంబ సభ్యులను చంపేస్తామని బెదిరించి, సప్తగిరి కాలనీ సమీపంలో వదిలి వెళ్లినట్లు తెలిపాడు. అదే రోజు రాత్రి తన ఇంటి వద్దకు వచ్చి ద్విచక్ర వాహనం, యజమానికి చెందిన వాహనం, పూల కుండీలు ధ్వంసం చేసి, భార్యను దుర్భాషలాడుతూ బెదిరించాడని ఫిర్యాదులో ఆరోపించాడు. చికిత్స అనంతరం టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# నాణ్యతతో సమాచారం పక్కాగా సేకరించాలి

**రాష్ట్ర జనాభా లెక్కల సంచాలకులు భారతి హోళికేరి**

**జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ సమాచార సేకరణపై కలెక్టర్లతో వీ.సీ ద్వారా సమీక్ష**

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 07 ( జనం సాక్షి)** జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ (District Census Handbook -- DCHB) రూపకల్పన కోసం ఫీల్డ్ ఫంక్షనరీలు క్షేత్రస్థాయిలో నాణ్యతతో సమాచారం పక్కాగా సేకరించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర జనాభా లెక్కల సంచాలకులు భారతి హోళికేరి సూచించారు. జనగణన-2027కు సంబంధించిన సన్నాహక కార్యక్రమాల్లో భాగంగా జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ రూపకల్పన విషయమై ఆమె శుక్రవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ రూపొందించేందుకు విద్యా, వైద్య సదుపాయాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, రవాణా , కమ్యూనికేషన్, బ్యాంకింగ్, రుణ సదుపాయాలు, విద్యుత్, ఇంధన వనరులు, భూమి, సాగునీటి వినియోగం, వ్యవసాయం, తయారీ చేతివృత్తులు, గ్రామానికి సంబంధించిన ముఖ్యమైన ప్రత్యేక అంశాలు, పరిశీలనలు వంటి తొమ్మిది ప్రధాన అంశాలకు సంబంధించిన సమాచారాన్ని ఖచ్చితత్వంతో అందించేలా చూడాలన్నారు. అదేవిధంగా టౌన్ డైరెక్టరీ షెడ్యూల్ ను ఛార్జ్ ఆఫీసర్లచే(మున్సిపల్ కమిషనర్) నియమించబడిన అధికారుల ద్వారా పట్టణ పౌర, పరిశ్రమలు, సామాజిక సదుపాయాలు, మురికివాడలకు సంబంధించిన సమాచారాన్ని నమోదు చేయాలని సూచించారు. ఆయా శాఖల జిల్లా అధికారులు పూర్తి సమాచారాన్ని సేకరించి ఛార్జ్ ఆఫీసర్లకు అందించాలని ఆదేశించారు. అన్ని మండలాల్లో ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థల సమాచారాన్ని ఛార్జ్ ఆఫీసర్లు డీసీహెచ్ బీ పోర్టల్, మొబైల్ అప్లికేషన్‌ను ఉపయోగించి సమాచారాన్ని నాణ్యతతో నమోదు చేయాలన్నారు. విలేజ్ డైరెక్టరీ సమాచారాన్ని 31.12.2025ను ప్రామాణిక తేదీగా తీసుకుని, రెవెన్యూ గ్రామాల వారీగా మొబైల్ అప్లికేషన్ లో సేకరించాలని సూచించారు. ఈ సమాచార సేకరణ ప్రక్రియ 10.08.2026 నుండి 08.09.2026 వరకు నిర్వహించనున్నట్లు రాష్ట్ర జనాభా లెక్కల సంచాలకులు భారతి హోళికేరి వెల్లడించారు. జిల్లా అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన, విధానాల అమలు, పరిశోధనలు, పరిపాలనా అవసరాలకు డిస్ట్రిక్ట్ సెన్సస్ హ్యాండ్‌బుక్ ఒక ముఖ్యమైన ఆధార గ్రంథంగా ఉపయోగపడుతుందని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా సమాచారాన్ని సేకరించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ భవేష్ మిశ్రా, అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, సీ.పీ.ఓ కిషన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# చక్కెర ఫ్యాక్టరీ తెరిపించుకుందాం

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 7 ( జనం సాక్షి)** గత 16 సంవత్సరాలుగా మూతపడిన ఎన్ సి ఎస్ ఎఫ్ సారంగపూర్ చక్కెర ఫ్యాక్టరీని తెరిపించేందుకు గ్రామ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున రైతులంతా కదిలి వచ్చి ఫ్యాక్టరీ తెరిపించుకునేందుకు గాను ఈ నెల 9న చక్కెర ఫ్యాక్టరీ ఆవరణలో జరిగే రైతు సమావేశాన్ని విజయవంతం చేసుకుందామని రైతు నాయకులు సిర్ప నాగయ్య, జిల్లా కన్వీనర్ ఆకుల పాపయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం చెరుకు ఉత్పత్తి దారుల సంఘం ఆధ్వర్యంలో అర్సపల్లి గ్రామ కచేరిలో రైతుల సమావేశం చెగంటి గంగాధర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. సిర్ప నాగయ్య, కన్వీనర్ ఆకుల పాపయ్యాలు మాట్లాడుతు చక్కెర ఫ్యాక్టరీని నిర్మించుకునే సందర్భంలో ఆనాడు వంద రూపాయల చొప్పున షేర్ జమ చేసి రెండు కోట్ల 94 లక్షల రూపాయలు, ప్రభుత్వం 50 లక్షల మూలధనంతో ఈ ఫ్యాక్టరీని నిర్మించారని వారన్నారు. 6 వేల మంది రైతులు చెరుకును పండించి ఫ్యాక్టరీ కి తొలిన, మరో 5 వేలవరకు వ్యవసాయ కూలీలు, కార్మికులతో ఆనాడు ఫ్యాక్టరీ కలకల లాడిందని. ఇటు రైతులకు, కార్మికులకు మంచి ఉపాధి ఇచ్చిన ఫ్యాక్టరీని పాలకుల తప్పుడు విధానాలు, అవినీతి అధికారుల మూలాన మూతపడిందని వారు అన్నారు.




ఇప్పటికైనా ప్రభుత్వం ఫ్యాక్టరీ తెరిపించినట్లయితే రైతులమంతా చెరుకు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నామని అందుకు గాను రేవంత్ రెడ్డి సర్కారు ఇప్పటికైనా ఫ్యాక్టరీ తెరిపించేందుకు 100 కోట్ల రూపాయలు నిధులు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ చేగంటి గంగాధర్, కొట్టె గంగాధర్, కే గోపాల్, బి సాయిలు, టేక్మాల్ లక్ష్మన్, డాక్టర్ రాజన్న, బట్టి గంగాధర్, ఎర్ర అబ్బయ్య, దేశాయ్ పేట్ ఒడ్డెన్న, ముచ్చుగూర్ లింబాద్రి, గంగాధర్, లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

## కడేచూర్ ప్రమాద బాధిత కుటుంబాన్ని

# అన్ని విధాలా ఆదుకుంటాం

**ఫోన్‌లో పరామర్శించి హామీ ఇచ్చిన తెలంగాణ రాష్ట్ర మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి**

**బాధిత కుటుంబాన్ని స్వయంగా కలిసి పరామర్శించిన మంత్రి సోదరుడు వాకిటి శేషగిరి**



**మక్తల్, ఆగస్టు 07 (జనంసాక్షి)** కర్ణాటక రాష్ట్రం యాదగిరి జిల్లా కడేసూర్ కెమికల్ కంపెనీలో ప్రమాదవశాత్తు జరిగిన పేలుడులో ప్రాణాలు కోల్పోయిన కృష్ణా మండలం ఆలంపల్లి గ్రామానికి చెందిన కట్ల గణేష్ తండ్రి పేరు కట్ల దేవప్ప... కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి భరోసా ఇచ్చారు. శుక్రవారం రోజు మంత్రి సోదరుడు వాకిటి శేషగిరి కాంగ్రెస్ నాయకులతో కలిసి కృష్ణా మండలంలోని ఆలంపల్లి గ్రామంలో బాధిత కుటుంబాన్ని వారి ఇంటి వద్ద స్వయంగా కలుసుకొని పరామర్శించడంతోపాటు ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం మంత్రి వాకిటి శ్రీహరితో... బాధిత కుటుంబ సభ్యులను నేరుగా ఫోన్లో మాట్లాడించారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి.. బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పడంతో పాటు... వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అటు కర్ణాటక ప్రభుత్వంతోపాటు ఇటు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి సైతం బాధిత కుటుంబాన్ని ఆదుకునేలా చొరవ తీసుకుంటామని తెలిపారు. బాధిత కుటుంబానికి కుమారుడు లేని లోటు పూడ్చలేనిదని.. అయితే ఎట్టి పరిస్థితుల్లోనూ ధైర్యం కోల్పోవద్దని.. తనతోపాటు రాష్ట్ర ప్రభుత్వం కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని మంత్రి వాకిటి శ్రీహరి భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు విజయప్ప గౌడ, మాజీ మండలాధ్యక్షుడు రాజప్ప గౌడ, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సర్ఫరాజ్, సర్పంచ్ శంకరప్ప, నాగేందర్, సంతోష్ పాటిల్, పల్లె సురేష్, స్థానికులు తదితరులు ఉన్నారు.

## చేనేత వస్త్రాలను ధరించి నేతన్నలను ప్రోత్సహిద్దాం..

**కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం**

**మేయర్ కోలగాని శ్రీనివాస్, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే**

**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 7 (జనంసాక్షి) :** మన సంప్రదాయానికి ప్రతీక అయిన చేనేత వస్త్రాలను ధరించి నేతన్నలను ప్రోత్సహిద్దామని కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... చేనేత కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని వారికి సంక్షేమ పథకాలు అందించి అన్ని విధాలుగా అండగా నిలుస్తామని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వ ఉద్యోగులు చేనేత వస్త్రాలు ధరించేలా తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పచ్చునూరు చేనేత క్లస్టర్ తయారు చేసిన చీరను ఆవిష్కరించారు. ఆడిటోరియం వద్ద టెస్కో కరీంనగర్ డివిజన్ ఆధ్వర్యంలో చేనేత వస్త్రాలతో కూడిన ప్రత్యేక స్టాల్ ను ఏర్పాటు చేశారు. అనంతరం చేనేత ప్రతిజ్ఞ చేశారు. అంతకుముందు గీతా భావన్ చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు చేనేత సహకార సంఘాల అధ్యక్షులు పాలకవర్గ సభ్యులు, కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సమావేశంలో చేనేత జౌళి శాఖ ఏడీ రాఘవరావు, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు మెతుకు సత్యం, మాజీ మేయర్ రవీందర్ సింగ్, కార్పొరేటర్ వాసాల రమేష్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రీ-ప్రైమరీ టీచర్ల నియామకంలో 'రాజకీయ' పెత్తనం

- జానం పేట్ గ్రామంలో విస్మయకర ఘటన
- నిబంధనల ప్రకారం ఎంపికైనా దక్కని పోస్టింగ్
- రాజకీయ ఒత్తిళ్లకు విద్యాశాఖ లొంగుబాటు?
- బాధితురాలికి మద్దతుగా న్యాయ పోరాటానికి సిద్ధమవుతున్న ఉపాధ్యాయ సంఘాలు



**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 7 ( జనం సాక్షి)** జిల్లాలో ప్రాథమిక విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు చేపట్టిన ప్రీ-ప్రైమరీ ఉపాధ్యాయులు, ఆయాల నియామకాల వ్యవహారం రోజురోజుకూ తీవ్ర దుమారం రేపుతోంది. ప్రభుత్వ పారదర్శక నిబంధనలను పక్కనబెట్టి, అధికార పార్టీ నాయకులను ప్రసన్నం చేసుకున్న వారికే పోస్టింగ్‌లు కట్టబెడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా జిల్లాలోని జానం పేట్ గ్రామానికి చెందిన ఓ ఉపాధ్యాయురాలి నియామకంపై జరుగుతున్న రాజకీయ కక్షసాధింపు ఇప్పుడు గ్రామ సరిహద్దులు దాటి జిల్లా వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

**అన్ని అర్హతలూ ఉన్నా ఆగిపోయిన పోస్టింగ్**

జానంపేట్ గ్రామానికి చెందిన ప్రీ-ప్రైమరీ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టు కోసం మండల విద్యాశాఖ అధికారులు దరఖాస్తులను స్వీకరించి, సమగ్ర విచారణ జరిపారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అర్హతలు కలిగి ఉన్న నందిని అనే అభ్యర్థిని ఉపాధ్యాయురాలిగా ఎంపిక చేస్తూ జాబితాను రూపొందించారు. ఈ మేరకు సదరు నియామక ప్రతిపాదనలను తుది ఆమోదం కోసం జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి కూడా పంపించారు. అయితే, ఈ నియామకంపై స్థానిక అధికార పార్టీ నాయకుల కన్ను పడింది. తమ అనుచరులకు లేదా తాము సూచించిన వారికే ఆ పోస్ట్ కేటాయించాలని సదరు ప్రజాప్రతినిధులు విద్యాశాఖ అధికారులపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. ఈ రాజకీయ ఒత్తిళ్ల కారణంగానే నిబంధనల ప్రకారం ఎంపికైన నందిని నియామక ప్రక్రియను అధికారులు ఉద్దేశపూర్వకంగా కాలయాపన చేస్తూ పక్కనబెట్టారని ఆరోపణలు వస్తున్నాయి.

**శిక్షణకు పంపకపోవడంపై విస్మయం**

జిల్లావ్యాప్తంగా ఎంపికైన ఇతర ప్రీ-ప్రైమరీ ఉపాధ్యాయులందరినీ విద్యాశాఖ ఇప్పటికే అధికారిక శిక్షణకు పంపించింది. వారు శిక్షణ పూర్తి చేసుకుని విధుల్లో చేరేందుకు సిద్ధమవుతున్నారు. కానీ, మెరిట్ ప్రాతిపదికన ఎంపికైన జానం పేట్ టీచర్ నందినిని మాత్రం శిక్షణకు పంపకుండా నిలిపివేయడం విద్యాశాఖ వర్గాల్లోనే కాకుండా సామాన్య ప్రజల్లోనూ విస్మయాన్ని కలిగిస్తోంది. అర్హత ఉన్న అభ్యర్థిని ఇలా మానసికంగా కుంగదీయడంపై తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది.

**రాజకీయ పెత్తనంపై విద్యాశాఖ అధికారుల విసుగు**

పాఠశాలల స్థాయిలో జరిగే చిన్నపాటి నియామకాల్లో సైతం ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు జోక్యం చేసుకుని, తమ ప్రాబల్యాన్ని ప్రదర్శించాలని చూడటంపై విద్యాశాఖ అధికారులు సైతం లోలోపల తీవ్ర ఆగ్రహం మరియు విసుగు వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. అధికారులను స్వతంత్రంగా పనిచేయనీయకుండా, మెరిట్ లిస్టులను సైతం మార్చాలని ఒత్తిళ్లు తేవడం విద్యావ్యవస్థకే చేటు తెస్తుందని ఉపాధ్యాయ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి.

**ఉపాధ్యాయ సంఘాల ఆగ్రహం.. న్యాయపోరాటానికి సమాయత్తం**

అర్హత ఉండి, నిబంధనల ప్రకారం ఎంపికైన అభ్యర్థికి రాజకీయ కారణాలతో అన్యాయం చేయడాన్ని పలు ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా ఖండించాయి. విద్యావ్యవస్థను రాజకీయ అవసరాలకు వాడుకోవడం శోచనీయమని మండిపడ్డాయి. జానం పేట్ టీచర్ నందినికి వెంటనే శిక్షణ ఇచ్చి, పోస్టింగ్ ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. లేనిపక్షంలో విద్యాశాఖ అధికారుల తీరుపై మరియు స్థానిక నేతల అక్రమ జోక్యంపై ఉమ్మడి ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశాయి

# ప్రపంచ స్థాయి వేదికపై తెలంగాణ ఆర్టీసీ సత్తా

### సుస్థిర రవాణా దిశగా కీలక సంస్కరణలు

### యూఐటీపీ ఇండియా బస్ కాన్ఫరెన్స్‌లో టీజీఎస్ఆర్టీసీ వీసీ, ఎండీ వై. నాగిరెడ్డి



**ముషీరాబాద్, ఆగస్టు 7 (జనం సాక్షి):** వేగంగా పెరుగుతున్న పట్టణ జనాభాకు అనుగుణంగా పర్యావరణహిత, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ప్రజా రవాణా వ్యవస్థను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని 'యూఐటీపీ ఇండియా బస్ కాన్ఫరెన్స్--2026'లో నిపుణులు అభిప్రాయపడ్డారు. ఢిల్లీలో రెండు రోజుల పాటు జరిగిన ఈ అంతర్జాతీయ సదస్సులో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) వీసీ, ఎండీ వై. నాగిరెడ్డి కన్వీనర్ హోదాలో పాల్గొని సంస్థలో చేపడుతున్న ఆధునిక సంస్కరణలను వివరించారు.

ప్రపంచవ్యాప్తంగా ఎలక్ట్రిక్ బస్సుల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో వాటి నిర్వహణ, ఛార్జింగ్ మౌలిక వసతులు, డిజిటల్ చెల్లింపులు తదితర అంశాలపై సదస్సులో విస్తృతంగా చర్చించారు. టీజీఎస్ఆర్టీసీని ప్రయాణికులకు మరింత చేరువ చేయడంతో పాటు సంస్థను ఆర్థికంగా, నిర్వహణపరంగా బలోపేతం చేసేందుకు తీసుకుంటున్న చర్యలను వై. నాగిరెడ్డి సమగ్ర ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. రాష్ట్రంలో పర్యావరణహిత ఎలక్ట్రిక్ బస్సుల వినియోగాన్ని పెంచడం, ప్రయాణికులకు సురక్షితమైన డిజిటల్ సేవలు అందించడం, క్షేత్రస్థాయిలో రవాణా సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు చేపడుతున్న ఆధునిక చర్యలను ప్రపంచ స్థాయి ప్రతినిధుల సమక్షంలో ఆయన వెల్లడించారు. సదస్సులో వివిధ రాష్ట్రాల రవాణా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్లు, విధాన రూపకర్తలు, రవాణా రంగ నిపుణులతో ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. బస్సుల నిర్వహణ, ఆర్థిక సవాళ్లు, సబ్సిడీలు, ప్రభుత్వాల నుంచి అందాల్సిన మద్దతు వంటి అంశాలపై లోతైన చర్చ జరిగింది.

సదస్సు రెండో రోజు పరిశ్రమల అధినేతలు, అంతర్జాతీయ నిపుణులు, స్టార్టప్ ప్రతినిధులు పాల్గొని స్మార్ట్ మొబిలిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), భవిష్యత్ రవాణా నమూనాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఏఐ ఆధారంగా ట్రాఫిక్ రద్దీని ముందుగానే అంచనా వేసి బస్సుల రాకపోకలను ప్రణాళిక చేసే 'ప్రిడిక్టివ్ మొబిలిటీ' విధానాలను నిపుణులు ప్రతిపాదించారు. 'నెట్-జీరో' కార్బన్ ఉద్గారాల లక్ష్య సాధనలో భాగంగా 100 శాతం ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టడం, ఇందుకోసం గ్రీన్ బాండ్లు, దీర్ఘకాలిక తక్కువ వడ్డీ రుణాల ద్వారా నిధులు సమకూర్చే అంశాలపై కూడా చర్చించారు. ప్రయాణికులకు వై-ఫై, డిజిటల్ టికెటింగ్ సదుపాయాలు కల్పించడంతో పాటు మెట్రో, బస్సు, ఆటో వంటి వివిధ రవాణా సేవలను 'నేషనల్ కామన్ మొబిలిటీ కార్డ్', మాస్ 2.0 యాప్ పరిధిలోకి తీసుకురావాలని సూచించారు.

రవాణా సంస్థల ఆర్థిక స్థిరత్వం కోసం ప్రకటనలు, డేటా మోనిటైజేషన్, ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం వంటి మార్గాల ద్వారా అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోవాలని నిపుణులు సూచించారు. భవిష్యత్ రవాణా వ్యవస్థలో డ్రైవర్‌లెస్ అటానమస్ షటిల్స్, అర్బన్ ఎయిర్ మొబిలిటీ వంటి సాంకేతికతలను వినియోగించే అవకాశాలపైనా చర్చ జరిగింది. సుస్థిరమైన ప్రజా రవాణా వ్యవస్థ నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, రవాణా సంస్థలు, ప్రైవేట్ రంగ సంస్థల మధ్య సమన్వయం మరింత బలోపేతం కావాలని సదస్సులో పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల ఆర్టీసీ ఎండీలు, అంతర్జాతీయ ప్రతినిధులు, పరిశ్రమల అధినేతలు, స్టార్టప్ నిర్వాహకులు పాల్గొన్నారు.

# నిన్నటివరకు దొరలు.. పరారీలో పెబ్బేరు రైస్ మిల్లర్లు

### ప్రభుత్వానికి 14 కోట్లు ఎగనామం..?
### గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు





**పెబ్బేరు ఆగస్టు 7 (జనంసాక్షి) :** దొరకనంతవరకు దొరలు.. దొరికితేనే బట్టబయలు. వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలోని రైస్ మిల్లర్ల చేతివాటం పతాకస్థాయికి చేరుకున్నది. సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్) ధాన్యం విషయంలో అధికారులు కఠినంగా వ్యవహరించినప్పటికీ కొంతమంది మిల్లర్లు అక్రమాలకు పాల్పడుతున్నారు.

రైస్‌మిల్లర్ల భారీ కుంభకోణం ఇటీవల బట్టబయలైంది. ఈ కేసులో తీగలాగితే రూ.14 కోట్లకు పైగా స్కాం బయటపడింది. 14 కోట్ల మేర ప్రభుత్వానికి కట్టాల్సిన బకాయిలకు ఎగనామం పెట్టడంతో అధికారులు రైస్ మిల్లర్లపై కేసులు నమోదు చేశారు.. దీంతో పోలీసులు రైస్ మిల్లు చుట్టూ తిరుగుతూ మిల్లుల యజమానుల కోసం గాలింపు చేపట్టారు.. కేసు నమోదు విషయం తెలుసుకొని రైస్ మిల్లర్ల యజమానులు ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసి ఎవరికీ దొరకకుండా రైస్ మిల్లర్లు పరారీలో ఉన్నారు.. ఈ ఘటన వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలో చోటుచేసుకుంది.. వివరాల్లోకి వెళితే పెబ్బేరు పట్టణ శివారులోని జాతీయ రహదారిపై ఉన్న సాయి గోపాల్ ఇండోటెక్ రైస్ మిల్లు లో 2022-23 సంవత్సరానికి సంబంధించి రబీ సీజన్ లో 4806 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ దాన్యం నిలువ చేసుకోగా దానికి సంబంధించిన రూ.14,82,76,644 లను ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉండగా నేటి వరకు మిల్లు యజమానులు చెల్లించలేదు. దీనిపై హైదరాబాద్ విజిలెన్స్, ఎన్ఫోర్స్మెంట్, వనపర్తి జిల్లా సివిల్ సప్లై అధికారులు జూలై 27న రైస్ మిల్లులో సోదాలు జరపగా 780 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే చూపిస్తున్నారు. ఇంకా 4021 మెట్రిక్ టన్నుల ధాన్యం స్వాహా చేసినట్లు గుర్తించారు.. దీంతో సోదాలు జరిపిన ఎన్ఫోర్స్మెంట్ ఆఫీసర్లు పూర్తి నివేదికతో వనపర్తి జిల్లా సివిల్ సప్లై మేనేజర్ కు నివేదిక అందజేశారు. వనపర్తి సివిల్ సప్లై డీఎం. ఆంజనేయులు గురువారం పెబ్బేరు పోలీస్ స్టేషన్ లో పిర్యాదు ఇవ్వగా కేసు నమోదు చేసిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకునేందుకు రైసు మిల్లు వద్దకు, ఇళ్ల వద్దకు వెళ్లి తనిఖీ చేశారు. కానీ ఈ విషయం ముందే తెలుసుకున్న మిల్లర్లు ఫోన్లు, స్విచ్ ఆఫ్ చేసి పరారీలో ఉన్నారు.

**అక్రమాల కోసమే మిల్లుల ఏర్పాటు**

పెబ్బేరు మండలంలోని మిల్లుల యాజమాన్యంతో కుమ్మక్కై జిల్లాకు చెందిన కొందరు బడా వ్యాపారులు అక్రమాల కోసమే కొత్తగా రైస్ మిల్లులను ఏర్పాటు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. జూలై 27న నిర్వహించిన తనిఖీల్లో పెద్ద ఎత్తున ధాన్యాన్ని పక్కదారి పట్టించిన పెబ్బేరు మండలంలోని సాయి గోపాల్ ఇండోటెక్ రైస్ మిల్లులో సీఎంఆర్ ధాన్యం కేటాయింపులో గల లొసుగులపై పూర్తిస్థాయిలో అవగాహన ఉన్న సదరు యాజమాన్యం.. ధాన్యం డబ్బులను దండుకునేందుకే మిల్లులను ఏర్పాటు చేసినట్లు చెబుతున్నారు. మిల్లులను ఏర్పాటు చేసి ఇంత పెద్ద ఎత్తున ధాన్యాన్ని తరలించడంపై అనుమానాలు తలెత్తుతున్నాయి. దాదాపు రెండు నుంచి మూడు కోట్లు పెట్టుబడి పెట్టి మిల్లులను ఏర్పాటు చేస్తున్న వ్యాపారులు.. సీఎంఆర్ ధాన్యాన్ని తీసుకుని బియ్యాన్ని ఇవ్వకుండా ప్రభుత్వానికి కోట్ల రూపాయలను ఎగవేస్తున్నారు. అధికారులు సదరు మిల్లులను సీజ్ చేసినా దాని యజమానులు పెద్దగా పట్టించుకోవడం లేదు. మిల్లు విలువ కంటే తరలించిన ధాన్యం విలువ పదింతలు ఉండడంతో ఈ అక్రమ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతున్నది. నాలుగేళ్లుగా జిల్లాలోని కొంతమంది మిల్లర్లు పెద్ద ఎత్తున అవకతవకలకు పాల్పడుతున్నప్పటికీ వారిపై నామమాత్రపు చర్యలే తప్ప కఠిన చర్యలు లేకపోవడంతో అక్రమాలకు మరింత బలం చేకూరింది. ఇటీవల సీఎంఆర్ విషయంలో అవకతవకలకు పాల్పడిన కొన్ని రైస్‌మిల్లులపై కేసులు నమోదు చేసినప్పటికీ పరిస్థితుల్లో మార్పు కనిపించడం లేదు. ఇప్పటికీ జిల్లాలో కొత్తగా రోజుకో రైస్‌మిల్ పుట్టుకొస్తూనే ఉన్నది. వాస్తవానికి ప్రతి సీజన్‌లో రైస్ మిల్లులకు సీఎంఆర్ ధాన్యం కేటాయించేటప్పుడు 10 శాతం బ్యాంకు గ్యారెంటీ తీసుకోవాలనే నిబంధన ఉన్నది. సంబంధిత అధికారులు అవేమి పట్టించుకోకుండా కొత్తగా ఏర్పాటు చేసిన మిల్లులకు ధాన్యాన్ని కేటాయించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొంతమంది అధికారులు మిల్లర్లతో చేతులు కలపడం వల్లే యథేచ్ఛగా భారీ అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా అసలు గుట్టు పెరుమాళ్ళకెరక అన్నట్లు సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్లు ప్రధాన పాత్ర పోషించాయని నిఘా వర్గాలు తేల్చాయి. శుక్రవారం పెబ్బేరు ఎస్సై వెంకటేష్ గౌడ్ సిబ్బందితో వెళ్లి రైస్ మిల్ ను తనిఖీ చేసి వివరాల సేకరించారు.

# వికారాబాద్ ఈవీఎం గోడౌన్ పరిశీలించిన రాష్ట్ర అడిషనల్ సీఈవో



**వికారాబాద్ జిల్లా బ్యూరో ఆగస్టు 7 (జనంసాక్షి);** వికారాబాద్ జిల్లా లో ఈవీఎం గోడౌన్ ను తెలంగాణ రాష్ట్ర అడిషనల్ సి ఇ ఓ వాసం వెంకటేశ్వర్లు,జిల్లా కలెక్టర్ దీపక్ తివారి పరిశీలించారు .శుక్రవారం జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణ లో గల ఈవీఎం గోడౌన్ నుఅడిషనల్ సి ఇ ఓ వెంకటేశ్వర్లు జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, అదనపు కలెక్టర్ వెంకటాచారి గార్ల ల తో కలిసి పరిశీలించారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్లు, ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన గదులను కుణ్ణంగా పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరును తనిఖీ చేశారు. ఈవీఎంల భద్రత విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సంబంధిత రిజిస్టర్ లను పరిశీలించి సంతకాలు చేశారు.ఈ కార్యక్రమములో డి ఆర్ ఓ స్వర్ణ లత,ఆర్ డి ఓ వాసు చంద్ర, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు నెమత్ హాలీ, సిబ్బంది పాల్గొన్నారు

# అభివృద్ధి పేరుతో మా భూములను తీసుకోవద్దు



## మా పొట్ట కొట్టొద్దు

### ముచర్ల గ్రామ సభలో రైతులు నిరసన
### టీజీఐఐసీ భూములు ఇచ్చే ప్రసక్తే లేదు : ముచ్చర్ల గ్రామస్థులు

**మహేశ్వరం, ఆగస్టు7 (జనంసాక్షి):** ఫార్మాసిటీ ,ఫ్యూచర్ సిటీ, అభివృద్ధి పేరుతో పేదల భూములను తీసుకునేలా ప్రభుత్వం కుట్రలు చేస్తుందని ముచ్చర్ల గ్రామస్థులు అన్నారు. శుక్రవారం కందుకూరు మండలం ముచ్చర్ల గ్రామంలో టీజీఐఐసీ ఫార్మాసిటీ కోసం 301 ఎకరాల భూ సేకరణకు సంబంధించి గ్రామ సభను నిర్వహించారు. గ్రామస్తులు ఫ్యూచర్ సిటీ, ఫార్మసిటీ,టీజీఐఐసీ,ప్రభుత్వ అభివృద్ధి పనులకు తమ భూములను ఇచ్చే ప్రసక్తే లేదని గ్రామసభలో గ్రామస్తులు నిరసన తెలిపారు. అనంతరం ముచర్ల గ్రామ సర్పంచ్ ఊటు పద్మ మాట్లాడుతూ...ముచ్చర్ల గ్రామ రెవెన్యూ పరిధిలో గత ప్రభుత్వ హయాంలో ఫార్మసిటి పేరుతో వందలాది ఎకరాల భూమిని ప్రభుత్వం తీసుకుందన్నారు. ప్రభుత్వాలు మారిన పేద ప్రజలకు ఎటువంటి మేలు జరగడం లేదన్నారు. వందల ఏళ్ల నుంచి ముచ్చర్ల గ్రామ ప్రజలందరూ వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతుల పొట్టను ప్రభుత్వం కొట్టొద్దు అన్నారు. గతంలో ఫార్మసీటి కోసం భూములు ఇచ్చిన కొంతమంది రైతులకు నేటికి పరిహారం అందలేదన్నారు. ప్రభుత్వం ఇచ్చే మార్కెట్ ధర ప్రకారం పరిహారం తమకు అవసరం లేదన్నారు. ముచ్చర్ల రెవిన్యూ పరిధిలో ఉన్న భూమిని ప్రభుత్వానికి ఇచ్చే ప్రసక్తే లేదన్నారు. ఈ కార్యక్రమంలో కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి, తహశీల్దార్ గోపాల్,ఆర్డీవో కార్యాలయం డీటీ రాజు, ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు, టిజీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్ ఉమా మహేష్,ముచర్ల గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



# దుందుభి వాగు లో హిటాచీలతో ఇసుక తవ్వకాలు

### పెట్టించుకోని అధికారులు

**రాజాపూర్, ఆగస్టు 7(జనంసాక్షి):** మండల పరిధిలోని రాయపల్లి గ్రామశివారులో దుందుభి వాగును పూర్తిగా ధ్వంసం చేసి, అక్రమ ఇసుక తయారు చేస్తున్న ఇసుక మాఫియా. రాయపల్లి గ్రామశివారులో నే రెండు హిటాచీలతో మట్టిని తవ్వి వందల టిప్పర్ల మట్టిని, కుప్పలు తెప్పలుగా గా పోయడం జరిగింది. మట్టిని ఫిల్టర్ చేసి తయారు చేసిన ఇసుకను వేల టన్నుల్లో డంప్ చేశారు. దుందుభి వాగు పరివాహక ప్రాంతంలో ఎక్కడ చూసినా అక్రమ ఇసుక డంప్ లు, ఫిల్టర్ లు, ట్రాక్టర్లు, టిప్పర్లు, హిటాచీలు కనిపిస్తాయి. కానీ రెవెన్యూ అధికారులకు, పోలీసు, మైనింగ్, ఇరిగేషన్ అధికారులకు ఇవివేవి కనిపించవు. ఇసుక ఫిల్టర్ చేయాడానికి వ్యవసాయ బోర్లను 24గంటలు వాడటంతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. దుందుభి వాగు లోని చెక్ డ్యాం లను ధ్వంసం చేసి రోడ్డు తయారు చేస్తున్న ఇసుక మాఫియా. సహజ వనరులను కాపాడే అధికారులకు పూర్తిగా ధ్వంసం జరుగుపతున్నాయని దశాబ్దాల నుండి పత్రికల ద్వారా తెలుపుతున్నా పట్టించుకునే నాథుడే లేడని చుట్టుపక్కల రైతులు అంటున్నారు. హెల్మెట్ లేకుంటే ఫైన్, లైసెన్స్ లేకుంటే ఫైన్ మరి అక్రమ తవ్వకాలు జరుపుతున్న ఈ హిటాచిలకు యాజమానులు , డ్రైవర్ లపై ఎప్పుడూ కేసులు నమోదు చేయరు. ఈ వాహనాలను ఎప్పుడూ సీజ్ చేయరు. తుతూ మంత్రంగా జరిమానాల పేరుతో అధికారులు వదిలేస్తున్నారు. కాబట్టే దశాబ్దాల కాలంగా దుందుభి వాగు ధ్వంసం అవుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. ఈ అక్రమ ఇసుక తరలింపుకు వాడే టిప్పర్ల వలన రాయపల్లి గ్రామానికి వెళ్ళే రహదారి పూర్తిగా గుంతలు ఏర్పడి ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురి అవుతున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. తహసీల్దార్ రాధాకృష్ణ ను వివరణ కోరగా రెవెన్యూ, మైనింగ్, పోలీసు శాఖ కలిసి చర్యలు తీసుకుంటామని, వాహనాల యజమానులపై కేసులు నమోదు చేస్తామని, వాహనాలను సీజ్ చేస్తామని తెలిపారు.

# స్మార్ట్ రేషన్ కార్డులతో 14 రకాల నిత్యావసర సరుకులు ఇవ్వాలి

### సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్

**ముషీరాబాద్, ఆగస్టు 06 (జనం సాక్షి):** స్మార్ట్ రేషన్ కార్డులతో పాటు పేదలకు 14 రకాల నిత్యావసర సరుకులను రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా పేదల ఆదాయాలు పెరగకపోవడంతో అనేక కుటుంబాలు పౌష్టికాహారానికి దూరమవుతున్నాయని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ఆవేదన వ్యక్తం చేశారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని కోటి 5 లక్షల కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డులు అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో, అర్హులైన ప్రతి కుటుంబానికి ఎలాంటి వివక్ష లేకుండా రేషన్ కార్డులు అందించాలని సీపీఎం డిమాండ్ చేసింది. ప్రస్తుతం రేషన్ కార్డుదారులకు ఒక్కొక్కరికి 6 కిలోల బియ్యం మాత్రమే అందుతున్నాయని, బియ్యంతో పాటు ఇతర నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం లేదని జాన్ వెస్లీ పేర్కొన్నారు. ధరల పెరుగుదల కారణంగా పేద కుటుంబాల్లో పౌష్టికాహార లోపం, రక్తహీనత వంటి సమస్యలు పెరుగుతున్నాయని, తక్కువ బరువుతో పిల్లలు జన్మించడం, అనారోగ్యాలకు గురికావడం వంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయని తెలిపారు. పేదలకు పౌష్టికాహారం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్న ఆయన, ప్రతి వ్యక్తికి 6 కిలోల బియ్యంతో పాటు కందిపప్పు, వంటనూనె, కారం, పసుపు తదితర మొత్తం 14 రకాల నిత్యావసర సరుకులను రేషన్ వ్యవస్థ ద్వారా ఉచితంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని తక్షణమే అమలు చేసి, రాబోయే ఆగస్టు 15 నుంచే స్మార్ట్ రేషన్ కార్డుదారులకు 14 రకాల నిత్యావసర సరుకులు అందేలా చర్యలు తీసుకోవాలని జాన్ వెస్లీ కోరారు.

# మహిళల భద్రతకు 'సహచరి' అండ




### ఎస్‌హెచ్‌జీ మహిళలతో కమ్యూనిటీ పోలీసింగ్‌కు మరింత బలం

**అల్వాల్, ఆగస్టు 7 (జనంసాక్షి):** మహిళలు, చిన్నారుల భద్రతలో ప్రజల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తూ, స్వయం సహాయక సంఘాల మహిళలను కమ్యూనిటీ సేఫ్టీ అంబాసిడర్లుగా తీర్చిదిద్దే 'మీ సురక్ష--సహచరి' కార్యక్రమాన్ని మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ విస్తృతంగా అమలు చేస్తోంది. ఇందులో భాగంగా అల్వాల్‌లోని పీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో మహిళల భద్రత, నేరాల నివారణలో వారి పాత్రపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వుమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ టి. ఉషారాణి మాట్లాడుతూ మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం కీలకమని అన్నారు. సైబర్ మోసాలు, అనుమానాస్పద కార్యకలాపాలు, మహిళలు, చిన్నారులకు సంబంధించిన నేరాల సమాచారాన్ని వెంటనే పోలీసులకు చేరవేయాలని, బాధితులు ఎలాంటి భయం లేకుండా పోలీసులను, షీ టీమ్స్‌ను ఆశ్రయించాలని సూచించారు. సదస్సులో పోలీస్ స్టేషన్లు అందించే సేవలు, మహిళలు, చిన్నారుల రక్షణకు సంబంధించిన చట్టాలు, పోక్సో చట్టం, మానవ అక్రమ రవాణా నిరోధక చర్యలు, సైబర్ నేరాల నివారణ, 'నేను సైతం--2.0', షీ టీమ్స్, భరోసా కేంద్రాల సేవలపై సహచారి సభ్యులకు అవగాహన కల్పించారు. మహిళా పోలీస్ స్టేషన్ సీఐ సుజిత మాట్లాడుతూ కుటుంబ కలహాలు, గృహహింస, మానసిక వేధింపుల బాధితులు మౌనంగా ఉండకుండా పోలీసులను సంప్రదించాలని సూచించారు. మహిళా పోలీస్ స్టేషన్లలో కౌన్సెలింగ్ ద్వారా కుటుంబ వివాదాల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీ పి. గోపాలకృష్ణమూర్తి, అల్వాల్ సీఐ ప్రశాంత్, ప్రాజెక్టు అధికారి సుధాకర్తో పాటు సంబంధిత విభాగాల అధికారులు, షీ టీమ్స్, భరోసా, ఏహెచ్‌టీయూ ప్రతినిధులు, సహచారి సభ్యులు పాల్గొన్నారు.



# రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయుల నిరసన ప్రదర్శనలు




**ముషీరాబాద్, ఆగస్టు 07 (జనం సాక్షి):** విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికై ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యుయస్పిసి) పిలుపు మేరకు దశలవారీ పోరాటంలో భాగంగా శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో విద్యాసంస్థల ఎదుట నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ప్రాథమిక పాఠశాలలకు మరణశాసనం గా ఉన్న జిఒ 25 ను సవరించి ప్రతి ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని, విద్యార్థులు 50 మంది మించితే తరగతికొక టీచర్ ను ఇవ్వాలని,సర్వీసు నిబంధనలు విడుదల చేసి పర్యవేక్షణ అధికారుల పోస్టులను భర్తీ చేయాలని, పెండింగ్ లో ఉన్న ఆరు వాయిదాల కరువు భత్యాన్ని ప్రకటించాలని, 1.07.2023 నుండి పీఆర్సీని అమలు చేయాలని, 2003 డియస్సీ ఉపాధ్యాయులకు 57 మెమోను అమలు చేయాలని, జిఒ 317 బాధితులకు న్యాయం చేయాలని, కెజిబివి ఉద్యోగులకు కనీస వేతనాలు, గురుకులాలకు ఏకరూప సమయసారిణి కావాలని, మోడల్త స్కూల్ టీచర్లకు 010 పద్దులో వేతనాలు ఇవ్వాలని, గిరిజన సంక్షేమ శాఖలో పండిట్, పిఈటి పోస్టులు అప్ గ్రేడ్ చేయాలని తదితర సమస్యలను పరిష్కరించాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు.

# ప్రీమియా అకాడమీ యోలో సమ్మిట్ ప్రారంభం



**ఖైరతాబాద్, ఆగస్టు 07 (జనం సాక్షి) :** 8-12 తరగ తుల విద్యార్థులను భవిష్యత్ వృత్తులకు సన్నద్ధం చేయాలనే లక్ష్యంతో ప్రీమియా అకాడమీ మూడో ఎడిషన్ యోలో స్టూడెంట్ సమ్మిట్‌ను ప్రారంభిం చింది. ఈ కార్యక్రమాన్ని కొరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల ప్రారంభించి, విద్యార్థులు ఆవి ష్కరణ, ఉత్సుకత, నిరంతర అభ్యాసాన్ని అలవ ర్చుకోవాలని సూచించారు. తొలి రోజు విజన్ బోర్డ్ టు యాక్షన్ ప్లాన్ బ్రెయిన్ బ్లూచిప్ ఇన్వెస్ట్‌మెంట్ ఏఐ యుగంలో మానవ నైపుణ్యాల ప్రాధాన్యంపై మాస్టర్‌క్లాస్‌లు, వర్క్‌షాప్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రీమియా అకాడమీ వ్యవస్థాపకురా లు సింధూరి రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో స్పష్ట త, ధైర్యం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడ మే యోలో సమ్మిట్ లక్ష్యమన్నారు. ప్రిన్సిపాల్ తృప్తి రావు మాట్లాడుతూ పాఠ్యపుస్తకాలకు అతీ తంగా వాస్తవ ప్రపంచ నైపుణ్యాలను విద్యార్థులకు అందించే వేదికగా ఈ సమ్మిట్ ఉపయోగ పడు తుందని తెలిపారు. రెండో రోజు అధునాతన వర్క్ షాప్‌లు, ఆవిష్కరణ పోటీలు, నిపుణుల సెషన్‌లు నిర్వహించనున్నారు.

# ఎన్టీఆర్ పాఠశాలలో విద్యార్థినులు అస్వస్థత

### 50మందికిపైగా వాంతులు, విరేచనాలు
### ఆందోళనలో తల్లిదండ్రులు




**మొయినాబాద్, ఆగస్టు07 (జనంసాక్షి) :** మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్‌నగర్‌లో ఉన్న ఎన్టీఆర్ మోడల్ పాఠశాల, బాలికల వసతి గృహంలో 50 మందికి పైగా విద్యార్థినులు వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురైనట్లు సమాచారం.. కలుషిత ఆహారం లేదా తాగునీటి కారణంగానే ఈ పరిస్థితి తలెత్తి ఉండొచ్చని తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా పలువురు విద్యార్థినులు అనారోగ్యానికి గురవుతున్నప్పటికీ విషయం బయటకు రాకుండా యాజమాన్యం గుట్టుచప్పుడు కాకుండా కొందరికి ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పరిస్థితి విషమించడంతో కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లలను హాస్టల్ నుంచి ఇంటికి తీసుకెళ్లినట్లు తెలిసింది. హాస్టల్‌లో అందిస్తున్న ఆహారంలో నాణ్యత లోపాలు ఉన్నాయని, అన్నంలో పురుగులు కనిపించాయని కొందరు తల్లిదండ్రులు ఆరోపించారు. విద్యార్థినులు హాస్టల్‌లో జరుగుతున్న విషయాలను బయటకు చెప్పవద్దని హెచ్చరించినట్లు కూడా వారు వాపోయారు. విద్యార్థినుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకోవాలని, ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. అయితే ఈ ఘటనపై పాఠశాల యాజమాన్యం నుంచి అధికారిక వివరణ రావాల్సి ఉంది.

## ప్రకృతిని నేసిన కళకు జాతీయ గుర్తింపు

- చౌటుప్పల్ కళాకారుడికి జాతీయ చేనేత పురస్కారం
- రాష్ట్రపతి చేతుల మీదుగా పురస్కారం అందుకున్న కళాకారుడు గంజి వెంకటేశ్



**చౌటుప్పల్, ఆగస్టు 7 (జనం సాక్షి) :** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌కు చెందిన ప్రముఖ చేనేత కళాకారుడు గంజి వెంకటేశ్ దేశ అత్యున్నత చేనేత గౌరవాల్లో ఒకటైన జాతీయ చేనేత పురస్కారం–2025ను శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అందుకున్నారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్లో 12వ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును ఆయనకు ప్రదానం చేశారు. ప్రకృతి అందాలు, జీవవైవిధ్యాన్ని ఇక్కత్ నేయు కళ ద్వారా అపూర్వంగా ప్రతిబింబించిన ఆయన సృజనకు గుర్తింపుగా ఈ జాతీయ పురస్కారం లభించింది. దేశవ్యాప్తంగా ఎంపికైన అత్యుత్తమ చేనేత కళాకారుల్లో ఒకరిగా వెంకటేశ్ నిలిచారు. పదో తరగతి వరకు విద్యాభ్యాసం చేసిన వెంకటేశ్ తన తండ్రి గంజి భిక్షపతి వద్ద చేనేత కళను అభ్యసించి, గత 34 సంవత్సరాలుగా ఈ సంప్రదాయ వృత్తిలో కొనసాగుతున్నారు. ప్రకృతి సౌందర్యాన్ని ప్రపంచ ప్రఖ్యాత ఇక్కత్ పద్ధతిలో ఆవిష్కరించాలని సంకల్పించిన ఆయన, ఈ ప్రత్యేక పట్టు చీరను రూపొందించేందుకు 15 నెలల పాటు నిరంతర శ్రమించారు. మొదటి ఆరు నెలలు గ్రాఫ్ పేపర్‌పై అత్యంత సూక్ష్మంగా డిజైన్ రూపొందించారు. అనంతరం ఎలాంటి రసాయనాలు ఉపయోగించకుండా టీ పొడి, కొత్తిమీర, పుదీనా, కాచు, మంజిష్ఠ వంటి సహజ పదార్థాలతో రంగులను తయారు చేశారు. టై అండ్ డై విధానంలో మల్బరీ పట్టుదారానికి రంగులు అద్దేందుకు ఎనిమిది నెలలు కేటాయించి, చివరగా నెల రోజుల పాటు మగ్గంపై ఒక్కో పోగును ఓర్పుతో అల్లుతూ అద్భుత కళాఖండాన్ని సృష్టించారు. ఈ ప్రత్యేక పట్టు చీరపై ఇళ్లు, గుర్రాలు, బాతులు, కుందేళ్లు, నీటి గుర్రం, చేపలు, పడవ, సీతాకోక చిలుకలు, వివిధ రకాల పక్షులు వంటి ప్రకృతి జీవవైవిధ్యాన్ని కళాత్మకంగా ప్రతిబింబించి తన ప్రతిభను కనబరిచి జాతీయ చేనేత పురస్కారం అందుకున్నారు.

# నరుడికి నాగరికత నేర్పింది నేతన్నే

- ప్రజా ప్రభుత్వంలో చేనేతకు మరింత గౌరవం.. నేతన్నలకు మరింత భరోసా
- చేనేతను ఆదరిస్తే నేతన్న కుటుంబాలకు అండగా నిలిచినట్లే
- వారంలో కనీసం రెండు రోజులైనా చేనేత వస్త్రాలు ధరించాలి
- జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో మంత్రి సీతక్క



**హైదరాబాద్, ఆగస్టు 7 (జనంసాక్షి) :** చేనేత రంగానికి మరింత గౌరవం, నేతన్నలకు నిరంతర ఉపాధి, చేనేత ఉత్పత్తులకు మరింత మార్కెట్ కల్పించడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డా.దనసరి అనసూయ సీతక్క అన్నారు. వ్యవసాయం, చేనేత రంగాలు తమ ప్రభుత్వానికి రెండు కళ్ల వంటివని ఆమె పేర్కొన్నారు. చేనేత కార్మికుల కష్టానికి అండగా నిలిచేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు.

జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న చేనేత వేడుకలకు మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, తెలంగాణ రాష్ట్ర చేనేత అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ దూడెం వెంకటరమణ, మాజీ ఎంపీ గుండు సుధారాణి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, చేనేత కళాకారులు పాల్గొన్నారు. పీపుల్స్ ప్లాజాలో ఏర్పాటు చేసిన చేనేత ఎగ్జిబిషన్‌ను మంత్రి సీతక్క ప్రారంభించారు. వివిధ ప్రాంతాలకు చెందిన నేతన్నలు తయారు చేసిన చేనేత చీరలు, వస్త్రాలను ఆమె పరిశీలించారు. స్వయంగా మగ్గం నేసి నేతన్నల నైపుణ్యాన్ని తెలుసుకున్నారు. చేనేత చీరలను కొనుగోలు చేసి, ప్రజలు కూడా చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేయాలని పిలుపునిచ్చారు. చేనేత కళాకారులు, ప్రముఖులను శాలువాలతో సత్కరించారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా ఉన్న చేనేత కార్మికులకు, ముఖ్యంగా తెలంగాణ నేతన్నలు, నేతమ్మలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. వ్యవసాయం తర్వాత అధికంగా కష్టపడేది నేతన్నలేనని అన్నారు. ఒక చీర వెనుక కేవలం నూలుపోగులు మాత్రమే ఉండవని, ఒక కుటుంబం ఆశ, నేతన్న నైపుణ్యం, తరతరాలుగా వస్తున్న సంప్రదాయం ఉంటుందని చెప్పారు. నరుడికి నాగరికత నేర్పింది నేతన్నలేనని మంత్రి సీతక్క అన్నారు. మనిషి వస్త్రాన్ని నేయడం, ధరించడం ప్రారంభించినప్పుడే నాగరిక సమాజానికి నాంది పడిందని తెలిపారు. నేతన్న నూలుపోగు మన నాగరికతకు చిహ్నమని, చేనేత కేవలం ఒక వృత్తి కాదని, అది మన సంస్కృతికి ప్రతీక, సంప్రదాయానికి చిరునామా అని పేర్కొన్నారు. చేనేత రంగాన్ని కేవలం సంక్షేమ కోణంలో కాకుండా ఉపాధి, ఆర్థికాభివృద్ధి, సాంస్కృతిక పరిరక్షణ కోణంలో ప్రభుత్వం చూస్తోందన్నారు. నేతన్నల కష్టం వృథా కాకుండా నిరంతర ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ప్రతి సంవత్సరం కోట్ల రూపాయల విలువైన ఇందిరమ్మ చీరల ఆర్డర్లను చేనేత కార్మికులకు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. దీంతో వేలాది నేత కుటుంబాలకు ఏడాది పొడవునా ఉపాధి లభిస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫామ్‌లకు అవసరమైన వస్త్రాన్ని కూడా చేనేత కార్మికుల నుంచే కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. ప్రతి ఏడాది కోట్ల మీటర్ల వస్త్రాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయడం ద్వారా చేనేత రంగానికి బలమైన మార్కెట్ కల్పిస్తున్నామని తెలిపారు. గతంలో పేరుకుపోయిన నేతన్నల బకాయిలను కూడా తమ ప్రభుత్వం విడతల వారీగా చెల్లిస్తోందని సీతక్క చెప్పారు. చేనేత రంగం అభివృద్ధి, సంక్షేమం కోసం ఇప్పటికే సుమారు రూ.1,300 కోట్ల నిధులను ప్రభుత్వం వెచ్చించిందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో చేనేతకు మరింత గౌరవం, మార్కెట్, భరోసా కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

నేతన్నల చేతుల్లో నూలు చక్రం నిరంతరం తిరిగితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడు తుందని మంత్రి అన్నారు. చేనేత బతికితే వేలాది కుటుంబాలు బతుకుతాయని పేర్కొన్నారు. ప్రజలంతా చేనేతకు తమ వంతు మద్దతు ఇవ్వాలని కోరారు. వారం లో కనీసం రెండు రోజులైనా చేనేత వస్త్రాలు ధరించాలని మంత్రి సీతక్క ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తాను కూడా చేనేత దుస్తులు ధరించడానికి ప్రాధాన్యత ఇస్తానని చెప్పారు. పండుగలు, శుభకార్యాలు, ప్రత్యేక సందర్భాల్లో కనీసం ఒక చేనేత వస్త్రాన్ని కొనుగోలు చేయాలని సూచించారు. ఒక చేనేత వస్త్రాన్ని కొనుగోలు చేయడం అంటే ఒక నేత కుటుంబానికి అండగా నిలవడమేనని అన్నారు. చేనేతను ఆదరించడం అంటే మన సంస్కృతిని గౌరవించడమేనని, నేతన్నలను ప్రోత్సహించడమంటే గ్రామీణ భారతాన్ని బలోపేతం చేయడమేనని మంత్రి సీతక్క అన్నారు. అందరం చేనేతను ఆదరించి నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపాలని పిలుపునిచ్చారు.

### కర్ణాటక దేవదుర్గ బ్లాక్ లో బంగారం-రాగి అన్వేషణకు

# సింగరేణి తొలి అడుగు

- అన్వేషణ ప్రారంభానికి కర్ణాటక మైన్స్ అండ్ జియాలజీ శాఖతో ఒప్పందం
- ఐదేళ్లలో అన్వేషణ పూర్తి చేస్తాం
- సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కె. వెంకటేశ్వర్లు



**సింగరేణి భవన్, ఆగస్టు 7 (జనంసాక్షి) :** సింగరేణి సంస్థ కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్, యాదగిరి జిల్లాల్లో విస్తరించి ఉన్న దేవదుర్గ బ్లాక్ లో బంగారం, రాగి ఖనిజాల అన్వేషణలో మరో కీలక ముందడుగు వేసింది. గతంలో ఈ అన్వేషణకు కేంద్ర ప్రభుత్వ వేలంలో లైసెన్స్ పొందిన నేపథ్యంలో, ఇప్పుడు అన్వేషణ పనులు ప్రారంభించేందుకు కర్ణాటక రాష్ట్ర మైన్స్ అండ్ జియాలజీ శాఖతో సింగరేణి సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. బెంగళూరులోని కర్ణాటక మైన్స్ అండ్ జియాలజీ శాఖ కార్యాలయంలో గురువారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో కర్ణాటక డీఎంజీ డైరెక్టర్ శ్రీ రంగప్ప , సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కె. వెంకటేశ్వర్లు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం, సింగరేణి సంస్థకు లైసెన్స్ లభించిన దేవదుర్గ ప్రాంతంలోని 199.13 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో అన్వేషణను ఐదేళ్లలో పూర్తి చేయడానికి అంగీకారం కుదిరింది. ఈ సందర్భంగా డైరెక్టర్ ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ శ్రీ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. దేవదుర్గ ప్రాంతంలోని బంగారం, రాగి ఖనిజాల అన్వేషణకు సింగరేణి గతంలోనే లైసెన్స్ సాధించిందని, ఇప్పుడు వాస్తవ అన్వేషణ కార్యక్రమం ప్రారంభించేందుకు అవసరమైన ఒప్పందం కుదిరిందన్నారు. ఇప్పటికే అధికారులను నియమించామని, త్వరలో మిగిలిన అధికారులు, సిబ్బందిని కూడా నియమించి రెండేళ్లలోపు +4 అన్వేషణను విజయవంతంగా పూర్తి చేస్తామని తెలిపారు. ఇతర రాష్ట్రంలో ఈ స్థాయిలో ఖనిజ అన్వేషణ చేపట్టడం సింగరేణి చరిత్రలో ఇదే తొలిసారి అని పేర్కొన్న ఆయన, 13 దశాబ్దాల అన్వేషణ అనుభవం కలిగిన సంస్థగా ఈ కొత్త ప్రాజెక్టును కూడా విజయవంతంగా పూర్తి చేస్తామనే పూర్తి విశ్వాసం తమకు ఉందని తెలిపారు. ఈ సందర్భంగా సహకారం అందించిన కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వానికి, మైన్స్ అండ్ జియాలజీ శాఖకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అన్వేషణ కార్యక్రమంలో భాగంగా రిమోట్ సెన్సింగ్, జియోలాజికల్ మ్యాపింగ్, జియోఫిజికల్ సర్వేలు నిర్వహించి, ఎంపిక చేసిన ప్రాంతాల్లో స్కౌట్ డ్రిల్లింగ్ చేపడతారు. అనంతరం సేకరించిన నమూనాలపై పెట్రోగ్రాఫిక్, మినరలాజికల్ అధ్యయనాలు నిర్వహిస్తారు. ఈ నమూనాలపై సమగ్ర మూలకాల విశ్లేషణను కొత్తగా కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన సింగరేణి జియోసైన్స్ ల్యాబొరేటరీలో చేపట్టనున్నారు. అనంతరం సమగ్ర నివేదికను కర్ణాటక మైన్స్, జియాలజీ శాఖకు సమర్పిస్తారు. ఆ నివేదిక ఆధారంగా మరింత విస్తృత స్థాయి అన్వేషణ చేపట్టే అవకాశం ఉంటుంది. కార్యక్రమంలో ఎక్స్‌ప్లోరేషన్ జీఎం శ్రీ పంకజ్ కుల శ్రేష్ఠ, డీజీఎం (జియాలజీ) వి.రాజేశ్వర్, డీవైఎఫ్‌ఎం లక్ష్మీప్రియ, సీనియర్ లా ఆఫీసర్ ప్రభందిత తదితరులు పాల్గొన్నారు.

# వద్దిరాజు బ్యాడ్మింటన్ ఆట



**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** పార్లమెంటేరియన్స్ 6వ జాతీయ బాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీలు ఢిల్లీ కానిస్టిట్యూషన్ క్లబ్ ఇండియా ఆవరణలోని జిందాల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో జరుగుతున్నాయి. బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర శుక్రవారం సాయంత్రం ఈ పోటీల్లో పాల్గొని తన తోటి ఎంపీలతో కలిసి ఉత్సాహంగా ఆడారు. గురువారం (6వతేదీ) ప్రారంభమైన ఈ పోటీలు ఈనెల 9వతేదీ ఆదివారం వరకు కొనసాగుతాయి.













## గాధిర్యాల్ రైస్‌మిల్లులో భారీ కుంభకోణం!

**శ్రీరామ రైస్‌మిల్ యజమానిపై కేసు నమోదు..**

**సివిల్ సప్లై అధికారుల తనిఖీలో వెలుగులోకి అవకతవకలు**



**మహమ్మదాబాద్, ఆగస్టు 7 (జనంసాక్షి) :** రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వానికి అప్పగించే ప్రక్రియలో భారీ అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. మహమ్మదాబాద్ మండలంలోని గాధిర్యాల్ గేట్ సమీపంలో ఉన్న శ్రీరామ రైస్‌మిల్‌లో సివిల్ సప్లైఅధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా భారీ అక్రమాలు వెలుగులోకి వచ్చినట్లు అధికారులు తెలిపారు. తనిఖీల్లో సుమారు 2,800,టన్నుల ధాన్యం అవకతవకలు సంబంధించిన అవకతవకలు గుర్తించినట్లు ప్రాథమిక అంచనాల ప్రకారం రూ.10 కోట్ల వరకు ప్రభుత్వానికి నష్టం జరిగి ఉండవచ్చని అధికారులు వెల్లడించారు. ఇందుకు సంబంధించి పూర్తి స్థాయి విచారణ కొనసాగుతోందని తెలిపారు. ఈవ్యవహారంలో అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న శ్రీరామ రైస్‌మిల్ యజమాని రుద్రారెడ్డిపై కేసు నమోదు చేసినట్లు మహమ్మదాబాద్ ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.







Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara